# మరువు మహర్షి బోధలు

2

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

# మరువు మహర్షి బోధలు

## 2

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2017 ప్రతులు : 1,000
(56వ గురుపూజా మహోత్సవములు)

వెల : రూ॥ 100-00

ప్రతులకు :
**ధనిష్ఠ పబ్లికేషన్స్,**
15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531, 2509154.
e-mail : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-89467-66-1

ముద్రణ :
**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**
మధురానగర్,
విశాఖపట్నం - 530 016.
ఫోన్ : 0891-2796538, 9849996538.



# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**“ధనిష్ఠ”** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు “ధనిష్ఠ” 1992లో జన్మించినది.

**“ధనిష్ఠ”** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**“ధనిష్ఠ”** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – “జగద్గురు మందిరము”గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయు లకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

## విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| | పరిచయము | ......... | 11 |
| 1. | స్థూల సూక్ష్మములు | ......... | 25 |
| 2. | జరిగిన కథ | ......... | 27 |
| 3. | మహాత్ముని రాక | ......... | 29 |
| 4. | భేదములు - సమన్వయము | ......... | 31 |
| 5. | శక్తి - సమర్థత - నాణ్యత | ......... | 32 |
| 6. | ధీరత్వము | ......... | 33 |
| 7. | విహంగములు | ......... | 35 |
| 8. | అగ్నియోగము | ......... | 36 |
| 9. | సందేశము | ......... | 37 |
| 10. | అనుకరణ | ......... | 39 |
| 11. | బంధము - మోక్షము | ......... | 40 |
| 12. | విషము - అమృతము | ......... | 41 |
| 13. | అర్హతలు | ......... | 42 |
| 14. | నా ఉంగరము | ......... | 43 |
| 15. | మాయ | ......... | 44 |
| 16. | తపస్సు - సిద్ధి | ......... | 45 |
| 17. | నిర్ణయము | ......... | 47 |
| 18. | మాతృస్థానము | ......... | 49 |
| 19. | అగ్నిస్థానము | ......... | 50 |
| 20. | సత్యప్రమాణము | ......... | 52 |
| 21. | సమతుల్యము | ......... | 53 |
| 22. | సత్పురుషులు | ......... | 55 |
| 23. | తాళము చెవి | ......... | 57 |
| 24. | మానవ కృషి | ......... | 58 |
| 25. | కత్తి - సూది | ......... | 60 |
| 26. | సమన్వయ మార్గము | ......... | 62 |

| | | | |
|---|---|---|---|
| 27. | అలౌకిక దృష్టి | ......... | 64 |
| 28. | స్వతంత్రత – 1 | ......... | 66 |
| 29. | స్వతంత్రత – 2 | ......... | 68 |
| 30. | స్వతంత్రత – 3 | ......... | 70 |
| 31. | సూత్ర చతుష్టము | ......... | 71 |
| 32. | సాహసము | ......... | 73 |
| 33. | మనస్సు | ......... | 75 |
| 34. | కాలము – తత్త్వము – ధర్మము | ......... | 77 |
| 35. | అరుదైన ధైర్యము | ......... | 79 |
| 36. | అమృత పాత్ర | ......... | 80 |
| 37. | అంతము – ఆరంభము | ......... | 81 |
| 38. | పురోగతి – అవరోధములు | ......... | 82 |
| 39. | చైతన్య వికాసము | ......... | 83 |
| 40. | మానవ మూషికములు | ......... | 85 |
| 41. | మానవ సింహము | ......... | 87 |
| 42. | మానవ పావురములు | ......... | 89 |
| 43. | భావ దేవాలయము | ......... | 90 |
| 44. | గురు సాన్నిధ్యము | ......... | 91 |
| 45. | కలికాల వికారము | ......... | 93 |
| 46. | స్తోత్ర ఫలము | ......... | 95 |
| 47. | క్లుప్తీకరణము | ......... | 97 |
| 48. | సమర్పణ – సన్యాసము | ......... | 98 |
| 49. | ధీరత | ......... | 99 |
| 50. | బోధిసత్త్వుడు | ......... | 101 |
| 51. | సాధన | ......... | 103 |
| 52. | సిద్ధి | ......... | 105 |
| 53. | క్రమోన్మీలనము | ......... | 106 |
| 54. | ముఖవర్చస్సు | ......... | 108 |

| | | | |
|---|---|---|---|
| 55. | అస్వస్థత – సూచనలు | ......... | 110 |
| 56. | సహజ పరిణతి | ......... | 112 |
| 57. | నిరుపయోగ మౌనము | ......... | 114 |
| 58. | మానవుని విలువ | ......... | 115 |
| 59. | క్రియాశీలత | ......... | 117 |
| 60. | దేహ బలము | ......... | 119 |
| 61. | ఒత్తిడి – సూర్యోపాసన | ......... | 121 |
| 62. | ప్రాచీన ఆరాధనము | ......... | 123 |
| 63. | చర్విత చర్వణము | ......... | 124 |
| 64. | విషమ పరీక్ష | ......... | 126 |
| 65. | రక్షణ రహస్యము | ......... | 127 |
| 66. | సహనౌ యశః | ......... | 128 |
| 67. | మానవ అలసత్వము | ......... | 130 |
| 68. | అగ్ని యోగి | ......... | 132 |
| 69. | నిరహంకారము | ......... | 134 |
| 70. | లోతు – ఉన్నతి | ......... | 136 |
| 71. | సంసిద్ధత | ......... | 138 |
| 72. | ఋజు మార్గము | ......... | 140 |
| 73. | జీవన రాగము | ......... | 142 |
| 74. | ప్రార్థనా ప్రయోజనము | ......... | 144 |
| 75. | చికిత్స | ......... | 146 |
| 76. | దైవస్ఫూర్తి | ......... | 148 |
| 77. | ఏకాంతము | ......... | 150 |
| 78. | ఋతుమార్గము | ......... | 152 |
| 79. | విచిత్రము | ......... | 154 |
| 80. | దివ్య సందేశము | ......... | 156 |
| 81. | సర్దుబాట్లు | ......... | 157 |
| 82. | సాధనలో రకములు | ......... | 158 |

| | | | |
|---|---|---|---|
| 83. | విద్యావిద్యలు | ......... | 160 |
| 84. | దైవము | ......... | 161 |
| 85. | నేను - ప్రజ్ఞ | ......... | 163 |
| 86. | నేను - వెలుగునీడలు | ......... | 165 |
| 87. | అగ్నిప్రేరకము | ......... | 167 |
| 88. | పొట్టితనము | ......... | 168 |
| 89. | కేంద్రమునకు కేంద్రము | ......... | 169 |
| 90. | శిరస్త్రాణము | ......... | 170 |
| 91. | సంకల్పము - శాస్త్రము | ......... | 171 |
| 92. | స్థూల - సూక్ష్మములు | ......... | 173 |
| 93. | సూక్ష్మద్వారము | ......... | 175 |
| 94. | పవిత్రీకరణము | ......... | 176 |
| 95. | అగ్నియోగము | ......... | 177 |
| 96. | భావ పరిణామము | ......... | 178 |
| 97. | స్వ భావములు | ......... | 179 |
| 98. | హెచ్చరిక | ......... | 180 |
| 99. | అగ్ని ప్రజ్వలనము | ......... | 181 |
| 100. | కవచము | ......... | 182 |
| 101. | లౌక్యము | ......... | 184 |
| 102. | వింత జబ్బు | ......... | 185 |
| 103. | పిల్లచేష్ట | ......... | 186 |
| 104. | కాంతిరేఖ | ......... | 187 |
| 105. | సత్య సాధన | ......... | 189 |
| 106. | గోరి | ......... | 191 |
| 107. | బానిసత్వము | ......... | 193 |
| 108. | లోకహితుడు | ......... | 194 |
| 109. | ఆరోహణము | ......... | 195 |
| 110. | మార్గము - గమ్యము | ......... | 196 |
| 111. | నిరహంకారము | ......... | 197 |

# మరువు మహర్షి బోధలు

# పరిచయము

**మ**రువు, దేవాపి మహర్షులు అనాది నుండి భూమిజీవుల యుద్ధరణకై నిర్విరామము కృషిచేయుచున్న మహర్షులు. వీరి పుట్టు పూర్వోత్తరములు ఎవరికిని తెలియదు. అన్ని పురాణము లందును వీరు గోచరింతురు. విష్ణుపురాణము నుండి భాగవత పురాణము వరకుగల పురాణములలో అచ్చటచ్చట ప్రస్తుతి చేయబడిరి. జీవులకు వర్ణాశ్రమ ధర్మములను నేర్పుచు, ధర్మము నందు రుచి కల్పించి, ధర్మమార్గమున నడిపింపజేసి, ఉత్తీర్ణులను గావించుట వీరుచేయు మహత్తర నిష్కామ కర్మయజ్ఞము. ఈ యజ్ఞము వీరు అనాదికాలముగ నిర్వర్తించుచున్నారు. జగద్గురువు మైత్రేయునికి దివ్యప్రణాళికలో తోడ్పాటు గావించు చున్నప్పటికిని వీరు మైత్రేయునికన్న పూర్వులు. వాసుదేవుని వ్యూహమునందు జీవుల ఉద్ధరణకై యుగముల తరబడి పనిచేయుచున్న మహానుభావులు.

మరువు మహర్షి సూర్యవంశపు రాజు. ఇక్ష్వాకు వంశము వాడు. అనగా శ్రీరాముని వంశము వాడు. అనగా త్రేతాయుగము నుండి భూమిపై నున్నవాడు. అంతకు ముందునుండి కూడ యుండి యుండవచ్చును. అట్లే దేవాపి మహర్షి చంద్రవంశపు రాజు. ఇతడు భీష్ముని తండ్రి అయిన శంతన మహారాజునకు అగ్రజుడు. ఆ జన్మలో దేవాపి బ్రాహ్మణ ధర్మమును స్వీకరించి తనకు తానుగ కోరి రాజ్యము

నుండి బహిష్కరించబడెను. నిజమునకు కురు సామ్రాజ్యమునకు అతడు చక్రవర్తియై యుండవలసినది. కాని వాసుదేవుని వ్యూహము ననుసరించి వాసుదేవుడు శ్రీకృష్ణుడుగ అవతరించుటకు ముందుగనే రాజ్యపరిత్యాగము గావించెను.

దేవాపి మహర్షి ఆ జన్మలో శ్రీకృష్ణుని కన్న నాలుగు వందల సంవత్సరముల ముందు పుట్టినవాడు! నాలుగు వందల సంవత్సర ముల ముందు దైవము యొక్క వ్యూహమును గ్రహించి, అందు తన పాత్రను గ్రహించి, తదనుగుణముగ చక్రవర్తిత్వమును పరిత్యాగము చేయుటకు కొంత దూరదృష్టి కావలెను. అది ఋషి దృష్టి. దేవాపి ఋషి మాత్రమే కాదు, రాజర్షి. రాజర్షి మాత్రమే కాదు మహర్షి. దేవాపి, శంతనుడు, కాశీరాజగు దివోదాసు, జగద్గురువగు పరాశర మహర్షి- వీరందరును సమకాలికులు. వీరు ఆ జన్మల యందు, ఆయా దేహములందుండుట పురాణ పురుషుని అవతరణమునకు నాలుగు వందల సంవత్సరముల ముందు జరిగినది. దేవాపి మహర్షియై నిలుచుట ఆ జన్మలో జరిగిన దనుకొనలేము. అట్లే మరువు మహర్షి కూడ.

ఈ ఇరువురు మహర్షులు వాసుదేవుని వ్యూహమున అనాది కాలముగ పనిచేయుచు తెరవెనుక నుండుట కెక్కువ అభిలషించి రని అనిపించును. మహర్షుల పుట్టు పూర్వోత్తరములు మనకు పురాణ సంహితలలో లభ్యమగును. వారు చేసిన సాధనలు కూడ లభ్య మగును. కాని ఈ మహర్షుల పుట్టు పూర్వోత్తరములు, సాధనలు పురాణముల యందు కూడ లిఖింపబడలేదు. అది బహుశః వారి

సంకల్పము కావచ్చును. పరాశరులు విష్ణుపురాణమున, వేదవ్యాసులు భాగవత, కల్కి పురాణములలో వీరిని తగు మాత్రము పరిచయముచేసి వదలినారు. అదియును అతి స్వల్పమే.

ఈ భూమి పుట్టుక ముప్పదికోట్ల సంవత్సరముల క్రితము జరిగినది. అందు ఆది మానవుని అవతరణము ఒక కోటి, ఎనభై లక్షల సంవత్సరముల క్రితము జరిగినది. ఈ కోటి ఎనభై లక్షల సంవత్సరములలో కొన్ని మన్వంతరములు గడచినవి. ఎన్నియో యుగములు గడచినవి. మానవజాతి ఉద్ధరణమునకై కుమారులు, ఋషులెందరో భూమికి దిగి వచ్చిరి. ఈ మొత్తము భూమి కథ, మానవజాతుల కథ ఈ మహర్షు లిద్దరికిని కరతలామలకములు. ఈ భూమిపై జరుగుచున్న జగన్నాటకము నంతయు వారు సాక్షీ భూతులుగ గమనించుచు తమవంతు కరవ్యమును వాసుదేవుని కల్పితముగ నిర్వర్తించుచున్నారు. వీరిరువురును దివ్య దేహధారులు. అణువుల నుండి అప్పటికప్పుడు దేహమును కట్టుకొని ప్రత్యక్షము కాగలరు. అట్లే అదృశ్యము కాగలరు. స్మరణ మాత్రమున సాన్నిధ్యము నివ్వగల వాసుదేవోపాసకులు. వీరు విష్ణు స్వరూపులు, త్రికాలజ్ఞులు. వీరికి తెలియని మన్వంతర రహస్యములు, మతాతీత సత్యములు, మానవజాతి కథలు లేవన్నచో అతిశయోక్తి కాదు.

రాశిచక్రమున సద్గురుపరంపర అంతయు ఆషాఢ శ్రావణ ములను అధిష్ఠించి యుండగ మరువు మహర్షి మేషరాశిని, దేవాపి మహర్షి ధనూ రాశిని అధిష్ఠించి యున్నారు. ధనూరాశి మూలాధార ప్రజ్ఞ. అచటనే యోగప్రజ్ఞ యున్నది. ఈ కేంద్రమునకు దత్తాత్రేయ

డధిపతి. కపిలుడు, గణపతి, హనుమంతుడు అచ్చటి గురుపరంపర. ఇట్టి మహత్తరమైనటువంటి యోగప్రజ్ఞకు అధిపతిగ ధనూ రాశిని పరిపాలించుచున్న దేవాపి మహర్షి, సమస్త యోగ మార్గములను ప్రచోదనము గావించుచు జీవులను త్వరితగతిని పురోగమింప చేయు చున్నారు. యోగమునకు మూలాధారము ఆరంభముకాగ సహస్రారము గమ్యమై యున్నది. అచ్చట ఆ ప్రజ్ఞను పరిపాలించుచు మరువుమహర్షి జీవుల నూర్ధ్వముఖమున కాకర్షించు చుండును. ఉత్తమలోకముల ప్రవేశము కల్పించు చుండును. యోగ దండము లేక బహ్మాదండము నకు ఇరుపార్శ్వముల వీరిరువురు పనిచేయుచు భూమి యందలి సమస్త గురు పరంపరకు స్ఫూర్తి నిచ్చుచు మరుగున నున్నారు.

రహస్య దివ్యాచరణము వీరిరువురి ప్రత్యేకత. రహస్యము, మౌనము, అనిర్వచనీయమగు పవిత్రత, ఆత్మత్యాగము వీరి సహజ లక్షణములు. తమకు పేరు ప్రతిష్ఠలు కలుగకుండ దైవమునకే పేరు ప్రతిష్ఠలు కలుగునట్లు ప్రవర్తించు దివ్యజీవులు, చిరంజీవులు.

చిరంజీవులు లోక కల్యాణార్థమై భగవత్ వ్యూహము ననుస రించి జన్మలెత్తుచు తామెవరో తమకు జ్ఞప్తి కలిగి వర్తింతురు. జన్మ ప్రయోజనములను మరువక, లోకహితార్థమగు కార్యముల నొనర్చుచు మనస్సు, ఇంద్రియము, శరీరములను హితకార్యముల కొరకై ఉప కరణములుగ వాడుదురు. చచ్చిన వెంటనే మనుష్యు డంతరించునని, శరీరముకన్న వేరుగ జీవుడు లేడని మ్లేచ్ఛ సిద్ధాంతము. ఇట్టివారు తమ శరీరమే తామనుకొని జీవించు చుందురు. కాని శరీరము లంతము లైనపుడు జీవులా శరీరములతో మరణింపరన్నది శాశ్వత

సత్యము. శరీరము మరణించినప్పుడు జీవుడు మరియొక శరీరమును కోరును. నూతన శరీరము కర్మాను బంధమై ఏర్పడును. నూతన శరీరమున జన్మించినపుడు మునుపటి జీవితము మరపునకు వచ్చును. నిజమునకు మరపే మృత్యువు. మరపు లేనివానికి మృత్యువు లేదు. మృత్యువనగా మరపేకాని, శరీర మంతమగుట కాదని పెద్దల యవగాహన. జన్మల తరబడి తామెవరో, తమ కర్తవ్యమేమో జ్ఞప్తి యున్న వారిని చిరంజీవు లందురు. వీరు మరపులేని వారు గనుక మృత్యువును దాటిన వారు. వీరికనేక జన్మలలో ఒకే స్మృతి అనుస్యూత ముగ నుండును. ఒకే పవిత్రమైన కార్యము ఇన్ని జన్మల తరబడి నిర్వహించుటలో వారు నిమగ్నులై యుందురు.

ఇట్టి చిరంజీవులను గూర్చి వేద పురాణాది సంహితలలో ఉదహరించినపుడు ఏ జన్మలోని శరీర నామముతో చెప్పవలెను? జన్మమున కొకపేరు తల్లితండ్రుల ద్వారా ఏర్పడుచుండును. ఆ పేరు ఆ జన్మాంతము వరకే. మరల జన్మ ఎత్తినపుడు మరియొక పేరు యేర్పడుచుండును. దుస్తులు మారినట్లు జన్మములు మారుచుండగ, ఇన్ని దుస్తుల యందు ఒకే మనిషిని ఒకే నామముతో పిలుతుము గదా! అట్లే సూక్ష్మలోకములలో శరీరములు మారినప్పటికిని నామము ఒక్కటియే యుండును. చిరంజీవుల కిట్టి నామముండును. వారిని గూర్చి ప్రస్తావించినప్పుడు వారి మొత్తము వృత్తాంతమునకును, జన్మ లన్నింటికిని సూచకమగు సంకేతనామ మొకటి యుండుట సదుపాయము. ఇది వేదసంప్రదాయము. వేద పురాణములయందు గోచరించు ఋషుల పేర్లలో ఎక్కువ భాగమిట్టిదే. ఈ విధముగ

దేవాపి, మరువు మహర్షులు వేదవ్యాసుని పురాణములయందు పేర్కొనబడిరి. అంతకు ముందు పరాశరులున్నప్పటి దేవాపి, మరువు మహర్షుల శరీరములు వేరు. వేదవ్యాసులకు సమకాలికులుగ, మైత్రేయునికి ప్రాణమిత్రులుగ నున్న ఈ ఋషుల దేహములు వేరు.

ఈ మహర్షులు మూడు రకముల దేహములు కలిగి మూడు విధములగు కార్యములను ఒకేమారు నిర్వర్తింపగలరు. వీరికి వజ్ర శరీరముండును. ఇది దాదాపు శాశ్వత శరీరమే. దీనిని కారణ శరీరమని కూడ అందురు. ఇందుండి వెలుగు లోకముల కార్యములను చక్కపెట్టుదురు. సూక్ష్మతరమగు దివ్య ప్రణాళికను గ్రహింతురు. తదనుగుణముగ కర్మాచరణ మేర్పరచుకొందురు. వీరికి సూక్ష్మ శరీరముకూడ నొకటి యుండును. ఇందుండి సూక్ష్మ శరీర కార్యములు చక్కబెడుదురు. భౌతిక శరీరమొకటి యుండును. ఇందుండి భూలోక కార్యములను చక్కబెడుదురు. అవసరమగుచో ఒకే సమయమున పలుచోట్ల కనిపింపగలరు. ఈ శరీరము లన్నియు అష్టాంగ యోగమున మానవునికి సిద్ధించగలవు. ఇవి అద్భుతములు కావు, కృషి ఫలములు. జన్మల తరబడి చేసిన నిష్ఠాయుతమైన యోగసాధన యోగసిద్ధి నిచ్చును. ఈ విషయమున మహర్షులు పరిపూర్ణసిద్ధులు.

ఉదాహరణకు మరువు, దేవాపి మహర్షులు హిమాలయములలోని కలాప గుహల యందు నివసించుచు భౌగోళికముగ లోకహితులకు, సత్సాధకులకు ప్రేరణ కలిగించుచు జాతి పురోగమునకై అహర్నిశలు పనిచేయుచుందురు. వీరు శ్రీకృష్ణుని ద్వారకా జీవన సమయమున కృష్ణునికి తోడ్పాటు గావించుచు అనేకానేక

కార్యములను ద్వారకలో చక్కపెట్టుచుండెడివారు. అచ్చట వారి పేర్లు శతానీకుడు (దేవాపి), మధువ్రతుడు (మరువు).

అధర్మ మెప్పుడును ధర్మముపై దురాక్రమణము చేయుచు నుండును. దీనికి అమాయక ప్రజలు బలియగు చుందురు. ఇట్టి ప్రజలను కాపాడుకొనుట, ధర్మమును నిలబెట్టుట ప్రకృతి యొనర్చు నొక కర్తవ్యము. యిట్టి పరమ ప్రయోజనమును సాధించుటకు ప్రకృతియే కొందరు జీవులను సిద్ధులుగను, చిరంజీవులుగను తీర్చి దిద్దుకొనుచుండును. నిజమునకు యీ ఋషులు శ్రీకృష్ణుని అప్రాకృత శరీర నిర్మాణ మహాయజ్ఞమున కూడ పాల్గొనినారు. పరాశరులు, మైత్రేయులు, వేదవ్యాసులతో కలసి తమ వంతు కర్తవ్యములెన్నియో వినియోగించినారు. రహస్య జీవనమున కిచ్చగించుటచే పురాణ సంహితలలో తమను గూర్చిన ప్రస్తావన బీజప్రాయముగ నుండునట్లు జాగ్రత్త పడినారు. మైత్రేయుడు, వేదవ్యాసులు ఎంతటి ప్రసిద్ధిగాంచిన యోగులో వీరుకూడ నట్టి వారే. ఆరాధ్యనీయులే. ప్రాతఃస్మరణీయులు, వాసుదేవ స్వరూపులు.

భాగవతమున వేదవ్యాస మహర్షి ద్వాదశ స్కంధమున వీరిని గూర్చి ఇట్లు పలికెను. *"శంతనుని యనుజుండగు దేవాపియు, ఇక్ష్వాకు వంశజుండగు మరుత్తును, యోగయుక్తులై కలాప గ్రామ నిలయులై కలియుగాంతమువరకు వాసుదేవ ప్రేరితులై ప్రజలను ఆశ్రమాచార ధర్మములు తప్పకుండ నడుపుచు నారాయణ స్మరణంబు నిత్యం బొనర్చి కైవల్యపద ప్రాపులగుదురు."*

అట్లే నవమ స్కంధమున దేవాపి, మరువు మహర్షులీ విధముగ తెలుపబడిరి.

*శీఘ్రునకు మరువు అను రాజశ్రేష్ఠుండు పుట్టెను. ఆ రాజ యోగి సిద్ధుడై కలాప గ్రామంబున నున్నవాడు. కలియుగాంతంబున నష్టంబయ్యెడు సూర్యవంశంబు గ్రమ్మర బుట్టింప గలవాడు.* (12వ అధ్యాయము)

*దేవాపి కలాప పురం*
*బావాసము కాగ యోగియై యున్నాడు*
*ర్వీవర కలి నష్టంబగు*
*జైవాతృక కులము మీద సంస్థాపించున్.*

విష్ణు పురాణమున వీరిని గూర్చి పరాశర మహర్షి యిట్లు పలికెను :

*దేవాపి : పౌరవో రాజా మరుశ్చిశ్వాకు వంశజ మహాయోగ బలౌపేతౌ, కలాపగ్రామ సంశయో కృతేయుగ ఇహాగత్వ ఛత్ర ప్రవర్తకే హితౌ భవిష్యతో మనోర్వేశే బీజ భూతౌ వ్యవస్థితౌ యేతేన క్రమయోగేన మనుపుత్రే వసుంధర కృత త్రేతాది సంజ్ఞాని యుగాని త్రీర్యుగ భుజ్యతే కలౌతు బీజ భూతాస్తే కేచి తిష్ఠంతి భూతలే. యద్వైవ దేవాపి మరువు సంప్రాప్తం సమవిస్తతే.*

కురువంశపు రాజగు దేవాపి, ఇక్ష్వాకు వంశపు రాజగు మరువు సమస్త యోగ సిద్ధులు కలిగి కలాప గ్రామమున నివసించు చున్నారు. కృతయుగము వచ్చు వరకు వారు జీవులచే హితము ననుసరింప చేయుచు మరల వర్ణాశ్రమ ధర్మములను భూమిపై స్థాపింపగలరు. వారు రాబోవు మన్వంతరమునకు బీజములై నిలచుటకు సంకల్పించి

నారు. భవిష్యత్ యుగములలో (కృత, త్రేత, ద్వాపరములలో) వారు జీవులకు యోగము, ధర్మముల నందింపజేయుదురు.

కల్కి పురాణమున కూడ నిదే విషయమును వేదవ్యాస మహర్షి పేర్కొనుట జరిగినది. అందిట్లున్నది : మరువు, దేవాపి మహర్షులు *యోగేశ్వరులై ఋషి నివాసమైన కలాప గ్రామమున వసించి యున్నారు. కలియుగాంతమున వీరు మరల వర్ణాశ్రమ ధర్మములను మానవుల కందించి నూతన శకము ఆరంభింతురు. (9వ స్కంధము, 22వ అధ్యాయము)*

కల్కిపురాణము, రెండవ అధ్యాయము, ప్రథమ అంశమున శ్రీమహావిష్ణువు బ్రహ్మదేవునితో పలికిన పలుకులుగ యిట్లు లిఖించ బడినది : *నీ ప్రార్థన ననుసరించి నేను భవిష్యత్తున శంబళ గ్రామమున విష్ణు యశస్సు, సుమతి దంపతికి జన్మించ గలను. నా నలుగురు సోదరులతో నేను మరల అజ్ఞానమును, అధర్మమును ఛేదించి ధర్మమును స్థాపించగలవాడను. నీవును, దేవతలు మీ మీ అంశలలో జన్మించి నాకు తోడ్పాటు గావించగలరు. నా హృదయేశ్వరియగు శ్రీలక్ష్మి సింహళరాజగు బృహద్ధృతుడు* – కౌముదులకు *పద్మ అను నామమున జన్మించగలదు. అపుడు నేను భూవలయమునకు మరువును చక్రవర్తిగను, దేవాపిని జగద్గురువుగను స్థాపింతును. అప్పటినుండి భూమిపై సత్య యుగ మారంభమగును. శాశ్వత ధర్మము నెలకొల్ప బడును. కలి వధింపబడును.*

కల్కి పురాణమున యింకను యిట్లున్నది : మునుల ప్రార్థనల నంగీకరించి కల్కి భగవానుడు గంగాతీరమున వారికి ప్రత్యక్షమై

మునుల నందరిని పలుకరించి ఆశీర్వదించి యిట్లనెను. “పుణ్య పురుషులారా! మీ యందు దేదీప్యమైన కాంతులతో వెలుగొందుచున్న ఆ యిరువురి మహాత్ములెవరు? వారిచ్చటి కెందుల కేతెంచిరి? వారు గంగకు ఎందుకు ప్రార్థనలు సలుపుచున్నారు?” అనుచూ యింకను వారిరువురిని ఉద్దేశించి యిట్లనెను. “మీరు జాహ్నవి నెందుకు ఆరాధించు చున్నారు? మీరెవరు? మీ నామములేవి?”

అపుడు మరువు మహర్షి ముందుకేతెంచి, కల్కి దేవునికి నమస్కరించి తన పుట్టు పూర్వోత్తరములను తెలుపుచు, తన నామమును తెలిపెను. చతుర్ముఖ బ్రహ్మ నుండి మరీచి పుట్టుట, మరీచి నుండి మరువు పుట్టుట, మరువు నుండి ఇక్ష్వాకు పుట్టుట అట్లు వరుసగ వంశపరంపరను విశదీకరించి తాను యిక్ష్వాకు వంశజుడనని, శీఘ్రుని కుమారుడనని వివరించెను. మరువు ఇంకను యిట్లనెను.

కృత యుగాంతము నుండి ఈ కలియుగాంతము వరకు కలాప గ్రామము నివాసిగ తాను ధ్యాన నిమగ్నుడై లోకహితమున నిలచి వాసుదేవ ప్రేరితముగ నిలచియున్నానని తెలిపెను. మరువు మహర్షి బ్రహ్మనుండి జనించిన వంశమునందు తాను యాభై తొమ్మిదవ వానిగ తెలుపుకొనెను. అప్పుడు కల్కిదేవుడు కోరగ దేవాపి మహర్షి కూడ తన పుట్టు పూర్వోత్తరములను తెలుపుచు చంద్ర వంశమును వర్ణించెను. అత్రి మొదలుకొని, ప్రతీకుని వరకు గల చంద్రవంశమును తెలిపి, తాను ఆ వంశమున నలుబది రెండవ తరమునకు చెందినవాడనని, తన నామము దేవాపియని తెలిపెను. తాను కూడ మరువు మహర్షివలె కలాప నివాసియై, ధ్యానయోగమున

నిలచి వాసుదేవప్రేరితముగ లోకహితముగ కార్యముల నొనర్చితినని తెలిపి నమస్కరించెను.

అపుడు కల్కిదేవుడు సంతసించి వారిరువురి నాశీర్వదించి యిట్లు పలికెను :

*"మీరిరువురు అసమాన ధర్మస్వరూపులు. వాసుదేవుని వ్యూహము ననుసరించి జగత్‌హితముగ యుగముల తరబడి మానవజాతి ఉద్ధరణకై కృషి సలిపినారు. నేను కలి ధర్మమును నశింపచేసి కృత ధనువును స్థాపించగలవాడను. అపుడు మరువు భూవలయమునకు చక్రవర్తియై, అయోధ్య రాజధానిగ ధర్మ పరిపాలనమును ప్రారంభింప గలడు. దేవాపి జగద్గురువై హస్తిన కేంద్రముగ విశ్వ విజ్ఞాన విద్యను, వేద వేదాంగములను, యోగ మును జీవుల కందించుచు వారిని అమృతత్త్వదిశగ నడుపగలడు."*

ఇట్లనేకానేక విషయములు కల్కిపురాణమున ఈ మహర్షుల గురించి వివరింపబడినవి.

ఇట్లు మరువు, దేవాపి మహర్షులు కలాప గుహలయందు నివసించుచు, మైత్రేయునితో సహకరించుచు విశ్వవిజ్ఞాన విద్యయు, యోగమును భూగోళ వ్యాప్తి గావించుచు తదనుగుణమైన శిష్య పరంపరను నేర్పరచుచు సాగుచున్నారు.

వీరి ప్రభావముననే గ్రీకు, ఇజ్రాయిల్ దేశములలో విశ్వ విజ్ఞానవిద్య ఆయా శతాబ్దములలో వెలుగొందినది. పైథాగొరస్, సోక్రటీస్, ప్లాటో, అరిస్టాటిల్ మొదలగు జ్ఞానులు గ్రీకు దేశమున

కెంతయో జ్ఞానము నందించిరి. గ్రీకు దేశపు జ్ఞానులలో పైథాగొరస్ అత్యంత ప్రసిద్ధి గాంచినాడు. దేవాపి మహర్షియే పైథాగొరస్‌గ జన్మించి గ్రీకు దేశీయులకు జ్ఞానభిక్ష పెట్టెనని యొక నానుడి కలదు.

అటులనే రోమనుల యందు పుట్టిన చక్రవర్తు లందరికిని సూర్యవంశపు రాజైన మరువు ప్రచోదన కారకుడని కూడ యొక నానుడి కలదు. రోమను సామ్రాజ్యమున ఘనకీర్తి సంతరించు కొన్నవాడు జూలియస్ సీజర్. అతడు మరువు మహర్షి యొక్క ప్రధాన శిష్యుడని యొక నానుడి కలదు. రోమను రాజ్యమే లేనిచో ఐరోపా ఖండమునకు నాగరికతయే యుండెడిది కాదు. సంఘ జీవనము, నగరవాసము, పౌర బాధ్యతలు, రాజ్యాంగము, చట్టము పరిరక్షణ, ఖగోళ భూగోళ శాస్త్రములు, జ్యోతిష్యము– ఇత్యాది మానవ వికాస పరమగు అంశము లన్నియు రోమనులే ఐరోపా ఖండమున ప్రవేశ పెట్టిరి. అంతకుముందు శతాబ్దముననే ఆర్యావర్తపు ప్రజలు నాగరికులై యుండెడివారు. హస్తిన, ద్వారక, వారణాసి, మధుర, ఉజ్జయిని విశిష్ట నగరములుగ నుండెడివి.

యూదు ప్రజలను బానిసత్వము నుండి విడిపించిన మోజెస్ మరువు మహర్షి అవతారమని, అతి బలిష్టమైన ఈజిప్ట్ చక్రవర్తిని నిర్జించి, బానిసత్వపు చెరనుండి విడిపించి యూదులకు స్వాతంత్ర్యము కల్పించుటయే కాక, వారికి జ్ఞానభిక్షను కూడ పెట్టినాడు. అటులనే యూదు ప్రవక్తలో అత్యంత ప్రాధాన్యము వహించిన జ్ఞాని 'యలీజా' దేవాపి మహర్షి యొక్క అవతారమని కొందరు భావించుచుందురు.

ఏసుక్రీస్తు జన్మ సమయమున అతనిని సందర్శించి, ఆశీర్వ

దించిన ముగ్గురు జ్ఞానులును మైత్రేయుడు, మరువు, దేవాపి మహర్షు లని హిమాలయములలోని ఆశ్రమవాసులు భావింతురు. చివరి మూడు సంవత్సరములు ఏసును నడిపించినది కూడ మైత్రేయుడే అని వారి భావన.

ఇటీవల శతాబ్దములలో నెపోలియన్ చక్రవర్తికి ప్రేరణ కలిగించి, ఐరోపా ఖండమంతటికిని ఒకే రాజ్యాంగ విధానము నందింపజేసిన బృహత్తర ప్రయత్నము వెనుక మరువు మహర్షి హస్తమున్నదని ప్రతీతి.

పంతొమ్మిదవ శతాబ్దములో ఈ మహర్షులే హెలీనా పెట్రోవ్నా బ్లావెట్స్కీకి దర్శన మిచ్చి జ్ఞానబోధను గావించి, పిండాండ బ్రహ్మాండ సృష్టి రహస్యములను, మన్వంతర రహస్యములను తెలియజెప్పి, విశ్వ విజ్ఞాన విద్యకు మరియొక ప్రయత్నము చేసినారు. ఆ ప్రయత్నమునకు కొనసాగింపుగ 20వ శతాబ్దమున 'ఏలిస్. ఏ. బెయిలీ' అను ఆంగ్ల యువతిని, నికోలారోరిక్' అను రష్యాదేశపు యువరాజును, భారతీయులైన 'కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్యుల' వారిని తమ స్పర్శచే ప్రభావితము గావించి భౌగోళిక జ్ఞానసంపదను సంతర్పణ గావించినారు.

భౌగోళికముగ ఐదువేల సంవత్సరములలో ఈ మహర్షులు గావించిన మహత్తర కార్యములన్నియు కూడ మానవ పురోభివృద్ధికే నిర్దేశింపబడినవి. జీవ పరిణామమునకే తోడ్పడినవి. గత ఐదువేల సంవత్సరములుగ వీరు తీర్చిదిద్దిన శిష్యపరంపర భౌగోళిక వ్యాప్తి చెందినవి. అన్ని రంగములలోను నిష్ణాతులైన శిష్యులు కలరు.

అమెరికన్ ప్రెసిడెంట్ 'రూజ్‌వెల్ట్', శాస్త్రవేత్త 'ఐన్‌స్టీన్' వంటి మహా పురుషులు కూడ వీరి శిష్యకోటిలోని వారే. మతముల కతీతమైన సత్యములను దర్శింపచేయుచు మత ఛాందసము నుండి జీవుల నుద్ధరించుట కూడ వీరు చేయు ప్రయత్నములోని భాగములు. అట్టి వారిలో భరత దేశము నేలిన అక్బరు చక్రవర్తి యొకరు. ఆయన దేవాపి మహర్షి శిష్యుడని ప్రతీతి.

ఋషి కార్యముల నెరుగుట ఋషుల అనుగ్రహముననే తెలియగలదు. అంతయును తెలుపుట ఎటులను సాధ్యము కాదు. కాని వారి స్మరణ సకల శుభంకరము. అట్టి ప్రయత్నమే ఇది. మరువు, దేవాపి మహర్షుల గూర్చి పురాణ సంహితల యందున్నను తెలిసిన వారు బహుకొద్ది. గుప్తముగ వేల సంవత్సరముల నుండి జగద్ధిత కార్యముల నొనర్చుచున్న ఈ మహర్షులను గూర్చిన విషయములు ఇప్పుడిప్పుడే జనసముదాయము పరిచయము లోనికి వచ్చుచున్నవి.

వారిని గూర్చి పరిచయము చేయు ప్రయత్నములో ప్రస్తుతము వీరి బోధనలలో రెండవ భాగమును అందించుచున్నాము.

# 1

## స్థూల సూక్ష్మములు

సద్గురువు ఒకడు సూక్ష్మలోకముల గూర్చి, స్థూలలోకముల గూర్చి వివరించుచున్నాడు. ప్రవచనము ముగిసిన వెనుక శిష్యుడొకడు సద్గురువును సమీపించి "స్థూల లోకము నందు నివసించు వారికి మీవంటి మహాత్ములు, సూక్ష్మ లోకానుభూతిని అనుగ్రహింపవచ్చును కదా! అట్లనుగ్రహించినచో స్థూలముపై మోహము విడును కదా! మీరందించిన వివరణము సూక్ష్మలోక స్ఫూర్తి నిచ్చినను మరల అభ్యాసవశమున స్థూలము నందే స్థిరపడును. కావున మీ అనుగ్రహమే మాకు శరణ్యము" అని పలికెను.

సద్గురువు నవ్వుచు నిట్లనెను : ప్రవచనము వినుటవలన స్ఫూర్తి కలిగిన దంటివి. నీకు కలిగిన స్ఫూర్తి నిజమైనచో ఆచరణకు పూను కొనుము. ఆచరణ యందు శ్రద్ధను బట్టి అనుగ్రహము లభించును. తగు మాత్రము స్ఫూర్తి, శ్రద్ధ లేనివారిని దైవమైనను అనుగ్రహింపలేడు. నిజమునకు అనుగ్రహింపవలసినది దైవమే. అతని సంకల్పమే మాబోటి వారి నుండి నిర్వర్తింపబడు చుండును.

"స్థూలబుద్ధితో సూక్ష్మమున ప్రవేశింపలేరు. బుద్ధి సూక్ష్మమై నపుడే సూక్ష్మలోకముల పరిచయము కలుగును. మరియొక మార్గము

లేదు. అనుగ్రహించినను అది వినియోగపడదు." అనుచూ సద్గురువు శిష్యుని ఒక నీటితొట్టె వద్దకు కొనిపోయెను. అందు తొంగి చూడుమని సూచించెను. శిష్యుడు చూచినాడు. గురువు "ఏమి కనబడు చున్నది?" అని ప్రశ్నించెను. శిష్యుడు "నా ముఖము కనుపించు చున్నది." "నీ చిటికెన వేలు గోరుతో నీటి నొక్కమారు తాకుము. అటుపైన ఏమి కనుపించుచున్నదో చూడుము" అని గురువు పలికెను. శిష్యుడట్లు చేసి చూచినప్పుడు కలతబారిన నీటిలో ముఖము కనుపింప లేదు. ఏదో వికృతమగు ఆకారము కనుపించినది. శిష్యుడపుడు ముఖము కనుపించుట లేదనియు, వికృతమైన ఆకార మేదియో కనుపించు చున్నదనియు తెలిపెను. అప్పుడు సద్గురువు నవ్వుచు నిట్లనెను.

"నీ చిటికెన వేలు గోరుకన్న నీరు సూక్ష్మము, వేలిగోరు స్థూలము. స్థూలముతో సూక్ష్మమును తాకినప్పుడు నీకేమియు కనపడ లేదు. అట్లే స్థూలబుద్ధిలో వున్నవానికి సూక్ష్మ దర్శన మందించినను అందదు. సూక్ష్మమును చూచుటకు నీవు చేయవలసిన కృషి చాల వున్నది. ఇంద్రియములను ఏకాగ్ర మొనర్చి అంతరంగమున సూక్ష్మ రూపమును మనస్సుతో చూచుటకు ప్రయత్నింపుదు. ఇంద్రియ ముల అంతరంగమున కాకర్షింపబడి సూక్ష్మతను పొందగలవు. అపుడే దర్శనము లభించగలదు. నీ వంతు ప్రయత్నము లేనిదే నీకేమియు సమకూరదు. ప్రయత్నమున శ్రద్ధ, భక్తి మెండుగ నున్నపుడు అనుగ్రహముగ అది సిద్ధించును. సాధన లేని సిద్ధి లేదు."

## 2

## జరిగిన కథ

**లో**కమున సాధకులకు మమ్ములగూర్చి ఒక దురభిప్రాయ మున్నది. అదేమనగ, వారి కష్టకాలమందు మా సహకారము లభించ దనియు, వారి కష్ట నష్టములను వారే భరించవలెనని, వారి కర్మమును వారే అనుభవించవలెనని, అట్టి విషయములను గూర్చి సద్గురు సహాయమును కోరరాదని, కోరినను లభించదని. ఇది పూర్ణమైన అజ్ఞానము.

**మేము భూమిపై నున్నది మీకు సర్వవిధములుగ తోడ్పడుటకే గాని, కేవలము సాక్షీభూతులుగ ప్రేక్షకులవలె చూచుటకు గాదు. మేమెప్పుడును మీకు తగు సూచనలు చేయుటకును, సహాయ పడుటకును ప్రయత్నించుచునే యుందుము. మీరు మత్తులై, ప్రమత్తులై అందివచ్చు సహాయమును నిరాకరించు చుందురు. మీరు అప్రమత్తు లైనచో మా సహాయ సహాకారము లెంతగ నున్నవో గమనింపగలరు.** ఈ విషయమున నేను మీ కొక జరిగిన కథను వినిపింతును.

దేశికుడొకడు జీవనము కష్టతరమై ధనము కొరకు బాధపడు చుండెను. అతడు ప్రతినిత్యము ఉదయముననే పవిత్ర గ్రంథము చదువు అలవాటు కలవాడు. చదివిన విషయమును అవగాహన

కొరకై ఒక పుస్తకమున వ్రాసుకొను అలవాటు కూడ కలవాడు. ఆ రెండిటిని ఒక పవిత్రమగు ప్రదేశమున నుంచుకొనుట అతని కలవాటు. అతడు గమనించుటకు వీలుగ నుండునట్లు నేను ఒక పదితులముల బంగారు నాణెమును ఆ పుస్తకముల క్రింద నుంచితిని. మరునా డుదయము యథావిధిగ పుస్తకములను వినియోగించెనే కాని, ఆ నాణెమును చూడలేదు. పుస్తకముల నందుకొను హడావిడిలో నాణెమును గమనింపకపోగా, దానిని ఆ పుస్తకములతోనే ప్రక్కకు నెట్టి వేసెను. నాణెము పుస్తకపు పీఠము సందులో పడిపోయినది. నేటికిని ఆ నాణెమట్లే యున్నది. అందించు సహాయమును అందుకొన లేకపోవుట దురదృష్టము. కర్మను దాటించుటకు ప్రయత్నించినను మీరు దాటలేకపోవుట జరుగుచునే యుండును.

# 3

## మహాత్ముని రాక

మహాత్ముడొకడు జిజ్ఞాసువులను తీర్చిదిద్దెను. కొందరతనిని అనుసరించిరి. అందులో తొమ్మిదిమంది పురుషులు, ముగ్గురు స్త్రీలు. పురుషులు జ్ఞానమును మాత్రమే ప్రధానముగ గొనిరి. స్త్రీలు జ్ఞానముతోపాటు, మహాత్ముని సాన్నిధ్యమును కూడ పొందిరి. వారికి బోధన, బోధకుల వ్యత్యాసము కరగిపోయెను. బోధకుడు లేక బోధన లేదు. బోధన లేక బోధకుడు లేడు. స్త్రీ అనుయాయులకు రెండును ఒకటిగ మారినవి. వారు గురువునకు శుశ్రూషలు కూడ చేసిరి. సాన్నిధ్యమును స్థిరపరచుకొనిరి. పురుషులు జ్ఞానమును పొంది, విజ్ఞానులైరి.

మహాత్ముడు నిష్క్రమించు సమయమున స్త్రీలలో నొకరిని పిలచి, బీజప్రాయమునగు సూత్రము నందించెను. దానికోర్వలేక యితర అనుయాయులు ఆమెను మట్టుబెట్ట జూచిరి. వారి హింసలను తప్పించుకొని ఆమె అదృశ్యమయ్యెను. కాలక్రమమున వృద్ధాప్యమురాగ ఆ స్త్రీ అనుయాయి మహాత్ము డిచ్చిన సందేశము అందించ అశక్తురాలై నది. నేటికిని మహాత్ము డందించిన ఉపదేశము నిక్షిప్తమై యున్నది.

బహిర్గతము చేయుటకు మరల మహాత్ముడే రావలెనని ప్రకృతి నిర్ణయించినది. అతని రాకకై ఎదురుచూచు వారు ఎందరో ఏర్పడి యున్నారు. ఇది జరిగిన కథ. వింత కథ. ఈ కథలో మీకును భాగ మున్నది.

# 4

## భేదములు - సమన్వయము

**జ్ఞా**నము పొందుటకు జ్ఞానపర విషయములందు గౌరవముండ వలెను. ఎట్టి పరిస్థితులలోను జ్ఞానము నవహేళన చేయరాదు. నీవట్లు చేసినచో నీ ఆలోచనా సరళియందు నీకు తెలియకయే కొన్ని వక్రత లేర్పడును. జ్ఞానమే నీ ప్రజ్ఞ నుద్ధరించు శక్తి. నీ యందు శిథిలమైన ప్రజ్ఞను పునర్నిర్మాణము చేసుకొనుటకు జ్ఞానోపాసనము చాల ముఖ్యము. జ్ఞానము నుపాసించువాడు జ్ఞాన మూలమునకై వెదకును. మూలమున అన్ని బోధనా విధానములు సమన్వయింపబడును. అట్టి సమన్వయము జ్ఞానము ననుసరించుట వలన ఏర్పడవలెను. సమన్వయ మేర్పడు వరకు జ్ఞాన సముపార్జనము జీవితమున సాగవలెను. మత భేదములన్నియు మతి భేదములే. మతిని హరించి, బుద్ధియందు స్థిరపడిన ప్రజ్ఞకు సమన్వయము సులభము. అట్టి సమన్వయము నీకును అందగలదు. మా ఆశ్రమములందు అన్ని బోధనలు సమన్వయింపబడి యున్నవి. సత్యదర్శనమే నిజమగు సమన్వయ మీయగలదు. అంతవరకు ప్రజ్ఞయందు భేదము లుండును.

# 5

## శక్తి - సమర్థత - నాణ్యత

**మా** బోధనలయందు నివాస మేర్పరచుకొను ధైర్యము, స్థైర్యము మీకున్నదా? అట్టి ధైర్యములేనివా రిటు చూడకుడు. మా బోధనల యందు మీరు వసించుట నేర్చినచో, క్రమముగ మా బోధలు మీ యందు వసించ గలవు. వాని నాచరించుచు మీరు ముందుకు సాగవచ్చును. బోధనల నాచరించుట వలన సత్కార్యము లావిష్కరింప బడును. సత్య మవతరించుచు నుండును.

నిత్యము పఠన పాఠనములు చేసినచో మీయందు నూతనోత్సాహము స్థిరముగ నుండును. క్రొత్త ఊపిరి కలిగి, జీవితము తేలిక యగును. శ్రేయోదాయక మగును. ఇతరులకు శ్రేయస్సు మీ కార్యముల ద్వారా జరుగుచుండగ మీ శ్రేయస్సుకూడ సురక్షిత మగును. మీరు ప్రత్యేకించి మీ కొరకై తపన పడనవసరము లేదు.

మీ కొరకు తపన పడుట అజ్ఞానము. ఇతరుల కొరకు తపన చెందుచు, శక్తి సామర్థ్యములను పెంచుకొనుచు, నాణ్యతను మెరుగు పరచుకొనుచు ముందుకు సాగువారికి మే మెప్పుడును సున్నితముగ సాన్నిధ్య మిత్తుము.

# 6

## ధీరత్వము

ఏకాంతము, నిశ్చలత్వము, పరిస్థితుల ప్రభావమునకు లొంగ కుండుట, జీవన పరిస్థితులను గూర్చి విచారింపకుండుట, ధనము సంపద ప్రోగుచేసుకొను ప్రవృత్తి లేకుండుట ధీరుని ప్రవృత్తియని మా మతము.

ధనము, సంపద ప్రోగుచేసుకొను ప్రవృత్తి యున్నచో తీరుబడి లేక నీవు ప్రపంచమున మునిగి యుందువు.

కర్తవ్యమున సదా నిలచియుండనిచో నీ జీవన పరిస్థితులు తరచు గుర్తునకు వచ్చి వాని స్వభావమునకు లోనగుచుందువు.

నిన్ను గూర్చిన విచారమున మునిగియున్నచో హృదయము దుర్భరమగును.

ఏకాంతము అభ్యసింపనిచో నీ యందలి పంచభూతములకు అలజడి ఏర్పడును. ప్రశాంతత యుండదు.

ఇక నీవు ధీరుడ వెట్లు కాగలవు? ఇహపర సుఖములకు రెంటికిని ధీరత్వమే ప్రధానమై యున్నది. భీరువులు సదా భయమున

జీవించు చుందురు. వారనుభవించు ఆనందము నేతి బీరకాయలోని నేతి వంటిది.

పై తెలిపిన సూత్రములను మార్గదర్శకములుగ నేర్పరచుకొని జీవించుట నేర్చుకొనుము.

7

## విహంగములు

పక్షులు ప్రభాత సమయముననే గానము చేయుచు తమ గూడులనుండి ఆకాశము దిశగ పయనించును. ఆకాశమువైపు పయనించుటకు గల ఉత్సాహమే ప్రభాతగానముగ వాటినుండి వెలువడుచున్నది. దూరదూర ప్రదేశములకు వినువీథిని విహరించుచు పయనించుట పక్షుల ప్రధాన లక్ష్యము. భుజించుట అప్రధానముగను, ఆకాశమున విహరించుట ప్రధానముగను గోచరించును. తిండికై ప్రాకులాడు రాబందులు అంతగ విహరించవు.

ఇట్లు ఆకాశమున ప్రీతి చెంది గానము చేయుచు యానము చేయు జీవులు ప్రకాశమును పొందుచు తేలికైన జీవితములు జీవింతురు. వారి హృదయ గానమే పెదవుల నుండి ప్రభాత రాగములై వెలువడును. ఇట్టివారి జీవితము చీకటులను పారద్రోలి వెలుగు నాహ్వానించు నట్లుండును. తిండి, బట్ట, నివాసము వీరికి ప్రధానము.

ధైర్యముతో, సాహసముతో, ఉత్సాహముతో కర్తవ్య నిర్వహణ మున నిలచి, స్వార్థమును మరచి జీవించువా రందరు మా దృష్టి యందు పడుదురు. వారికే మా సంఘమున సభ్యత్వము క్రమముగ నేర్పడగలదు.

## 8

# అగ్నియోగము

చలి, భయము అనుచు మొద్దు రగ్గులను కప్పుకొనుచు వణకుచు జీవించుట వ్యర్థము. భయపడు వారికి విజయము లేదు. పురోగతియు లేదు. ప్రార్థనల ద్వారా మీయందు ధైర్యము, విశ్వాసము అను అగ్నిని రగుల్కొల్పుడు. భయమను రగ్గులను విసర్జింపుడు. ఆర్తితో చేయు ప్రార్థనలు అగ్నిని రగుల్కొల్పి, విస్తారమైన విహంగముల నేర్పరచును. గరుత్మంతుడు అట్టి విహంగములను ధరించి కర్తవ్య నిర్వహణమున ఇంద్రుని సహితము నిర్జించినాడు.

భక్తులకు భయమెందులకు? భక్తి పెరిగినకొలది అభయ మేర్పడవలెనే కాని, భయముండరాదు. తల్లి, తండ్రి, గురువు, దైవముల దీవెనలు చతుర్భుజములై మిమ్ములను కాచుచుండగ సృష్టియం దేశక్తియు మిమ్ములను నశింపజేయలేవు. నిందలు, ఆరోపణలు, విమర్శలు మిమ్ములను కృశింపచేయలేవు. మీపై యితరులు చూపు కఠినత్వము చేయు దుర్మార్గము మిమ్ములను తాకలేవు.

అభయము, జ్ఞానము అను రెండు రెక్కలతో నా అగ్నియోగము సాధింపబడుచున్నది. నీవును అగ్నియోగమున నియుతుడవు కమ్ము.

# 9

## సందేశము

**కొం**దరు దేవాలయములు నిర్మించుచు నుందురు. కొందరు దేవాలయము లవసరము లేదని, విశ్వమే దేవాలయమని సిద్ధాంతీ కరింతురు. తమ సిద్ధాంతములు గొప్పవని అహంకరింతురు. మరికొందరు నిర్మించిన దేవాలయములను ధ్వంసము చేయుట సిద్ధాంతముగ జీవింతురు. ఇంకొందరు మారణాయుధములను తయారు చేయుచు వాని అవసరమును వక్కాణింతురు. ఇంకొందరు నిరాయుధీకరణమని ప్రదర్శనలు జరుపుదురు. ఇవన్నియు టీ కప్పులో తుఫానుల వంటివి.

ఇట్లు పలు విధములగు సిద్ధాంతములలో తలమునకలు వేయు చున్నవారు తలలెత్తి ఆకాశమును చూడరు. ఆకాశమున ఏ సిద్ధాంత ములు లేవు. భూమి చుట్టును ఆవరించియున్న ఆకాశము నిర్మలము గను, నిశ్శబ్దముగను నుండును. వెలుగు సహజగుణమై యుండును. అందింకను మిరిమిట్లు గొలుపుచు తారకలు నిత్యము నొక సత్యమును బోధించుచున్నవి. "పదార్థము కొరకు ప్రాకులాడకుడు. పదార్థ విషయ ములలో చిక్కుకొనకుడు. పదార్థాకర్షణకు సుదూరమున నుండుడు.

పదార్థమునందున్నను, ఆకాశమువలె నిర్మలముగ నిశ్శబ్దముగ నుండుడు. తారకలవలె మెఱయుచుండుడు. పరమార్థముతో కూడి పదార్థమున విహరించుడు. పరమార్థమును వీడినచో పదార్థము రొంపియగును. రొంపిలో కూరుకొనువారికి సుఖముండదు.”



# 10

## అనుకరణ

గురువును, దైవమును ఆరాధించుట వారియందు భాసించు సద్గుణములను అనుకరించుట కొరకే. సద్గుణముల ననుకరించుట వలన, సద్గుణముల రూపమున నీయందు దైవ మవతరించును. దోషములెన్నుట, ఆరోపణలు చేయుట నీవు చేయు ప్రార్థనలను నిర్వీర్యము చేయగలవు. శ్రేష్ఠమైన గుణములు కలవారిని అనుక రించుట యనగ, వారి గుణముల ననుకరించుటయే. వారియందు దయ, ప్రేమ, దానము, త్యాగము, పరహితము, ధైర్యము, దైవభక్తి యిత్యాదివి గోచరించును. వీని వలననే వారిని శ్రేష్ఠులుగ గౌరవింతురు. చిల్లర విషయముల ననుకరించుట వలన ఉపయోగము లేదు. సద్గుణముల ననుకరించుట వలన శ్రేష్ఠత్వ మబ్బును. దివ్యత్వము అవతరించుచు నుండును.

బుద్ధి ననుకరించదలచినచో అహింసాదిగ గల పంచసూత్రము లను అనుకరించవలెను. క్రైస్తు ననుకరించ దలచినచో, విశ్వరూపుడగు దైవము నారాధించుచు, విశ్వప్రేమను, ఆత్మ త్యాగమును అనుకరించ వలెను. పవిత్రమూర్తుల ఆరాధనము వారి ననుకరించుటకే కాని చిల్లర విషయములకు కాదు.

## 11

## బంధము - మోక్షము

**ఆ**త్మజ్ఞానమునం దాసక్తి లేనపుడు జీవితమున బంధముల నేర్పరచుకొనుట జరుగును. బంధ మోచమునకే ఆత్మజ్ఞానము. తన్ను తాను మరచినవాడు ఆనందము నెట్లు పొందగలడు? దుఃఖములను భరించుచు ఎండమావులవలె ఆనందమున కెదురు చూచుటయే జరుగును. అట్లెదురు చూచుచునే మరణించుట కూడ జరుగును.

తన్నుతాను మరచినవాడు, తన నుండి ఏర్పడిన విషయముల యందు చిక్కుపడును. తన్ను తా నెరిగినవాడు చిక్కులనుండి ఒక్క మారుగ విముక్తి చెందును. తనచుట్టు ఏర్పడిన జీవితము తాను సంకల్పించినదే. తాను కల్పించినదే. కల్పన నిజమని భావించువాడు వెఱ్ఱివాడేగదా! కవి పాత్రలను సృష్టించినపుడు, సన్నివేశములను సృష్టించినపుడు, క్లిష్ట సమయములను సృష్టించినపుడు, తాను బాధ పడునా? అట్లే నీ జీవితమను గ్రంథమునకు నీవే గ్రంథకర్తవు. నీవు కల్పించినవి నిన్ను ఏడ్పించుచున్నచో జీవితము పరిహాసమైనట్లే. నీవు కల్పితుడవు కాదు గదా. నీవు శాశ్వతుడవు. నీ కల్పన నుండి నీవు విడిపడి యుండుట నేర్చుము. అదియే మోక్షము.

12

## విషము - అమృతము

చిరాకు, కోపము విషము వంటివి. అవి అపాయకరములు. వాని ప్రభావము నీ నరములపై యుండును. ఈ విషము నరముల నాశ్రయించి దేహమంతయు వ్యాపించును. రక్తకణములను కలుషితము చేయును. అస్వస్థత క్రమముగ పెరిగి భయంకరమై స్థిరపడును. నిర్మల ప్రదేశమున విశ్రాంతిగొనుటయే దీనికి పరిష్కారము. చిరాకు, కోపము వలన నీవు సృష్టించుకొనిన అస్వస్థత అను అసురులు క్రమముగ నిన్ను హింసించుచు మరణింపజేయును.

విశ్రాంతి గొనుట ఈ అస్వస్థత కొక విరుగుడుకాగ, అందము నారాధించుట మరియొక విరుగుడగును. నీకందము అని అనిపించు విషయములు నీ నరములకు బలము కలిగించును. నీకానందము కలిగించును. అట్లందము నారాధించుచు, ఆస్వాదించినచో ప్రేమ అను అమృతత్వము పుట్టును. ఈ అమృతము చిరాకు, కోపము అను విషమును హరించును.

ఉగ్రుడైన నరసింహుని కోపమును శమింపజేయుటకు అందము నకు ప్రతిరూపముగ లక్ష్మీదేవి చెంచులక్ష్మిగ అవతరించుటలోని రహస్యమిదియే. సృష్టి అందమును గమనించుచు ఆరాధించుము. స్వస్థత కిదియే పరిష్కారము.

13

## అర్హతలు

1. సద్గురువును సమీపించువారు తమ భావముల యందలి మూఢ విశ్వాసములను విసర్జించవలెను.
2. జ్ఞానమునకై అమితాసక్తి కలిగియుండవలెను.
3. ధీరులై యుండవలెను. (భయపడరాదు)
4. త్రికరణశుద్ధి కలిగియుండవలెను.
5. దైవమునందు భక్తి, విశ్వాసము కలిగియుండవలెను.
6. అప్రమత్తులై యుండవలెను.
7. పరిశ్రమించుటకు సంసిద్ధత యుండవలెను.

అట్టివారికే సద్గురు దర్శన, స్పర్శన, సంభాషణాదులు ఆత్మ పరముగ సిద్ధించును.

14

## నా ఉంగరము

నే నెవరిని నా శిష్యునిగ అంగీకరింతునో వానికి ఒక ఉంగర మిత్తును. నా ఉంగరము ధరించినవాడు యినుమడించిన శక్తి సామర్థ్యములు కలిగియుండును. ఆ శక్తి సామర్థ్యము లన్నియు నియమనిష్ఠలు పాటించుచు, నిర్మాణాత్మకమగు కార్యములు చేయుటకే. బలహీనతలు కారణముగ కొందరు నే నందించిన శక్తి సామర్థ్యములను దుర్వినియోగము చేయుదురు. అపుడా ఉంగరము మాయమగును. ఇక ఆ జన్మమునకు ఆ శిష్యునకు నా సాన్నిధ్యము కలుగదు. కర్మము ననుభ వించుచు ప్రాయశ్చిత్త పడినచో మరుజన్మలో సాన్నిధ్యము కలుగ వచ్చును.

15

## మాయు

ఎవరైనను తనకున్న సమస్యలు తీరునవికావని భావించుట అవివేకము. కేవలము యితరులపై ఆధారపడునపుడు సమస్యలు తీరక పోవచ్చును. దైవముపై ఆధారపడినచో ఎట్టి సమస్యలైనను తీరగలవు. దైవమును నమ్మి చెడినవాడు లేడు.

కష్టకాలమున దైవభక్తులు దేవుని ఒడిలో చేరుటకు ప్రార్థనలు చేయుదురు. ఇనుమడించిన భక్తితో ప్రార్థనలు చేయుదురు. కష్టనష్టము లను స్మరింపక, దైవమునే స్మరింతురు. కష్టములు, నష్టములు భగవద్భక్తులకు భగవంతుని చేరుటకే ఉపయోగపడినవి. భగవద్భక్తు లము అనుకొనెడి వారందరికిని యిట్టి సన్నివేశములు వారిని పరీక్షించుటకై ఏర్పడును. అట్టి సమయమున భక్తి లేనివారు ఆరాధన లను విసర్జింతురు. సమస్యా పరిష్కారము ప్రధానమని భావించి, చేయుచున్న దైవారాధనము మానుట వలన బలము తగ్గి చిక్కులను సృష్టించుకొందురు. సమస్యలు పరిష్కారము కాకపోగ భగవద్భక్తి కూడ సన్నగిల్లును. భక్తులు మాయను పడుట అనగా నిదియే.

# 16

## తపస్సు - సిద్ధి

విత్తనము నుండి వృక్షము, వృక్షము నుండి శాఖోపశాఖలుగ కొమ్మలు, రెమ్మలు, ఆకులు ఏర్పడుచున్నవి. పండ్లు, పూలు కూడ ఏర్పడుచున్నవి. వీటన్నిటికిని మూలము విత్తనమే. ఆకునకు రెమ్మ, రెమ్మకు కొమ్మ, కొమ్మకు మొదలు, మొదలునకు విత్తనము ఆధారము. కాని విత్తనము పెరిగి మహా వృక్షమగుట కేమి ఆధారము? విత్తనము నందుగల అంకురశక్తికి ఏమి ఆధారము? అంకురశక్తి ఆధారముగ అన్నియు ఏర్పడినవి. అంకురశక్తి కేది ఆధారమో మానవ మేధస్సున కందదు. మానవ ప్రకృతి యందు, కనబడనిది గుర్తించుటయే జరుగు చున్నది గాని, కనబడు వానిని నడిపించుచున్న శక్తి కాధారమును గుర్తించలేరు. పదార్థము కనబడుచున్నది గనుక తెలియును. శక్తి కనబడకపోయినను అవగాహన కందును. శక్తి కాధారమైనది తెలియుట మాత్రము జరుగుట లేదు.

వృక్షమునకు విత్తనమెట్లో మనిషికి హృదయ మట్లున్నది. హృదయ మనగ గుండెకాయ కాదు. స్పందనాత్మకమగు చైతన్యము. స్పందన, స్పందనముగ ప్రాణము, చైతన్యముగ ప్రజ్ఞ కలసి పనిచేయు

తత్త్వము. ప్రాణముగను, ప్రజ్ఞగను ఒకే తత్త్వము పనిచేయుచున్నది. ఈ ప్రజ్ఞను తెలియుటకు హృదయమును చేరక తప్పదు. అచటనే వేచియుండుట తపస్సు. అది తెలియుట సిద్ధి.

17

# నిర్ణయము

ప్రపంచము నిత్యము దిశానిర్దేశము ననుసరించి సాగు చున్నది. నూతన యుగము, స్వర్ణ యుగము వచ్చునని చాలమంది నమ్ము చున్నారు. జరుగుచున్న పురోగతిని చూచి వారట్లు భావించు చున్నారు. కొందరు మాత్రము ప్రపంచమున ధర్మము నశించినదని; విపరీత బుద్ధులు పెరుగు చున్నవని; విరోధములు, కలహములు పెరుగు చున్నవని; వినాశనము వైపునకు సర్వము సాగుచున్నదని భావించు చున్నారు.

స్వర్ణయుగమైనను, వినాశనమైనను రెంటికిని మానవుడే కారణము. అతడే కర్త. నూతన యుగము ఆవిష్కరింపబడవలె నన్నచో, నూతన భావములను ఆచరణము రూపమున నిర్వర్తింప వలెను. కేవలము భావించిన చాలదు. సద్భావనకు సదాచరణము తోడు కావలెను గదా! ఆచరణము లేని సద్భావన వ్యర్థము. సదా చరణము లేనపుడు సద్భావన కూడ అదృశ్యమై, పూర్వభావములే స్ఫురించు చుండును. అపుడు పూర్వకర్మయే మరల మరల నిర్వర్తింప బడి పూర్వానుభవమే మిగులును. మానవజాతి స్వభావమున యుద్ధ

భావములు మిక్కుటముగ నుండుటచే మరల మరల యుద్ధములు జరుగుచున్నవి.

నీవు నూతన యుగము కోరుకున్నచో, నీవు నూతన భావములను ఆశ్రయింపుము. సువర్ణ భావములను ఆచరించుము. అప్పుడు నీకు వ్యక్తిగతముగ నూతన యుగము ఆరంభము కాగలదు. నిర్ణయము నీదే!

18

## మాతృస్థానము

**ఒ**కటి అనేకమగుట సృష్టియందు గమనింపబడుతున్నది. మొదలు ఒకటియే. ఆ మొదలునకు విత్తన మొకటియే. విత్తనము నుండి ఏర్పడు వేరునుండి చిల్లర వేరు లనేకము లేర్పడుచుండును. అట్లే ఒకే మొదలు నుండి కొమ్మలు వేరు వేరుగ నేర్పడును. కొమ్మల నుండి రెమ్మలు కూడ అట్లే వేరు వేరుగ నేర్పడును. రెమ్మలనుండి ఆకులు గూడ అనేకము లేర్పడును. ఈ మొత్తమును గమనించినచో ఏకము అనేక మైనట్లుగ తెలియును.

ఏక మనేక మగుటలో నేర్పాటు జరుగుచున్నది. ఈ వేర్పాటును మా బృందము రెండు రకములుగ గుర్తించును. ప్రేమ, అనురాగ ముతో అవసరమును బట్టి వేర్పాటు చెందుట, ద్వేషము అసూయతో వేర్పాటు చెందుట. ఇందు మొదటిది ప్రకృతి ధర్మము. రెండవది వికృతి. మొదటి రకము వేర్పాటు వైభవమును కూర్చును. అందమును కూడ కూర్చును. రెండవ రకపు ఏర్పాటు వికారమే గోచరించును.

అన్నింటికిని మాతృస్థాన మొకటియే. మాతృస్థానము మరువ నంత వరకు, కృతజ్ఞత కోల్పోకుండు నంతవరకు నాశనముండదు. ప్రతి జీవికిని మాతృస్థానము హృదయమే. హృదయమును చేరి విశ్రాంతి గొనుట శ్రేయస్కరము. అదియే తల్లి ఒడి.

# 19

## అగ్నిస్థానము

కేంద్ర మనగ అగ్నిస్థానము. అగ్నిస్థాన సమీపమునకు ఆకర్షింప బడినవారు అగ్ని ప్రభావముచే పరివర్తన చెందుచుందురు. అగ్ని ప్రభావ మట్టిది. అగ్నిస్థానమునకు మరియొక పేరు గురుస్థానము. గురువగ్ని రూపుడే. అతనివద్ద కాకర్షింపబడిన వారందరికిని శుభ పరివర్తనము సహజము. గురుస్థానమున కాకర్షింపబడి, కొంత కాలము ఆ స్థానమున జీవించబడిన వారికి అగ్ని ప్రచోదనము కాగలదు. అట్టి ప్రచోదనమే శీఘ్ర పరిణామమునకు నాంది పలుకును.

భూమిపైన కొన్ని ప్రదేశములలో యిట్టి అగ్నిస్థానములు కలవు. వాని నాశ్రమము లందురు. మరికొన్ని చోట్ల అట్టి ప్రదేశములలో దేవాలయములు కలవు. మరికొన్నిచోట్ల పర్వత శిఖరములు కలవు. ఇవన్నియు కాక అగ్నిరూపులైన సద్గురువులు అచటచట అవతరించి యున్నారు. తమ వద్దకు వచ్చినవారికి ప్రచోదనము కలిగింతురు.

ఈ అగ్నిస్థానము లేవియును ప్రచోదనము చేయుట అను రజోగుణము లేక యున్నవి. ప్రచోదనము జరుగుట అను సత్వగుణ

మున భాసించుచున్నవి. ఇవి వీని ప్రత్యేకత. నీరు, ఆహారమువలె స్వీకరించువారికి అగ్ని ప్రచోదనము అందునుగాని, అందించు కార్యక్రమము ప్రత్యేకముగ నిర్వర్తింపబడదు. ఇది సత్యము. నిర్మల స్వభావులే ఈ సత్యము నెరుగ గలరు.

# 20

## సత్యప్రమాణము

సత్యమునకు చేరువనే ధర్మమున్నది. ధర్మమునకు చేరువలో ప్రేమ యున్నది. ప్రేమకు చేరువలో శాంతి యున్నది. శాంతికి చేరువలో వైభవ మున్నది. అన్నిటికిని ఆధారము సత్యమే. జీవుని పురోగతిని అతని ప్రవర్తన యందలి సత్యమునుబట్టి కొలతలు వేయబడును. సత్యమే ప్రమాణము. ఇతర ప్రమాణములు సత్యము కావు. విజ్ఞానము, శక్తి, వివేకము వంటివి కూడ ప్రమాణము కాదు. ధనము, యశము, సంపద, అధికారము ఎప్పటికిని ప్రమాణములు కాలేవు. పురోగతిని కొలుచుటకు ఋజువర్తన మొక్కటియే ప్రమాణము.

## 21

# సమతుల్యము

సద్గురువునుండి సంతృప్తి, సంతుష్టి, పుష్టి, ప్రతినిత్యము ప్రకటింపబడుతుంది. అది కోరికలేని నిండుదనము. కోరిక లేకపోవుట వలన నిండుదన మబ్బినదా? నిండుదనముండుట చేత కోరిక నశించినదా? ఇది విత్తు ముందా, చెట్టు ముందా అను ప్రశ్న వంటిది. కార్యకారణ సంబంధముల యందు జీవించువారు యిట్టి ప్రశ్నలతో సతమత మగుచుందురు.

జ్ఞానమువలన సహజమగు పూర్ణత్వము లభించును. పూర్ణ జ్ఞానమున నిలచిన వారికి పై తెలిపిన సంతుష్టి, పుష్టి అప్రయత్నముగ సిద్ధించును. జ్ఞాన మనంత మగుట వలన, అంతటను వ్యాపించి యుండుట వలన దానిని మానవుడు తనయందే దర్శించినపుడు పరమ తృప్తి కలుగును. జ్ఞానమునందు నిలచిన వానికి మహత్తర విషయములనుండి మట్టి పురుగు వరకు అన్నింటి యందును ఒకే తత్త్వము గోచరించుచుండును. మొత్తము సృష్టి ఒక వజ్రమువలె నీలాకాశమున తేలియున్నట్లు గోచరించును. అందు చిన్న-పెద్ద, పొడుగు-పొట్టి, వెలుగు-చీకటి, మంచి-చెడు, ప్రజ్ఞ-పదార్థము, జ్ఞానము-అజ్ఞానము ఎట్లు ఒద్దికగ యిమిడియున్నవో చూచి,

అమితానందము చెందును. ద్వంద్వములు లేనిదే సృష్టి లేదని, తాను సహజముగ ద్వంద్వాతీతుడని తెలియును. సృష్టి జ్ఞానమున ద్వంద్వము లున్నట్లే, తనయందును ద్వంద్వము లున్నట్లు తెలియును. జ్ఞానమున అన్నియు సమన్వయింపబడి యుండుటచే తుష్టి, పుష్టి వ్యక్తమగు చుండును. తాను పూర్ణుడై సమతుల్యుడుగ నుండును.

## 22


# సత్పురుషులు

నమ్మిన దానిని ఏకోన్ముఖముగ అనుసరించుట, దానికి విరుద్ధ మగు భావములను ఎప్పటికప్పుడు విసర్జించుట ఒక నీతి. పరిస్థితుల యందు మార్పులు సంభవించినపుడు కూడ నమ్మిన విషయమున మార్పు సంభవించకుండుటకు వలసినది దీక్ష. చెదిరెడి నమ్మకము గాలికి రెపరెపలాడెడి దీపము వంటిది. అట్టి దీపము యితరులకు వెలుగు ఎట్లునూ ఈయలేదు. తన అస్తిత్వమునకే తహతహ లాడు చున్నటువంటి దీపము యితరులకు వెలుగెట్లీయగలదు? స్థిరమైన దీపమే వెలుగీయ గలదు. స్థిరత్వము, దృఢత్వము నమ్మకముపై ఆధారపడి యున్నది. స్థిరము, దృఢము అయిన నమ్మకము పురోగతికి పునాదిరాయి వంటిది. పునాదిరాయి దృఢముగ నుండనిచో దాని ఆధారమున జరుగు నిర్మాణమంతయు అపాయకరమే.

'నమ్మినవాడు చెడడు' అనునది ఆర్యోక్తి. దైవతత్త్వము నందు నమ్మకము ఆధారముగనే బ్రహ్మాండ సృష్టియంతయు జరిగినది. కనపడని తత్త్వమాధారముగనే, కనపడు సృష్టి ఏర్పడినది. నాదము నుండి వినికిడిగ వచ్చిన 'యజ' అను శబ్దము ననుసరించి సృష్టికర్త సృష్టికి శ్రీకారము చుట్టెను. పదునాలుగు లోకముల ఈ భువనము

నేర్పరచెను. తనలోన తాను వినిన ఈ సందేశముపై నమ్మకముతోనే సృష్టి చేసెను. లోన తనకు వినపడిన చోటునే నమ్మెను.

సంస్కారవంతుడగు ప్రతి వ్యక్తికిని లోన కొంత అనిపించుట, వినిపించుట జరుగు చుండును. దానిని విశ్వసించి, త్రికరణశుద్ధిగ, యజ్ఞార్థబుద్ధితో ఆచరించినచో తానును ఒక సృష్టికర్త కాగలడు. అట్లాచరించువారే సత్పురుషులు.



23

## తాళము చెవి

సాధకుడు బోధనలను వినుటకు ఉత్సుకత కలిగియుండును. సద్గురువుల బోధనలు అతనికి ఉత్సాహము, ఉత్తేజము కలిగించు చుండును. సద్బోధలు ఎప్పటికప్పుడు నూతనోత్సాహము కలిగించుట వలన వానియందు అమితాసక్తుడై సాధకుడుండుట సహజము. అన్ని బోధనల ఆకళింపుకు వలసిన అసలు తాళపుచెవి తన హృదయము నందే యున్నది. వినిన విషయములను అంతరంగమున మననము చేయుచు, శోధన చేయుట సాధకుని కర్తవ్యము. బోధనలు హృదయ శోధనలై హృదయపు తాళము తెరుచుకొనుటకు సద్గురు దివ్య ముఖార విందము ఒక ముఖ్యమగు తాళము చెవి. నమ్మిన సద్గురువు చిరుదర హాస మూర్తిని నిర్మల హృదయముతో ధ్యానము చేసినపుడు అతడు హృదయపు తాళమును తెరిచి, బోధనల సారము నందించును.సువర్ణ సోపాన మార్గమును ఆవిష్కరించును. అటుపై ఆ మార్గమున నడచుటకు సాధకుడు దృఢవ్రతుడై యుండవలెను.

దృఢము లేనివానికి మార్గము లేదు.

24

## మానవ కృషి

**మా**నవజాతి కార్యకలాపములు గమనించినపుడు వారు సలుపుచున్న కృషి అమితాశ్చర్యము కలిగించును. ఆఫ్రికాలోని ఆటవికుని నుండి, అమెరికాలో నున్న నాగరికుని వరకు జాతి మొత్తము వ్యక్తిగతముగ నిదురలేచినది మొదలు, నిదురించు వరకు విపరీతమగు కృషి సలుపుచు నుందురు. వారివారి భావములను బట్టి, వారివారి దైనందిన కృషి యున్నది. వారి దైనందిన అవసరములను బట్టి వారి భావములు అవసరార్థమై కృషి సలుపుచున్నవి. కృషి యంతయు క్రియాశక్తి స్వరూపమే. ఇచ్ఛ మాత్రము దైవేచ్ఛగ లేకపోవుట వలన దివ్యజ్ఞానము మరుగైనది. ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి లేక క్రియాశక్తి మాత్రము బూడిదలో పోసిన పన్నీరువలె నిష్ప్రయోజన మగుచున్నది.

అన్ని రంగముల యందు అమితమగు కృషి ! వైవిధ్యమగు కృషి ! కోట్లాది మానవులు చేయు కృషి యంతయు తమ కొరకే ! స్వార్థపూరితమే. అమితమగు క్రియాశక్తి ఇట్లు ప్రతి నిత్యము నిర్వీర్యమై పోవుచున్నది. దీనిని గమనించు ఏకైక ఋషి, పోషకుడు అగు సూర్య భగవానుడు సాయం సంధ్యవేళ నిత్యము నిరాశ చెందుచున్నాడు. ఇట్టి జగత్పోషకుని పట్టించుకొనువా డెవడు? పరహితమే పరమ

ధర్మమని కోట్లాది జీవులకు కోట్లాది సంవత్సరముల నుండి మేల్కొల్పు కలిగించుచు, ప్రాణమును తెలివిని అందించుచు, ఆకాశమున ఒంటరిగ నిలచిన ఋషి భాస్కరుడు. అతని ప్రచోదనమునకై వేచియుండు మానవులందరు, ప్రచోదనము చెంది పరహితము గావించువా రెందరు? పరహితమే పరమ ధర్మముగ జీవించువా రెందరు?

కృషి పరహితమునకై మలచబడినపుడు మానవుడు సూర్యగతి ననుసరించును. సూర్యుని చేరును. పరహితమే దృఢవ్రతమైనపుడు వలసిన జ్ఞానము, శక్తి అప్రయత్నముగ లభించగలదు. ఇది సత్యము.

# 25

## కత్తి - సూది

పరాక్రమవంతుడగు సుక్షత్రియుడొకడు తన రాజ్యమును విస్తరింప సంకల్పించెను. నాలుగు దిక్కులకు దండయాత్రలు చేసెను. ఎన్నియో ప్రదేశముల నాక్రమించెను. విశాలమగు సామ్రాజ్యమును స్థాపించెను. అన్ని ప్రదేశములయందు తిరుగుబాటుచేయు స్థానికులను అణచివేయుటకు స్థానికముగ అధికారులను నియమించెను. అశ్వమేధ యాగము గావించి విజయవంతుడై తన కెదురు లేదని తెలిసి సంతుష్టుడయ్యెను. తన విజయమునకు కారణమైన వజ్రఖచితము, వజ్ర సమానము అగు ఖడ్గమును, దూరమున నున్న తన రాజగురువునకు కానుకగ పంపెను. ఆ ఖడ్గమును ఒక విస్తారమగు బంగారు పేటికలో అమర్చి సేవకుల ద్వారా సమస్త రాజలాంఛనములతో, రాజగురువు వద్దకు పంపెను.

సామ్రాట్ పంపిన కానుకను దర్శించిన రాజగురువు బంగారు పేటిక యందు వజ్రఖడ్గము నట్లే యుంచి, దాని ప్రక్కనే ఒక బంగారు సూదిని అమర్చి పేటికను తిరిగి రాజునకు పంపెను. ఆశీర్వచనముగ పసుపు, కుంకుమ, చందనము, అక్షతలు, పట్టువస్త్రములను కూడ పంపెను.

తిరిగివచ్చిన కానుకను చూచి సామ్రాట్ ఆతురతతో బంగారు

పేటికను తెరచి చూచెను. అందు ఖడ్గముతోపాటు వున్న బంగారు సూదిని గమనించి, చేతితో స్పృశించి, పేటికను మూసి దానిని తన పూజా గృహమున ఏర్పాటు చేయుడని సేవకులకు తెలిపెను.

సామ్రాట్ రాజగురువు పంపిన సూదిని గూర్చి ఆలోచింప నారంభించెను. ఒక సాయంకాలము తూర్పున చంద్రోదయము అగుచుండగ స్నానము గావించి, రాజగురువందించిన చందనము, కుంకుమ ఫాలభాగమున అలంకరించుకొని, ఆశీర్వచనముగ పంపిన పట్టు వస్త్రములు ధరించి రాజగురువు చిత్రపటమున పాదములను స్పృశించి, గురువిచ్చిన అక్షతలను శిరస్సుపై ధరించి ధ్యానమున కుపక్రమించెను. పౌర్ణమి చంద్రుడు ఊర్ధ్వముఖు డగుచుండగ కవాటము నుండి చల్లని, తెల్లని కిరణములు ఫాలభాగమును స్పృశించెను. వెన్నెల కాంతిలోన దర్శింపబడెను. ఆ కాంతిపుంజము నుండి రాజగురువు చిరుదరహాస వదనము గోచరించెను. సామ్రాట్టు హర్ష పులకాంకితు డయ్యెను. సద్గురువునకు హృదయమున శిరస్సు వంచి నమస్కరించెను. లోనుండి సామ్రాట్టునకు యిట్లు వినబడెను.

"సామ్రాజ్య స్థాపన మొక ఎత్తు. ప్రేమపూర్వక నిర్వహణము మరియొక ఎత్తు. సామ్రాజ్య స్థాపనకై ఖడ్గము ధరించితివి. భూవలయ సామ్రాజ్య మేర్పడినది. కాని ప్రాంతము లన్నియు వైవిధ్యముతో అంతరంగమున పరస్పర విరోధముతో నున్నవి. దివ్యప్రేమను, జ్ఞానమును ఆశ్రయించి అందరిని కలుపుటకు, పరస్పర ప్రేమాను రాగము జనించుటకు నీవిపుడు చేయవలసినది కుట్టుపని. పీలిక లన్నిటిని కలిపి ఉపయోగకరమగు వస్త్రము నేర్పరచుటకు సూది వలయును గదా! అందులకే నా సూది కానుక. నిర్వర్తించి, సూదిపని గావించి శాశ్వత కీర్తినొందుము.

## 26

# సమన్వయ మార్గము

సమన్వయము గలవాడే సమన్వయింపగలడు. శుద్ధచైతన్యమే సమన్వయశక్తి. ఇచ్ఛా జ్ఞాన శక్తులు పరస్పర వైవిధ్యములు. వానిని సమన్వయించునది వాని కతీతమైన, పుట్టుక స్థానమైన చైతన్యము. అట్లే పంచభూతములు ఆకాశమున సమన్వయింపబడును. వాయువు తేలిక, పృథివి బరువు. అవి పరస్పర విరుద్ధములు. అట్లే అగ్ని, నీరు కూడ పరస్పర విరుద్ధములు. పరస్పర విరుద్ధములగు నాలుగు భూతములు ఆకాశమున సమన్వయింపబడు చున్నవి. ఈ ఆకాశము వెలుగుట, వెలగకుండుటగ రాత్రింబవళ్లు సాగుచున్నవి. వెలుగుటకు రజస్సు, వెలగకుండుట (చీకటి)కు తమస్సు ప్రధాన గుణములుగ నున్నవి. రజస్తమస్సులు సత్వమున సమన్వయింపబడును. సత్వము నిత్య సత్యమైనపుడు శుద్ధ చైతన్యమై నిలచును. శుద్ధ చైతన్యమే వేదములయందు అగ్ని. అదియే సత్వముగను, ఆకాశముగను వెలుగుచు నున్నది.

తన యందలి పంచభూతములను, పంచేంద్రియములను, పంచ తన్మాత్రలను బుద్ధి యందు సమన్వయించ వచ్చును. బుద్ధి, చిత్తము, అహంకారము అను మూడింటిని తన యందలి దివ్యత్వమున

సమన్వయించ వచ్చును. సమన్వయ మార్గమున సాధకుడు మొదటగ చేరవలసినది బుద్ధి. తరువాత చేరవలసినది ఆత్మ.

నీయందలి సమస్తమును సమన్వయ పరచుము. అగ్నిజ్వాలగ వెలుగొందుము.

# 27

## అలౌకిక దృష్టి

**"ఉం**డుట, లేకుండుట" అను భావము పరిమిత జ్ఞానము. లేకుండుట ఎప్పుడును లేదు. చూడ లేకుండుటయే యుండును. చూడ లేకుండుట కారణముగ నిరాకరించుట అజ్ఞానము. నిరాకరించు స్వభావమునకు స్వస్తి పలుకుము. "అనిరాకరణమస్తు", "అనిరాకరణ మస్తు" అని వేదములు ఘోషించుచున్నవి.

భౌతికము, సూక్ష్మము అను విభజన కూడ అసమంజసమే. నీకు కనపడనిది నీకు సూక్ష్మము. కాని అదియు చూడగలిగిన వానికి భౌతికమే. నీకు భౌతిక మెంత స్పష్టమో, అతడికి సూక్ష్మమంత స్పష్టము. గురుపరంపరకు సంబంధించిన బృందము లెన్నియో సూక్ష్మ కారణ లోకములలో నిర్విరామముగ కృషి సలుపుచున్నవి. వారందరు శంబళకు ఉన్ముఖులై చైత్ర శుద్ధ పాడ్యమి నుండి పౌర్ణమి తిథి అంతము వరకు ధ్యాన నిమగ్నులై సంవత్సర పురుషుని సాదరముగ ఆహ్వానింతురు. సూక్ష్మ కారణలోక జీవులకు శంబళ భౌతిక సత్యము. ఈ సంవత్సర పురుషుడు విరోధి. అతడు సహజముగ విరోధములను ప్రేరేపించును. కారణ సూక్ష్మలోకముల యందు నెలకొన్న విరోధము లను పరిష్కరించి, సమన్వయపరచి ప్రశాంతత కలిగించుట, సుఖ

శాంతులను వృద్ధి చేయుట ఈ మా బృందములు నిర్వర్తించుచున్నవి. ఇది భౌగోళిక పరహిత కార్యము. వ్యక్తిగత సంకుచిత భావముల నుండి బయల్పడి నీవును ఈ శుభకార్యమున పాల్గొనవచ్చును.

28

## స్వతంత్రత - 1

**శి**ష్యు డావేశాత్మకముగను, గురువు నిర్ణయాత్మకుడుగ నున్నచో భ్రష్టతయే కలుగును. శిష్యుడు ఆలోచనాపరుడు, అవలోకనాపరుడుగ నుండి, గురువు బోధనాత్మకుడుగ నున్నచో శ్రేయస్సు కలుగును. గురువు వాచస్పతిగ వివరించు చుండగ, శిష్యుడు బృహస్పతిగ చెవులు రిక్కించి వినవలెను. విన్నదానిని ఆకళింపు చేసుకొనవలెను. దాని నాచరణలోనికి అన్వయించుకొనవలెను. ఎట్లాచరించవలెనో కోరు శిష్యుడు గురువునకు బరువే! శిష్యుడు తానుగ ఆలోచన చేయుటకు చెప్పిన విషయములు ఆకళింపు చేసుకొనుట ముఖ్యము. ఆకళింపయి నచో ఎట్లు చేయవలెనో తనకే తెలియును. ఎట్లు చేసుకొనవలెనో తెలుసుకొన్న శిష్యుడు సృజనాత్మకత లేక పడియుండును. అత దధమ శ్రేణికి సంబంధించి యుండును. అట్టివానికి బాధ్యత కూడ యుండదు. బాధ్యతపడి సృజనాత్మకముగ కార్యములు నిర్వర్తించు శిష్యుడే పురోగతి చెందగలడు. అట్టివాని ఇచ్ఛాశక్తి క్రమముగ మేల్కొని జ్ఞాన క్రియా శక్తులను కూడ మేల్కొలుపును. అట్టివారికే సద్గురువంతరంగమందు ప్రవేశము లభ్యమగును.

ఎట్లు చేయవలెనో ఆలోచించని శిష్యుడు పశు సమానుడై

వర్తించు చుండును. సొంతముగ నాలోచించుట పురోగతి మార్గమున ప్రధానము. ఆలోచనను మరల మరల పరిశీలించుకొనుటయే అవలోకనము. అటుపైన కార్యాచరణము. ప్రతి విషయము నందు ఈ విధమగు మానసిక పరిశ్రమ చేయువానికి సద్గురువందించిన బోధ పురోభివృద్ధి కలిగించును.

29

## స్వతంత్రత - 2

సద్గురువు సర్వ స్వతంత్రుడు. అట్టి స్వతంత్రతయే శిష్యుని విషయమున కూడ ఆశించును. శిష్యుడు గురువు ననుసరించుట శిష్యుని సంకల్పమేగాని గురువు సంకల్పము కాదు. తనను అనుస రింపుమని తెలుపువా డెవడును సద్గురువు కాదు. జీవ స్వాతంత్ర్యము ఆధ్యాత్మిక మార్గమున ప్రధానమగు అంశము. ఒక శిష్యుడు గురువు నకు తనను సమర్పణము చేసుకొనుట శిష్యుని నిర్ణయము. అట్లే గురువుతో సహకరించుట కూడ శిష్యుని నిర్ణయము. గురువును ప్రార్థించుట కూడయు నంతే.

సద్గురువు తాను స్వచ్ఛందముగ విశ్వరూపుడగు జగద్గురువు నారాధించుచునే యుండును. జగత్ వ్యూహమున సహకరించుచునే యుండును. అంతయు వ్యాపించియున్న పరమాత్మకు సమర్పణగ జీవించుచుండును. అతని నాధారముగ గొని శిష్యుడు కూడ అట్లు చేయవలె ననిపించుట శిష్యుని యందలి స్ఫూర్తి. స్ఫూర్తి తరుగ కుండుటకే నిత్య ప్రార్థనలు, స్వాధ్యాయము. తనను అనుసరించుచున్న వారియందు సద్గురువు బాధ్యత పడును. తనవంతు బాధ్యతను తన అవగాహనతో నిర్వర్తించునుగాని, శిష్యుని అవగాహనను బట్టి కాదు.

స్వతంత్రత గురువున కెంత కలదో శిష్యునకు కూడ అంతే కలదు. గురు శిష్యులది సమ్యక్ బంధమే కాని బంధమెప్పుడూ కాదు. ఈ సత్యము తెలియునపుడు గురువులు శిష్యుల వశమగుట, శిష్యులు గురువులకు వశులగుట జరుగుచుండును. మార్గ మంతయు స్వచ్ఛందమే గాని ఎట్టి నిర్బంధము యుండదు.

30

## స్వతంత్రత - 3

సద్గురువు నిర్దేశించడు. ఆదేశించడు. కేవలము సూచించును. సద్గురువు ప్రతిస్పందనము సున్నితము. అతడిచ్చునది ప్రతిస్పందనయే గాని ప్రథమ స్పందన కాదు. సద్గురువు బోధించుటకు ఉత్సహించడు. కోరిన వారికే బోధన చేయును. అతని బోధ, అతని బాధ నివారణము కోరినవారికే. అత నెప్పుడును తనయందు తానుగ యుండును. అతడు క్రియాశూన్యుడు, ఇచ్ఛాశూన్యుడు కూడ. ఇచ్ఛ, జ్ఞాన, క్రియా తత్త్వములకు ఆవలగల పరతత్త్వమున వశించుచుండును. అట్లు వశించుటయే వశిష్టత్వము. ఆర్తితో పిలచిన పలుకును. అతడు చేయు ప్రతిస్పందన మెల్ల జీవుల కొరకే. కాలము దేశము ననుసరించి ప్రతిస్పందించును. తనదైన కార్యమేమియు తనకుండదు. అతడుండుట యందు స్థిరపడును గాని చేయుటయందు కాదు. చేయవలసి వచ్చి నపుడు చేయవలసినది చేసి మరల తనయందు తానుగ నుండును. అట్లని ప్రమత్తుడు కాదు. అప్రమత్తుడుగనే యుండును. అతని స్వతంత్రత అందరును చేరవలసిన గమ్యము.

## 31

# సూత్ర చతుష్టము

**"నేను మరచితిని"** అని ఎన్నడును అనకుము. మరచితి ననుట అవమానకరము. నీ స్మృతిని నీవే నిర్ణయించినట్లు. విలువగల విషయము లెవ్వరును మరువరు. మరచుట స్మృతిభ్రంశ స్థితి. అది క్రమముగ పతనము కలిగించును. నీయందు జ్ఞాపకశక్తి అట్లెందుకు సన్నగిల్లుచున్నదో విచారించుము. జ్ఞాపకశక్తియే నిన్ను కడచేర్చునది. అందువలన మరచుట పతన కారణమని ఎరుగుము. మరుచు సన్నివేశములు జీవితమున తగ్గవలెను.

**"నాకు తెలియదు"** అనకుము. **"నాకింకను తెలియవలసి యున్నది"** అని పలుకుము. తెలియవలసి యున్నది అను భావము తెలుసుకొనవలెనన్న ఉత్సాహముతో కూడియుండును. "నాకు తెలియదు" అను వాక్యము తెలుసుకొనుటకు కూడ ఉత్సహించని భావప్రకటనగ భావింతురు. తెలుసుకొనుటకు వయస్సు, ఆరోగ్యము, జీవితమందలి సంఘటనలు అవరోధములు కావు. ప్రధానముగ తనకు తానే అవరోధము, విఘ్నము కూడ.

**"నేనిట్లు నిర్ణయించితిని"** అని అనకుము. ఇట్లు నిర్ణయింప బడినది. **"ఇట్టి నిర్ణయము జరిగినది"** అనుట నేర్చుకొనుము. జీవన

ప్రవాహమున ప్రయాణము చేయువానికి ప్రయాణము ప్రవాహము కారణముగ జరుగును కాని, అట్టి ప్రవాహములకు తాను కర్త కాదు. అంతటికిని కర్త, భర్త ఒక్కడే. నీవు కర్త అనుకొనుట వలన నీ మార్గము అవరోధములతో కూడియుండును.

**"విచారమును, దుఃఖమును ఆలింగనము చేసుకొనకుము."** అది కారణముగ నీపై నీకు జాలి కలుగును. అటుపైన హృదయ దౌర్బల్యము కలుగును. అది క్షుద్రము.

పై నాలుగు సూత్రములు అపుడపుడు పరిశీలించుకొను చుండుము.



# 32

## సాహసము

**పి**ల్లల కథలలో చిన్నతనముననే ఇల్లు వదలిన పిల్లవాని కథలు ఎక్కువగ నుండునుగాని, యింటిలోనే ఉన్న పిల్లవాని కథలు చెప్పు కొందురా? చిన్నతనమున ఇల్లు వదలిన రామలక్ష్మణుల కథ తెలిపెదరు కాని, ఆ సమయమున ఇంటిలో భరత శత్రుఘ్నులు ఏమి చేయుచున్నారను కథ ఎవ్వరికిని తెలియ నవసర ముండదు. చిన్నతనముననే విష్ణు ప్రార్థనకై బయటకేగిన ధ్రువుని కథను తెలుసు కొందురు. ధ్రువుడు వనమున తపస్సు చేయుచుండగ, అతని తమ్ముడింటిలో ఏమి చేయుచున్నాడో ఎవరికి పట్టును?

ప్రతినిత్యము తినుట, తిరుగుట, సంపాదించుకొనుట, నిద్రించుట, భోగించుట చేయువారి కథ లెవ్వరికిని అవసరము లేదు. అట్టివారు కోటానుకోట్లు. జీవితమున ఏదైనా సత్కార్యము సాధించ వలెనని భావించి, సాహసోపేతముగ జీవితమును నడపువారివే స్ఫూర్తి నిచ్చు కథలు. సాహసము– స్ఫూర్తి అను అగ్నికి ఆజ్యము వంటిది. ఉత్తమ విషయములు సాధించకొనదలచినవారు సాహసవంతులై యుండవలెను. సాహసవంతులను గృహము కాని, వృత్తి, ఉద్యోగ వ్యాపారములు కాని, సంస్కారము గాని నిజమునకు బంధింపవు.

సాహసము లేని పిరికివాడు ఇట్టి కుంటిసాకులను తడికెలుగ తనచుట్టు అల్లుకొనును. అట్టివాని గూర్చి ఎవ్వరికిని తెలుసుకొనవలెనను భావము కూడ కలుగదు. ఇది సత్యము. సాహసవంతులకే సర్వము సుగమ మగును. వారికి పర్వతములు కూడ అవరోధములు కావు.

33

## మనస్సు

మనస్సున ఏడు పొరలున్నవి. మనస్సు కావల బుద్ధి యున్నది. ఈవల ఇంద్రియ ప్రవృత్తి యున్నది. మనస్సు బుద్ధి వైపునకు మ్రొగ్గినచో విచక్షణ, వివేకము, ధర్మము, కర్తవ్యము తెలియుచుండును. మనస్సు ఇంద్రియముల వైపునకు మ్రొగ్గినచో తినుట, తిరుగుట, చూచుట, వినుట, స్పర్శించుట అను వ్యాపారములతో ప్రపంచమున మునుగును. మనస్సుయందు స్థిరపడిన ప్రజ్ఞ కలవాడు మానవుడు. అతడు మనో మధ్యమున నుండును. మనోమధ్యమ పొరనుండి బుద్ధి వైపునకు మూడు పొరలు, ఇంద్రియ వ్యాపారము వైపునకు మూడు పొరలు యుండును. బుద్ధినుండి గాని, ఇంద్రియ వ్యాపారమునుండి గాని నాలుగవ పొర మధ్యమ పొర యగును. ఈ పొరయందు స్థిర పడిన వాడు బుద్ధి పొరలకు, ఇంద్రియ పొరలకు నడుమ ఉపస్థితుడైన వాడు. అట్టివాడు బుద్ధిని సంప్రదించి ప్రపంచమున వివేకముతో ధర్మమును, కర్మమును నిర్వర్తించును. ఇంద్రియ పొరలలోనికి మానవ ప్రజ్ఞ అవస్థితి చెందినపుడు అతడు పశుప్రాయుడై తన దేహ పోషణము నకు, తన వారి పోషణమునకు పాటు పడుచు ప్రపంచమున బద్ధు డగును. అట్లే మనో మధ్యమున నుండక ఊర్ధ్వగతి కేగినవారు

ప్రపంచమునకు దూర మగుదురు. ఏకాకు లగుదురు. ప్రపంచము నందుండి ప్రపంచమునకు మేలు చేయుచు, ప్రపంచముచే బంధింప బడకుండుట మే మందించు యోగము. అట్టివాడు దివ్యత్వమును భూమిపై కవతరింప చేయగలడు. ఇట్లు ప్రపంచమున జీవులసేవలో నిమగ్నులైన జీవన్ముక్తుల యెడల పరమాత్మ పరిపూర్ణముగ తన అనుగ్రహమును ప్రసరింపజేయును. కావున మనో మధ్యమున నుండుట లక్ష్యముగా యోగ సాధనము చేయుడు.

34

## కాలము - తత్త్వము - ధర్మము

సత్యమెరుగుట యనగా ఆత్మ తత్త్వమును, ప్రకృతి గుణములను తెలియుటయే. మొత్తము సృష్టి యంతయు ఆత్మ-పుట్టుకల అనుబంధమే. దానినే కృష్ణభక్తులు "రాధామాధవ" మనిరి. ఆత్మ తత్త్వము అచలము, స్థిరము, శాశ్వతము, సర్వవ్యాపకము. మార్పుల కతీతము. కార్య కారణముల కతీతము. సర్వమునకు అతీతమై ఎప్పుడును శాశ్వతముగ నుండునది. దానినుండి పుట్టిన సంకల్పము, కాలము, ప్రకృతి ఒకదానితో నొకటి పరస్పర రసాయనము చెంది వివిధములగు గుణములు పుట్టుచుండును. పంచతత్వములు పుట్టుచుండును. పుట్టిన ప్రకృతి తత్వము లన్నిటియొక్క రసాయనము వైవిధ్యముగ అవతరించు చుండును. అవతరించినది వృద్ధి చెందుచుండును, అటుపైన కృశించును. కాలగతి ననుసరించియే ప్రకృతి ఉద్భవించుట, వృద్ధి చెందుట, తిరోగమించుట, లయమగుట జరుగుచున్నది. అందువలన ఆత్మతత్త్వము, కాలము, ప్రకృతి అను మూడు అంశములుగ తోడ్పడుచుండును. కాలమునుండి వ్యక్తమై, కాలము లోనికే అదృశ్యమై ప్రకృతి వర్తించుచున్నది గనుక కాలమునే శేషుడనిరి. అన్నియు అంతమైన వెనుక మిగులునది కాలమే. ఆ కాలము

పరతత్త్వమునకు కల్పమై యుండును. సనక సనందనాదులు సైతము కాలమునుండియే వ్యక్తమై కర్తవ్యమును నిర్వర్తింతురు గనుక కాలమే సృష్టియందు ప్రధానమగు దైవము. కాలము నెవ్వరును తెలియలేరు. కాలగతి ననుసరించియే సమస్తము జరుగుచున్నది గనుక అవతార పురుషులు సహితము కాలము ననుసరించియే కార్యములను చక్కబెట్టు కొందురు.

ఆత్మ తత్త్వము, ప్రకృతి ధర్మములు తెలియుటకు కాల మనుగ్రహించవలెను. కాల మనుగ్రహించవలె నన్నచో కాలమును గౌరవించవలెను. కాల క్రమమును తెలియుటకు కాలము నారాధింప వలెను.

35

## అరుదైన ధైర్యము

నన్ననుసరించువారు భయపడ నవసరము లేదు. విశ్వాసమే ఊపిరిగ నన్ననుసరించినచో మిమ్ముల నావలకు చేర్చగలను. ప్రయాణ మున శ్రమ లేకుండుటకై మీకు యుగయుగముల కథలను తెలుపుదును. యుగముల కథలు బహుకొంచెముగనే ప్రచురించ బడినవి. ప్రచురింపబడక యున్నవి ఆకాశమున కోకొల్ల లున్నవి. అవియన్నియు మీకు తెలుపుచు పయనింపజేతును. అట్టి యెడ శ్రమ యుండదు.

మీ పని మీరే చేసుకొనవలెనని భావింపకుడు. నాకును అవకాశమిండు. మీ పని నా పనిలో భాగమే. మిమ్ములను పరిపూర్ణు లను గావించి, అటుపైన నా పని మీ నుండి చేయించుకొందును. నా పని చేయుటయందు మీ కెట్లును పూర్ణయిచ్ఛ యుండును. యజ్ఞార్థము జీవించుటకు తపన చెందు మీ బోటివారు మమ్ములను విశ్వసించినపుడు మీ పని, మా పని అని భావించక అన్నియును మాకు సమర్పించుడు. అన్నిటి నుండి కడతేర్చి మిమ్ము మాలో ఒకరిగ యిముడ్చుకొందుము. మేము, మీ మా భేదము లేనివారము. భేద మజ్ఞానమే గనుక మీ పని మా పనిగ చేయుదుము. దానికి వలసిన దొక్కటియే. పూర్ణ విశ్వాసముతో మిమ్ములను మా కర్పించుకొనుడు. అందుకు అరుదైన ధైర్యము కావలెను.

## 36

# అమృత పాత్ర

అమృతము నందించు పాత్ర మీ రెరుగుదురా? పాత్ర లోపలి భాగమునందు నాలుగు ముఖము లుండును. అవి వెండివలె మెరయు చుండును. మెరుపు వెండివలె దానిని భావించుడు. పాత్ర వెలుపలి భాగము పరిశుభ్రమగు రాగితో యుండును. పాత్రయందు ఎఱ్ఱదానిమ్మ రసము వంటి పానకము యుండును. ఆ పానకము నలుదిక్కులకు ప్రవహించు చుండును. అరమరికలు లేక అందరి శ్రేయస్సు కోరు వారికి ఈ అమృత మందివ్వబడును. సత్సంకల్పమునగాని, సత్కార్యమునగాని అరమరిక లున్నచో ఈ అమృత పానమున కర్హత యుండదు. ఈ అమృతము త్రాగినవారు సిద్ధులై, చిరంజీవులై లోక కల్యాణము కొరకు నిరంతరము కృషి సలుపుచు నుందురు.

## 37

## అంతము - ఆరంభము

**నా** ఆశ్రమమున తృప్తిపడి విశ్రాంతి తీసుకొనుట కవకాశము లేదు. కోటానుకోట్ల జీవులు అసంతృప్తితో కొట్టుమిట్టాడుచుండగ తృప్తిపడి ఊరకుండుట కరుడుగట్టిన స్వార్థమే కదా!

ఒక కార్యము పూర్తియైనదని తృప్తిపడుట కొంత ఆనందము కలిగించును. కాని ఒక సత్కార్యము ప్రారంభించినపుడు ఆనందము ఉరకలెత్తు చుండును. కారణ మేమనగ, సత్కార్యము ప్రారంభింప బడినపుడు అమితోత్సాహము కూడ ఆనందమునకు తోడగును. కాని, కార్యము పరిపూర్తి యగుసరికి ఉరకలెత్తు ఉత్సాహముండదు కదా! ప్రారంభించినపుడు ఉన్న వేగము, స్ఫూర్తి పరిపూర్తి యగుసరికి యుండదు. పరుగు పందెమున గంట మ్రోగినపుడు అమితోత్సాహ ముతో, శక్తితో పరుగు ప్రారంభింతురు. గమ్యము చేరుసరికి వేగము తగ్గుట, అలసిన భావము యిత్యాదివి చోటు చేసుకొనును. అంతము కన్న ఆరంభమే బాగుండును. ఇది నా నిశ్చయము.

## 38

# పురోగతి - అవరోధములు

"ధైర్యము కూడగట్టితిని" అనుచు పలుకుదురు. ఎచ్చట కూడగట్టితిరి? భావమునందే కూడగట్టితిరి. పూర్తిగ ధైర్యము కూడ గట్టితిరా, ప్రశ్నించుకొనుడు. మీరు ధైర్యము కూడగట్టినపుడెల్ల అందు మే మేడు రంధ్రములను జూతుము. ఏడు రంధ్రముల ఘటమువలె మీ భావము మాకు గోచరించును. ఆ ఏడు రంధ్రములు ఈ విధముగ నున్నవి.

1. భయము, 2. అనుమానము, 3. సందేహము, 4. అసూయ, 5. ద్వేషము, 6. క్రోధము, 7. మోహము.

కూడగట్టిన ధైర్యము, సంకల్పశక్తి ఈ రంధ్రముల ద్వారా వృథా అయిపోవుచుండగ కృతకృత్యు లెట్లు కాగలరు? దూరమునకు గురిపెట్టిన బాణమునకు గుండ్రాయి తగిల్చినచో ఎంత దూరము పోగలదు! మనో భావమునకు అనుగుణముగ మీ శరీరము సహక రించుచున్నదా? దేహము బరువైనచో గుండ్రాయివలె మీ బాణము వేగము హరింపబడును. కనుక పై తెలిపిన ఏడు రంధ్రములతో పాటు ఎనిమిదవ అవరోధమును గూడ గమనింపుడు.

# 39

## చైతన్య వికాసము

చైతన్యము వికసించునట్లు ప్రవర్తించుట మీవంతు. సమస్త సాధనలు చైతన్య వికాసమునకే. జీవితమున అన్ని సన్నివేశముల నుండి, అనుభవముల నుండి చైతన్య వికాసము కలుగుట కవకాశ మున్నది. మీ యందుగల చైతన్యము ఒక దివ్య ఉద్యానవనము వంటిది. మీరు చేయు సత్కార్యముల ఫలములన్నియు అచ్చటనే పండును. ఆ పండ్ల వలననే అనుభూతి నిండును.

మీ చైతన్య స్రవంతి బుద్ధిలోకముల యందు, మనోలోకముల యందు రెండు విభిన్న ప్రవాహములుగ పారును. ఒకదానికొకటి సంబంధమున్నట్లు గోచరించినను, నిజమున కట్టి సంబంధము లేదు. అప్రమత్తత గలవారి కిది తెలియగలదు. భౌతిక లోకములకు, దివ్య లోకములకు సరిపోల్చలేము. ఈ లోకమున ధనవంతుడు ఆ లోకమున కనుపింపకపోవచ్చును. అట్లే ఈ లోకమున దరిద్రుడు అచట సంపన్నుడై గోచరించవచ్చును. దివ్యలోక వైభవమునకు వలసినది సద్గుణ సముదాయము. భౌతిక లోకమున వలయునది సమర్థత. దివ్యలోక స్రవంతి అపుడపుడు భౌతికమున అవతరించ వచ్చునుగాని, ఇట్లు నుండుటకు సద్గుణము మాత్రమే చేర్చగలదు.

అవతరణము లన్నియు అటనుండుటకే గదా! అవియును అకస్మాత్తు గను, అసాధారణముగను జరుగును. చైతన్య వికాసమునకు భౌతిక మగు విస్తరణ ఆవశ్యకము కాదు.

40

## మానవ మూషికములు

ఒకనాడు నా వద్దకు మూడు ఎలుకలు వచ్చినవి. దివ్యస్పర్శ నిమ్మని కోరినవి. మూడు ఎలుకలకు నేనిట్లు తెలిపితిని.

మొదటి ఎలుకతో నీవు తిండికోసమే బ్రతికితివి. నీవు తినుట, నీవారు తినుట మాత్రమే జీవన కార్యక్రమముగ బ్రతికితివి. మరింత తినుటకొరకా దివ్యస్పర్శ?

రెండవ ఎలుకతో, నీవు చాల పుస్తకములను తింటివి. గ్రంథాలయముననే జీవించితివి. కాని నీ కెట్టి జ్ఞానము కలుగలేదు. నీకు గ్రంథములు ఏ స్ఫూర్తినీ కలిగించ లేదా?

మూడవ ఎలుకతో, నీవు జీవితమంతయు దేవాలయ ప్రాంగణమున గడిపితివి. దేవాలయమంతయు పవిత్రమగు వస్తువులతో నిండి యున్నది గదా! నీ కచ్చట ఏ స్పర్శయు లభించలేదా?

మూషికములారా! మానవుల వంట గదులలోను, గ్రంథాలయములలోను, దేవాలయములలోను తిరుగుటయే గాని, మీకు జీవన ప్రయోజనము నెరవేరలేదు. మూషికముల రూపమున నా

వద్దకు చేరిన మీరు మానవులుగా పుట్టుట సమంజసము. మీకు, మానవులకు భేదమేమీ గోచరించుట లేదు.

పై విధముగ నేను, నా వద్దకు చేరిన యాత్రికులకు బోధించు చుందును.

41

## మానవ సింహము

**ఒ**కనాడు నా వద్దకు ముగ్గురు సాహసవంతులు ఒడుదొడుకుల కోర్చి వచ్చిరి. ఉపదేశ మిమ్మని ప్రార్థించిరి. వారితో నే నిట్లు పలికితిని.

పూర్వము మీవలెనే మూడు సింహములు నా వద్దకు వచ్చినవి. అవియును నా ఆశ్రమమున ఉండుట కిచ్చగించినవి. ఆ సింహము లతో నే నిట్లంటిని : మీలో మొదటివాడు నన్ను చేరు దారిలో నడచు చున్న యాత్రికు నొకని చంపి భుజించెను. రెండవవాడు దారియందు ఒక గ్రుడ్డి వృద్ధ స్త్రీ వద్ద నున్న గొఱ్ఱెను చంపి తినెను. మూడవవాడు నా వద్దకు ముఖ్యమగు సందేశమును కొనితెచ్చుచున్న దూతను, గుఱ్ఱమును చంపి తినివైచెను. ఆకలికి తినుట ప్రకృతి ధర్మము. అలవాటుగ తినుట మానవులు చేయుదురు. సింహములు చేయవు. కావున మీరు మానవులుగ పుట్టుడు. మీకు మానవులకు భేదమేమి? అని పలికితిని. మీ ముగ్గురి జీవితములు ఇంకను హింసాత్మకములు గనే యున్నవి. మీకు జ్ఞాన మెట్లు లభించగలదు?

పరమగురువులను చేరిన సాహసవంతులు ఖిన్నులైరి. అప్పటి కప్పుడే సన్యసించి, ఆ ప్రాంతముననే ఆకులు, అలములు తినుచు దేహము విడచిరి. మరు జన్మమున పరమగురువు ఉపదేశమును పొంది ఉత్తమశ్రేణి సాధకులుగ నిలచిరి.

42

## మానవ పావురములు

పరమగురువు ఆశ్రమమునకు ఒకనాడు మూడు పావురములు వచ్చినవి. పరమగురువు ఆశ్రమమున ఉండుటకు అనుమతి కోరినవి. పావురములతో పరమగురువు యిట్లనెను. మీలో ఒకరు పరులెండ బెట్టుకున్న గింజలను మీవిగ భావించి తినిరి. తరతమ భేదములేక జీవించిరి. మరియొకరు ఔషధముగ వినియోగపడు మొక్కలు తినుచుండిరి. మూడవ వారు దేవాలయమున నందీశ్వరుని వద్ద నిత్యము గోచరించుటచే దివ్యపావుర మనుకొని మిమ్ములను పోషించిరి. అట్లు పరాన్నభుక్కులై జీవించుట జరిగినది. ఆకలికై దొంగతనము చేయువారు, విచక్షణ లేక తినువారు, కపట వేషధారులు మానవులయందు మిక్కుటముగ గోచరింతురు. కావున మానవులై పుట్టుడు. మీకు నా నివాసమున చోటు లేదు. ఇట్లు పలికి పరమగురువు తన నివాసములోనికి వెడలిపోయెను.

43

## భావ దేవాలయము

ప్రత్యేకము, విశిష్టము అగు విధానముల నవలింబింపకుడు. అందరిలో నొకడుగ నుండుట, పూర్వులు నడవని మార్గమున నడచుట అపాయకరము. మిమ్ములను మీరు ఎంత ప్రత్యేకముగ భావించినచో అంతమేరకు సత్యదూరు లగుదురు. ప్రత్యేకత లేకుండు టయే విశిష్టతగాని, విశిష్టముగ నుండవలెనని ప్రత్యేకముగ నుండ రాదు. అట్టివారు తమను తాము మోసపుచ్చుకొన్నవారు. వారు తమను గూర్చిన భావముతోనే కట్టబడి యుందురు. దైవమును గూర్చిన భావమెట్లు కలుగగలదు? భావములు తమనుగూర్చి గాక దైవమును గూర్చి యుండవలెను. కనీసము శ్రేయోభావములై యుండవలెను. శ్రేయోభావములు మిక్కుటముగ కలవారు మా స్పర్శను పొందగలరు. శ్రేష్ఠమైన రాయితోనే కట్టడములు కట్టవలెను గదా! దేవాలయము కట్టుటకు రాయి నాణ్యత ఎక్కువగ పరీక్ష చేయబడును. కలకాలము దేవుడుండుటకు దేవాలయమును పవిత్రమగు శిలలతోనే నిర్మింతురు. అట్లే పవిత్ర భావములు గల జీవుని హృదయమున దైవ మావిష్కరింప బడునుగాని, మలిన భావములు గలవారి హృదయమున నుండ గలడా? పవిత్ర జీవనమునకు పవిత్ర భావమే పునాది. భావములను సరిదిద్దుకొనుడు. అందులకై ప్రతినిత్యము పరిశీలించుకొనుడు.

44

## గురు సాన్నిధ్యము

**మీ** గృహమున పరమగురువునకు ఒక ప్రత్యేక స్థానము నేర్పరచితివా? అట్లేర్పరచుట మూఢభక్తి కాదు సుమా! పరమగురువునకు ఒక ప్రత్యేకస్థానము గృహమున ఏర్పరచి, ఆ స్థానము నెప్పుడును పవిత్రముగ నుంచుట నీ ప్రథమ కర్తవ్యము. నీ యందలి శ్రద్ధాభక్తులను బట్టి నిన్నతడు కలియు ప్రదేశమదియే సుమా! అతని కొరకు నీవు నిత్య మెదురు చూచుచున్నచో, భక్తిపూర్వక నివేదనలు చేయుచున్నచో, అతడచ్చట నీకు దర్శన మీయగలడు. నీ ఎదురుచూపు అతనికి తెరిచిన గవాక్షము వంటిది. అందుండి నీ దరిచేరి దర్శన మిచ్చును. నీ భక్తియందలి ఏకాగ్రత, తపన, తపస్సై వేడిమిని పుట్టించి క్రమముగ జ్వాలారూపము దాల్చవలెను. అట్టి సమయమున అప్రమత్తుడవై కూడ యుండవలెను. సమస్తమును పరికించు చుండవలెను. అకస్మాత్తుగ క్షణ కాలము చల్లని గాలి తగలినను, వెచ్చని స్పర్శ కలిగినను, మంగళకరమగు శబ్దము వినబడినను, మొత్తము నిశ్శబ్దమైనను, విద్యుద్దీపము లారినను, వెలిగినను అట్టి సమయములలో పరమగురువు సమీపించినాడని తెలియవలెను. సాన్నిధ్యమెప్పుడును సున్నితముగనే యుండును. బండగ నుండదు. పుష్ప

దళముల స్పర్శ ఎంత సున్నితమో, అట్టి సమయమున కనులు మూసుకొని కృతజ్ఞతా భావముతో మరింత వేచి యుండుట ఫలవంతము కాగలదు. నీవు ప్రార్థించునపుడు సాధ్యమగునంతవరకు వెన్నును నిటారుగ నుంచుటకు ప్రయత్నించుము. ఇవి సాన్నిధ్యమునకు కొన్ని సూచనలు.



45

## కలికాల వికారము

**ఆ**త్మజ్ఞానము, యోగము, భక్తి, యజ్ఞార్థకర్మ యిత్యాది మాటలతో ఎందరో నూకలు, రూకలు ప్రోగుచేయు చున్నారు. వీరందరును గూడ గురువులుగ చెల్లుబాటగు చున్నారు. కుటుంబము, ధనము వృద్ధి చేసుకొనుట, సంఘమున గుర్తింపు, కీర్తి పెంపొందించుకొనుట, వ్యాపారములందు మిక్కుటముగ లాభములను పొందుట, జీవితము ఒక గులాబి తోటవలె ఏర్పరచుకొనుట ప్రధాన కార్యక్రమములుగ యిట్టి గురువులు, వారి అనుయాయులు అహర్నిశలు శ్రమించు చున్నారు. గమ్యమునం దాసక్తి ఎవరికిని లేదు. ఇట్టి భక్తి సమాజములో ఈర్ష్యాసూయలు, కామక్రోధములు, రాగద్వేషములు మిక్కుటముగ తాండవము చేయుచున్నవి. ఇతరులకు మార్గదర్శన మనుకొనుచు యిట్టివా రందరు సంఘమున కలవరము పెంచుచున్నారే గాని పరిష్కారము లందించలేక యున్నారు. ఉన్నతమగు కార్యక్రమము లందు సంకుచితులు చేరుట వలన ఈ పరిస్థితి గోచరించు చున్నది.

ప్రధానముగ ఒక విషయము తెలియవలెను. దివ్య కార్యమునకు ద్రవ్యముతో ఎట్టి సంబంధము లేదు. దివ్యకార్యము దైవమును చేరు కార్యము. దైవము నవతరింపజేయు కార్యము. ద్రవ్య

సంబంధములగు కార్యము లన్నియు కూడ పతనము చెందక తప్పదు. మానవ మేధస్సున దైవముకన్న ద్రవ్యమునకే ప్రాధాన్యత హెచ్చు అగుటచే దైవ తత్త్వమును కూడ ద్రవ్య తత్త్వముతో ముడివేయు చున్నారు. ఇది కేవలము వికృతము. అందరును తమను తాము పరిశీలించుకొనుట ముఖ్యము.

46

## స్తోత్ర ఫలము

సూక్తములు, స్తోత్రములు సంవత్సరముల తరబడి చదువు చున్నపుడు అవి యాంత్రికములై రుచి కోల్పోవుట సహజము. దానికి కారణము పాఠకుని మనస్సుయం దున్నది గాని సూక్తములందు, స్తోత్రములందు లేదు. సూక్తములు, స్తోత్రములు సత్ఫల మిచ్చుటకు కొన్ని నియమము లున్నవి.

1. పఠించు సూక్తముగాని, స్తోత్రముగాని వినుట ప్రధానము.

2. వినుటకు కంఠమునందు గాని, హృదయమునందు గాని వినుచున్నట్లు భావించుచు వినవలెను.

3. ఉచ్చరించు శబ్దములు వినుట ప్రధానము. అర్థము అప్రధానము. అర్థము తెలియుట ఆవశ్యకము కాదు. కుతూహలము కలవారు తెలుసుకొన వచ్చును.

4. శబ్దము ఉచ్చరించినపుడు అందలి ధ్వని వికాసము నావిష్కరించు చుండును. చైతన్యము ప్రకటింపబడు చుండును. సూక్తములందు, స్తోత్రములందు శబ్దములు ఛందోబద్ధముగ ఋషు లేర్పరచిరి. వానిని ఉచ్చరించుచు తాళ లయాత్మకమగు ఛందోబద్ధ ధ్వనులను వినుట ప్రధానము.

5. తారస్థాయిలోగాక, గొణుగుచున్నట్లుగాక, మంద్రస్థాయిలో శ్రావ్యముగ ఉచ్చరించుటకు శ్రద్ధ చూపవలెను.

6. ఇట్లు కలకాలము స్తోత్రపఠనము చేసినవారి దేహమందలి అణువులలో ఒక చక్కని మార్పు ఆవిష్కరింపబడును. దేహము తేలిక యగును. మనస్సునకు సద్విషయములపై ఆసక్తి హెచ్చును.

7. ప్రతిదినము ఉదయ సంధ్యయందు గాని, సాయం సంధ్య యందుగాని పై విధమగు పారాయణము శీఘ్రముగ ఫలము నిచ్చును.

# 47

## క్లుప్తీకరణము

విపులీకరించుకొనుట కన్న క్లుప్తీకరించుకొనుట నిజమగు తెలివి. విస్తారముగ జీవితమును పరచుకొన్నచో అందు చిక్కుకొను అపాయము కలదు. విస్తరింపబడిన జీవితము మరల క్రోడీకరించు కొనుటకు వలసినది కర్మయోగ కౌశలము. కర్మయోగి విస్తారముగ కార్యక్రమములు చేయుచున్నను, అందు తాను ఆశించినది, ఆశ పడునది ఏమియును ఉండదు. అట్టి వానికి కార్య విస్తారము మనసుపై ప్రభావము చూపదు. ఇతరులు ఆశించినది, ఆశపడునది మిక్కుట ముగ నుండుటచే పరచినదెల్ల పట్టియుంచును.

వస్తువులు, మనుషులు, ఆస్తులు, పరిసరములు జీవితమున క్రమముగ ఏర్పడి మానవుని అందు ముంచును.

పై కారణముగ దుస్తులను, యితర దేహావశ్యక వస్తువులను, గృహ సామగ్రిని ఎంత తక్కువగ నేర్పరచుకొన్నచో అంత సుఖ ముండును. సన్యాసులు ఆశ్రమముల పేరున సంసారులగుటకు కారణము క్లుప్తముగ నుండలేక పోవుటయే.

# 48

## సమర్పణ - సన్యాసము

**భ**క్తితో సమర్పించినది ఏదియైనను భగవంతునిచే స్వీకరింపబడునని భగవద్గీత తెలుపుచున్నది. భక్తి సత్పురుషులను భగవంతునికి ఉన్ముఖులను చేయును. భక్తి యున్నచోట సమర్పణ యుండును. సమర్పణ యున్నచోట భక్తి యుండును. చేయు కార్యమునందు మనస్సు, వాక్కు, కర్మ సమర్పణము కావలయును. సిద్ధించిన ఫలమును కూడ సమర్పణము చేయవలెను. అట్లు సమర్పణము చేయువానికి మాత్రమే వ్యక్తిగత సంకల్పములు కూడ సమర్పణము చేయు శక్తి కలుగును.

ప్రతి వ్యక్తికిని అనేకానేక సంకల్పములు కలుగుచుండును. అవి వాగ్రూపము, కార్యరూపము దాల్చకముందే దైవమునకు సమర్పణచేసి వేచియుండుట సమర్పణ మార్గమున అత్యుత్తమమగు విషయము. అపుడే సంకల్ప సన్యాసము కలుగును. సంకల్ప సన్యాసము కలిగినవానికి దివ్యత్వముతో యోగము చెందుటకు అర్హత ఏర్పడును. లేనిచో తన సంకల్పములే తనను బంధించును.

## 49

# ధీరత

**తె**లియని విషయమును గూర్చి నిర్ణయించుట కరుడుగట్టిన అజ్ఞానము. తెలియని విషయము తెలియదని చెప్పుట వలన సత్యమున నిలతువు. ఊహించి తోచినది చెప్పుట ఎప్పుడును చేయకుము. తెలియనితనమును ఒప్పుకొనుటలో సిగ్గుపడ నవసర మేమియు లేదు. అందరికిని, అన్ని విషయములు తెలియవు. సృష్టి కర్తయగు బ్రహ్మకే సమస్తము తెలిసియుండు నవసరము లేదని పురాణములు ఘోషించు చున్నవి.

తెలిసిన విషయము తెలిసినంతవరకు చెప్పుము. అంతవరకే తెలుసునని తెలియ జెప్పుము. తెలియని దానిని తెలిసినట్లు చెప్పుట మోసము. నిన్ను నీవిట్లు మోసగించు కొనకుము.

తెలియని విషయమును తెలియదని చెప్పుటతో తృప్తిపడకుము. నీవు కూడ ఆ విషయమును తెలుసుకొనుటకు ప్రయత్నించుము. అట్లు ప్రయత్నించుట శుభలక్షణము.

శిష్యుడొకడు గురువునుచేరి "దేవుని చూడ ప్రయత్నించు చున్నాను. నాపై దయతో మీరు చూపెదరా" అని పలికెను. గురువు

చిరునవ్వుతో “నేనును ఆ పని మీదే యున్నాను. కలసి, స్నేహితులవలె జీవన ప్రయాణము చేతుము. నాకు కనబడినచో నీకును కనబడగలడు” అని పలికెను. ఇరువురును సత్యమార్గమున నిష్కపటముగ ప్రయాణము సాగించిరి.

# 50

## బోధిసత్వుడు

**అ**త్యంత అపాయకరమగు భావమేమియో తెలుసునా? "చాల మేలు చేసితిని, ఫలమేమి కలిగెను? అంతయు వృథా!" ఈ భావము కన్న అపాయకరమగు భావము లేదు. మైలురాళ్ళను లెక్కపెట్టుకొను వారు సుదీర్ఘ ప్రయాణము నెట్లు చేయగలరు. తాము పడుచున్న శ్రమను తామే గుర్తించుకొనుచున్నపుడు అది నిజమునకు ఆవ గింజంత యైనను ఎవరెష్టు పర్వతమంత కనిపించును. ఇట్టివారు హృదయ దౌర్బల్యమునకు గురియై విఫలు లగుదురు.

ఆకాశమున పక్షులు ఉదయముననే చాల దూరము ప్రయాణము చేయును. రెక్కలాడించినపుడెల్ల లెక్కపెట్టుకొనుట పక్షులు చేయవు. కనుకనే కొండలు, గుట్టలు, నదులు దాటి ఆహారము స్వీకరించుకొని మరల ఉత్సాహముగా గూడు చేరుచున్నవి. గమ్యము చేరువానికి మైలురాయి చూడ పనిలేదు. గమ్యము చేరుటయే ప్రధానము. మార్గమున అలసినవారికి ఒక మైలుదూర మెక్కువగ గోచరించును. ఉత్సాహముగల వారికి తక్కువగ గోచరించును. బోధిసత్వుడు నడచిన దూరము తెలిసినచో మీరు నివ్వెరపోదురు. బోధిసత్వుడు శ్రేయోదాయకమగు కార్యములందు పరిశ్రమించుచు,

తనను తాను మరచినాడు. అతని గమ్య మనంతము. తనను చేరు కాలము కూడ అనంతమే. కావున అతని పరిశ్రమ అనంతము, శాశ్వతము అయి నిలచినది.

## 51

# సాధన

సత్సాధన ఒక ప్రయోగము వంటిది. యోగము ఒక రసాయనిక చర్య. యోగము ననుష్ఠించు సాధకుడు తనను తానొక రసాయనిక చర్యకు సమర్పించుకొనును. తాను సాక్షిగ, తన స్వభావము మార్పు చెందుచుండును. స్వభావమున కలుగుచున్న మార్పులను గమనించుటయే సాధకుడు చేయవలసిన పని. హఠ యోగమున రసాయనిక చర్య సాధకుడే నిర్వర్తించుకొనును. రాజ యోగమున శిష్యుడు గురువునకు నమస్కరించినంతనే రసాయనము ప్రారంభ మగును. రసాయనిక చర్య గురువే నిర్వర్తించు చుండును. ఆశీనుడై గమనించుటయే శిష్యుని వంతు.

సాధన సద్గురువు తెలిపిన రీతిలో నిరంతరమై సాగగ, శిష్యుని యందలి రసాయనము ఒక స్థితిలో స్వభావమును మార్పు గావించుచు నూతన స్వభావమునకు తెర తొలగించును. పాలు పెరుగైనట్లు, స్వభావమున మార్పు కలుగును. ఇట్టి మార్పును శిష్యుడు గమనింప వచ్చును. చంచలత్వము నుండి స్వభావము స్థిరమగును. అటుపై రసాయనిక చర్య సాగును. పెరుగు మజ్జిగయై, అందుండి వెన్న పడినట్లు తన స్వభావము నుండి నూతనము, దివ్యము అగు స్వభావము

ఏర్పడు చుండును. ఇట్లు జరుగు మార్పులు సాధకుడు చేయు సాధన బట్టి యుండును. ఒక్కొక్క జన్మమున కొంత రసాయనిక చర్య సాగుచు 12 జన్మలలో సత్సాధకునకు యోగము సిద్ధించ గలదు.

ఇట్టి సాధన నిర్వర్తించుటకు గురు పరంపర యున్నది. **ఆసక్తి చూపు సాధకులే అరుదు. సాధకులలో నెక్కువభాగము సద్గురువు చుట్టును చేరి మద్దెల మ్రోగించుచు, డప్పు కొట్టుకొనుచు తిరుగువారే యుందురు. సద్గురు వందించు సాధన చేయు స్ఫూర్తి మాత్ర ముండదు.**

52

# సిద్ధి

సరిగ గుర్తింపనపుడు మరపు ఉండును. చేయుచున్న పని యందు శ్రద్ధ యున్నపుడు చిత్తము పనిని గుర్తించును. చిత్తము శ్రద్ధగ గుర్తింపనివే మరపునకు వచ్చును. చిత్తమునకు గుర్తుండక పోవుట యుండదు. గుర్తింపకపోవుటకు కారణము అశ్రద్ధ. ఎవ్వరును తమ కిష్టమైనవి, ప్రియమైనవి మరువరు. ఇష్టమున్నచోట చిత్త ముండును. ఇష్టము లేనిచోట చిత్తముండదు. కర్తవ్యము ఇష్టమైనపుడు మరపురాదు. కర్తవ్యము కేవలము ఒక బాధ్యతగా మాత్రమే యున్నపుడు మరపు వచ్చును. బాధ్యత అను పదములో భార మున్నది. ఇష్టము అన్న పదములో భార మదృశ్య మగును. ఇష్టమగుచో పని కష్టము కాదు. ఇష్టము లేనివారే కష్టపడుచున్నా మనుకొందురు. తమపై తమ సానుభూతి పెరుగుకొలది కర్తవ్యములయందు మరపు పెరుగును. మరపు గలవారి ద్వారా అపాయములు కలుగును. మరచుట అపాయకరమని ఎరుగుము. మరపు లేకుండుటకు ఇష్టముతో కూడి చేయుట నేర్వుము. నీకున్న పనియందు నీ కిష్ట మేర్పడుటయే నిజమగు సిద్ధి.

53

## క్రమోన్మీలనము

**మా**నవ జీవితములో ఏదో ఒక జన్మయందు మానవుడు క్రమశిక్షణము నేర్వవలసి యుండును. క్రమశిక్షణము ద్వారా క్రతు బద్ధమగు జీవితమున ప్రవేశించు అవకాశము ఒకటి ఏర్పడును. క్రతుబద్ధ జీవనము దీక్షాయుత జీవన మగును. క్రతువు అనునది కాలసంబంధమై యుండును. పనులను కాలబద్ధముగ చేయువారికి క్రమము పెరుగుచున్నకొలది సమర్థత పెరుగును. అట్టి సమర్థత కారణముగ వైవిధ్యమగు కార్యములు చేయుటకు వీలుపడును. తద్వారా మనోవికాసము కలిగి స్ఫూర్తి కలుగును. స్ఫూర్తిని గొనుచు విస్తారమగు కార్యక్రమములు చేయుచు, బహుముఖములుగ మానవుడు వికాసము చెందును. చేయు పనులయందు, నిశితముగ బుద్ధి పని చేయుట ప్రారంభించును. కార్యములు నిరంతరము నిశ్చయముగను సాగుచు, ఒడుదొడుకులను గూడ అధిగమించును. ప్రజ్ఞ బహు ముఖములుగ విస్తారము చెంది, చైతన్యము వికాసవంతము అగు చుండగ జీవపరిణామమునకు వేగము పెరిగి దేహబద్ధత తొలగును. అపుడు దేహమున వసించుటయే యుండును గాని, దేహముచే బంధింపబడుట యుండదు. దేహము కూడ యినుమడించిన

ప్రాణశక్తితో ఉత్తమజాతి గుఱ్ఱమువలె పనుల కుత్సహించును. మొద్దు ఎద్దువలె పడి యుండదు. ఉచ్చైశ్రవమై అంతరిక్షమున నుండుట, చూచుట అను ప్రజ్ఞలు జీవున కేర్పడి మార్గము సుగమ మగును. జీవనము పరహితముగ స్థిరపడి, పరహితమే జీవనముగ మారును. ఇది ఒక క్రమోన్మీలనము. ప్రతి సాధకుని యందు మే మాశించునది ఇదియే.

54

## ముఖవర్చస్సు

**సూ**క్ష్మలోకముల యందు రంగులు కాంతివంతములై యుండును. చీకటి గోచరింపదు. ఇంద్రధనుస్సు యందు నలుపుండదు గదా! స్థూలము నుండి సూక్ష్మము లోనికి ప్రవేశించు చున్నపుడు రంగులు కూడ తేజోవంతములు, కాంతివంతములై యుండును. సిందూరము, బంగారము, ఆకుపచ్చ, నీలము యిత్యాది రంగులన్నియు అత్యంత ఆకర్షణీయములై యుండును. పదార్థము స్థూలమగుచున్న కొలది, రంగులు కాంతి కోల్పోవు చుండును. సూక్ష్మ మగుచున్న కొలది కాంతి పెరుగు చుండును.

సాధకుల యందు కూడ ఈ మార్పును గమనింపవచ్చును. కాంతివంతమైన ముఖములు, కాంతి విహీనము లగుచున్నపుడు, పదార్థము స్థూలమగుచున్నట్లు తెలియవలెను. ముఖము, హస్తములు, హృదయము కాంతివంతము లగుచున్నపుడు చైతన్యము అధిక మగుచున్నట్లు గుర్తింపవచ్చును. ముఖవర్చస్సునుబట్టి సాధకుని స్థితి గతులు తెలియుచు నుండును. పారదర్శకమగు భావములు గలవారి ముఖమున కాంతితోపాటు చిరునవ్వు కూడ యుండును. మర్మముగల కన్నులు, ముఖము స్పష్టముగ తెలియుచుండును. మానవుల యందలి

భావపరంపరలకు వారి ముఖములే అద్దముల వంటివి. ముఖములు చదువుట పరిశీలించి తెలుసుకొనుట సులభము. మర్మము, మోసము గల ముఖములు తారసిల్లునపుడు మౌనము వహించుట సాధకుల కర్తవ్యమై యుండును. అట్టివారికి కూడ సద్భావము కలుగవలెనని సంకల్పించుట, సత్సంకల్ప బృంద సభ్యులకు ముఖ్యము. మా బృందము సత్సంకల్ప బృందమే.

55

## అస్వస్థత - సూచనలు

సాధకులు తమ ఆరోగ్య విషయమున పరిపూర్ణమగు బాధ్యత కలిగి యుండవలెను. స్వావలంబనమునకు ఇది మొదటిమెట్టు. దేహము స్వస్థత యందున్నపుడే సత్కార్యములు నిర్వర్తించుటకు వీలుండును. అస్వస్థతకు లోనుకాకుండ తనవంతు ప్రయత్నము తా నొనర్చు సాధకునకు మా సహాయము లభించును. తనవంతు బాధ్యతలు విస్మరించిన వారికి మా సహాయము లభింపదు. ఆహార విహారములు సాధకుని ప్రాథమిక బాధ్యత. అది మరచుట అశ్రద్ధకు తార్కాణము.

దేహి స్వస్థత బాధ్యతే అయినప్పటికిని ప్రతి చిన్న అస్వస్థతకు పనులు మానుట జరుగరాదు. యజ్ఞార్థమగు కర్మ కొనసాగుచునే యుండవలెను. అట్టి కర్మ నిర్వహణమున స్వల్పమగు అస్వస్థతలు సర్దుబాట్లగు చుండును. దేహ మందించు సూచననుబట్టి ఆహారమున స్వల్పమగు మార్పులు చేసుకొనినచో నిరాటంకముగ జీవనము సాగుచు నుండును.

ప్రారబ్ధమునుబట్టి తీవ్రమగు అస్వస్థత దేహమున ఏర్పడినపుడు దానిని దైవ మిచ్చిన విరామముగ దేహచికిత్సతోబాటుగ మననము,

శ్రవణము నిర్వర్తించుకొనవలెను. అపుడు చికిత్స సవ్యముగ సాగి దేహమున స్వస్థత ఏర్పడును. అస్వస్థతను గూడ సద్వినియోగము చేసుకొనుట సత్సాధకుని కర్తవ్యమై యున్నది. అస్వస్థత కలిగినపుడు దైవస్మరణము పెంచుకొనవలెను గాని, రోగస్మరణము చేయుట, భయపడుట జరుగరాదు. పరామర్శించు బంధువులు, మిత్రులు సాధకుని కాలమును వృథా ప్రసంగములతో హరించుట జరుగు చుండును. పరామర్శతోపాటు పలురకములగు విషయముల ప్రస్తావన సాగును. విషయాసక్తి విషము వంటిదని భావించుచు, అట్టి వృథా ప్రసంగములను సున్నితముగ తిరస్కరింపవలెను. అస్వస్థులగు సాధకు లకు ఈ సూచన లీయబడు చున్నవి.

## 56

## సహజ పరిణతి

పసిపిల్లల పలుకులలో అపుడపుడు వారి పూర్వజన్మ సంస్కారములు వాచక రూపమున బయల్పడు చుండును. వానివలన పసివారి పూర్వజన్మ వృత్తాంతములు కొన్ని తెలియుటకు వీలు పడును. అందు మంచి మాటలను ప్రోత్సహించుట పెద్దల కర్తవ్యమై యున్నది. పసి వారు కొన్ని కొన్ని విషయములలో వయసుకు మించిన ఉత్సుకత, సంసిద్ధత చూపుదురు. అట్టివి సద్విషయము లగునపుడు వానిని ప్రోత్సహించుట పెద్దల కర్తవ్యము. సద్విషయము లందు చిన్నతనమున చూపు చొరవను ప్రోత్సహించుట పెద్దల బాధ్యత. అందలి సూక్ష్మ సత్యమును గుర్తించి, ప్రోత్సహించవలెనే గాని, నిరుత్సాహపరచరాదు. జీవుని స్వయం ప్రకాశమునకు అడ్డు తగులుట, అరికట్టుట పశు ప్రవృత్తి అయి ఉన్నది. భూతకాల మందలి అనుభవమే ప్రస్తుత కాలమున బీజప్రాయములై మొలకెత్తు చుండును. కలుపును ఏరివేసి బీజవృద్ధికి తోడ్పడవలెనే గాని అంతరాయము కలిగింపరాదు. జ్ఞానపరమగు ఉత్సుకతకు వయసుతో నిమిత్తము లేదు. ప్రాతఃకాలము ననే సహజముగ లేచు పసివారిని సోమరులగు తల్లిదండ్రులు నిద్రపుచ్చుట, నిద్రకు బలవంతము చేయుట దురదృష్టకరమని

తెలియవలెను. సహజముగ నున్న జ్ఞానపరమగు ఆసక్తిని, ఉత్సుకతను నివారించు హక్కు ఎవరికిని లేదు. తెలియదగిన విషయములకు ఆంక్షలు పెట్టరాదు. పరిణతి గల జీవులు చిన్నతనముననే తమ వయసునకు మించిన పనులయందాసక్తి చూపుదురు. అట్టి సమయ మున తగు మాత్రము రక్షణ నిచ్చుచు ప్రోత్సహించవలెను.

కొందరు పసిబిడ్డలు తల్లి గర్భమునుండి త్వరితగతిని బయల్వె డలుదురు. అట్టి వారందరు అమితమగు చురుకు గలవారై యుందురు. ముందుగనే జ్ఞానపరమగు విషయములకు సంసిద్ధత చూపు పిల్లలను ప్రోత్సహించవలెనే గాని నిరుత్సాహ పరచరాదు. సహజ పరిణతికి అంతరాయము కలిగించుట పశుప్రవృత్తి.

57

## నిరుపయోగ మౌనము

ఎల్లప్పుడు మౌనము పాటించు సన్యాసికి ఒకమారు ప్రార్థన మున ఒక సందేశ మొచ్చినది. "మౌనము కన్న సద్గోష్ఠి మిన్న. సద్గోష్ఠి వలన సత్పురుష సంగమము, సమాశ్రయము లభించును. కేవలము మౌనము ఎట్టి ప్రయోజనమును కలిగింపజేయదు.

వ్యర్థ ప్రలాపములకన్న మౌనము మేలు. మౌనము కన్న స్తుతి, సద్భాషణము మేలు. చెడును నివారించుకొనుటయే కాదు; మంచిని పెంపొందించుకొనుట ముఖ్యము. అశుచి భుజింప కుండుటవలన ఆకలి తీరదు. శుచిని భుజించుట కర్తవ్యము.

చెడుపని చేయకుండుట మాత్రము చాలదు. మంచిపనిని కూడ చేయవలెను. చెడుమాటను పలుకకుండుట మాత్రము చాలదు. మంచిమాటలు పలుకవలెను. నిందచేయుట మానినచో చాలదు. దివ్యస్తుతి చేయుచు నుండవలెను.

నీవు కేవలము మౌనముగ నుండుట వలన ఏమియు సాధింప లేవు. సద్భాషణము, సత్సంగము, సత్కార్య నిర్వహణము కూడ నిర్వర్తించుట ప్రధానము. దైవము వాక్కు నిచ్చినది జీవితమును

పండించుకొనుటకు. వాక్కును సద్వినియోగ పరచుట నేర్చుము. వాక్కు ఆధారముగ లోకములను కూడ దాటవచ్చును. నీ మౌనము నిరుపయోగము.”

58

## మానవుని విలువ

**మా**నవుడు ఏమియు నేర్చుకొనక, ఏ అనుభూతియు పొందక, ఏ పరిణతి చెందక జీవించుట వ్యర్థము. జీవితమున స్ఫూర్తి యుండవలెను. చురుకుదన ముండవలెను. ఉన్నతమగు ఆశయ ముండవలెను. ఆశయమునకై కృషి యుండవలెను. కేవలము పొట్ట పోసుకొనుటకే జీవించుటకు మానవునిగ జన్మించవలసిన అవసరము లేదు. వృక్షము, పశువు అయిన చాలును. మానవ జన్మ ఆ రెంటికన్న ఎంతో విలువైనది. మానవు డగ్నిశిఖ వంటివాడు. అతను జీవితమున ఇంద్ర ధనుస్సువలె వెలుగొందవచ్చును. మానవున కసాధ్య మేమియు లేదు. దీక్షతో కృషి సలిపిన అతని కందుబాటు కాని దేదియు లేదు. కేవలము రక్తమాంసాదులతో కూడిన శరీరమునకు మానవుడు పరిమితము కానక్కరలేదు. అతనికి ఊహించుటకు మనసున్నది. ఆ మనసునకు బుద్ధి తోడై యున్నది. ఆ రెంటిని ఆధారము చేసుకొని అతనెంతయో ఎదుగ వచ్చును. అన్నిటికిమించి అతనియందు హృదయ మున్నది. ఆ హృదయముతో విశ్వప్రేమను గూడ అనుభవింప వచ్చును.

59

## క్రియాశీలత

**జీ**విత మంతయు పరనింద, ఆరోపణలతో వ్యర్థము చేయకుము. ఎంత సాధించినను, ఇంకనూ సాధింపవలసినది ఎంతైనను యుండును. చాల చేసితినని, ఇక చాలు అనుకొనుట తమోగుణ లక్షణము. తమోగుణము గలవాడు పనులు ఎప్పు డంతమగునో అని వేచి యుండును. విముఖతతో కార్యములు చేయును. వృద్ధిలేక వితండ వాదములు, సిద్ధాంతములు ఆశయములుగ గొని బ్రతుకు వెళ్ళబుచ్చు చుండును. రజోగుణ సంపన్నుడు అహర్నిశలు కార్యములు నిర్వర్తించు చున్నను నిందలు, ఆరోపణలు, అసంతృప్తి, అలజడి కారణముగ సుఖపడడు. పవిత్రమగు కార్యములు కూడ అపవిత్రముగ సాగించుచు, దుఃఖపడుచు, వెష్టపడుచు, పరనింద చేయుచు, ప్రయాస చెందుచు జీవించును. ఇట్టివారి కార్యములు అపవిత్రత కారణముగ మరణించును.

అనునిత్యము ఆత్మపరిశీలన కావించుకొనుచు, పనులను నిశితమైన దృష్టితో నిర్వర్తించుచు, ఉన్నత ఆశయ సిద్ధికై పాటుపడుచు జీవించువారి యందు మాకు ఆసక్తి మెండుగ నున్నది. అట్టివారికి అదృశ్యముగనే సహాయము గావించు చుందుము. వారి పనులు

స్వల్ప ప్రయత్నములతోనే సిద్ధించుటకు కారణ మిదియే. పనులు జరుగుచున్నపుడు, అవి సిద్ధించు చున్నపుడు, ఎవరి యందు వినయము పెరుగునో, వారితో కూడి పని చేయుదుము. క్రియాశక్తి వలననే ప్రపంచము చక్కగ నడచును. క్రియాశూన్యు లగువారి యందు మాకు ఆసక్తి యుండదు. వేదాంతులైనను, జ్ఞానులైనను లోకహితము నకు సమర్పణము చెందనపుడు వారు సృష్టి యజ్ఞమందు భాగస్వాములు కాలేరు. వారివలన జీవకోటికి అందివచ్చు శ్రేయస్సు అంతంత మాత్రమే.

స్ఫూర్తిమంతులై సత్వగుణము నాశ్రయించి కర్తవ్యకర్మతోపాటు హిత కార్యములు చేయుచు, జ్ఞాన సముపార్జనము చేయుచు, సమస్త మును సమర్పణ భావనతో నిర్వహించువారు మా సహకారమునకు పాత్రులు.

60

## దేహ బలము

**భా**వ ప్రపంచము ప్రస్తుతకాలమందు అమిత వేగముగా సాగుతూ ఉన్నది. మానవజాతి భావనలలో కొన్ని ప్రత్యేక సమయము లలో ఊర్ధ్వ లోకముల నుండి ప్రసారము చేయబడిన భావనలు కూడ మిళిత మగుతు పురోభివృద్ధికి తోడ్పడుతున్నవి. అలాగే కొన్ని భావనలు అధోలోకములనుండి కూడ ప్రచారము కాబడి అవరోధా లేర్పరుస్తూ ఉన్నాయి. వీనిని ప్రశాంతచిత్తులు నిష్పాక్షిక దృష్టితో నున్నపుడు గమనించ గలుగుతు నున్నారు. సూక్ష్మ దృష్టి, సూక్ష్మ అవగాహన ఇట్టి విషయములందు ప్రాధాన్యత వహించును. గంభీర మగు ఈ లోకాతీత భావనలను సరియగు పద్ధతులలో అవగాహన చేసుకొనుటకు, అందివచ్చు ఆధునిక భావనలలో పురోగతి కలిగించు భావనలను ప్రోత్సహించుటకు, ఇతర భావనలను నిర్జించుటకు సదాచారముతో కూడిన వాహికలు సంసిద్ధము కావలెను. తేజస్సుతో బాటు బలము కూడ కావలెను. దేహములకు ఓజస్సు కావలెను. సత్సాధనల ద్వారా దేహము పలుచబడిననూ, బలహీనమై యుండ రాదు. బలహీనమగు దేహములు గల సాధకులు ఒత్తిడికి తట్టుకొనలేక మతిభ్రమణమును కూడ పొందుచున్నారు. అట్లు జరుగరాదు. ఎందరో

కవులు, చిత్రకారులు, గాయకులు, తపస్విజనులు దేహపరమగు బలము యొక్క ఆవశ్యకతను విస్మరించుట చేత వారికి కలుగు ఉన్నతోన్నత భావములను ప్రపంచమునకు అందించలేక అస్వస్థులగు చున్నారు. మహత్తరమగు విద్యుత్తు ప్రసారము కావలెనన్నచో విద్యుత్తు తీగలు సున్నితముగను, బలముగను కూడ యుండవలెను. సున్నితత్వము బలము కూడియుండుట యోగ జీవన మాచరించిన వారికే వీలుపడును. నరముల బలమే బలము. బలమగు నరములు, నాడులు ఉండుట ఆవశ్యకము. కండబలము ఆవశ్యకము కాదు. ఒత్తిడి సమయములలో చెదరకుండుట సాధకుని లక్షణమై యుండ వలెను. అట్టివారే ప్రస్తుత కాలమున అవసరమై యున్నారు.

61

## ఒత్తిడి – సూర్యోపాసన

ప్రస్తుతము మీ చుట్టునూ ఆవరించియున్న వాతావరణము యొక్క నిజ స్వరూపము మీకు తెలిసినచో మీరు భయాందోళనలకు లోను కాగలరు. మీరెంత అపాయ స్థితిలో నున్నారో మీకు తెలియక పోవుటయే ఒక రకముగ రక్షణయై యున్నది. అజ్ఞానము వలన అపాయములు గుర్తింపలేకున్నారు. మీ చుట్టును మితిమీరిన కాలుష్యము వాతావరణమున నిండియున్నదని మీకు తెలియును. గాలి, నీరు, ధూళి ఇత్యాది కాలుష్యములే మీకు తెలియును. వాటి రసాయనము మీకు తెలియదు. దీనికి తోడై మితిమీరిన భావ కాలుష్యము కూడ యున్నది. అంతకుమించి అన్ని పరిశోధనలు, అణు విచ్ఛేదములు కూడ జరుగుచున్నవి. సముద్ర జలములయందు మునుపెరుగని అలజడి కూడ యున్నది. భూ ఖండముల లోపల, క్రిందున కూడ అలజడి యున్నది. ధృవముల వద్ద అమిత వేడిమి చేత కదలికలున్నవి. భూమి చుట్టును గల గ్రహముల ఒత్తిడి కూడ యున్నది. వీటినన్నిటిని సమర్థవంతముగ సర్దుబాటు చేయుచు సూర్య మండలమునుండి నిర్వహణము గూడ జరుగుచున్నది. సూర్యుడు మన సౌరకుటుంబమున, మన భూమియందు జరుగుచున్న అలజడుల

నన్నిటిని అహర్నిశలు సర్దుబాటు చేయుచునే యున్నాడు. రాజు బలముగ నున్నపుడు రాజ్యమున కపాయ మెట్లుండదో, అట్లు గ్రహరాజగు సూర్యదేవుడు తన జీవులను తానే స్వయముగ కాపాడుచు నున్నాడు. వాని ఆరాధనమున జీవులు కూడ స్థిమితమును పొంద గలరు. ఈ సత్యమును తెలిసి సూర్యోపాసనము గావించుట శ్రేయస్కరము.

62

## ప్రాచీన ఆరాధనము

**మీ** యందలి భావనా శక్తిని అశ్రద్ధ చేయకుడు. ఈ శక్తిని తిరస్కరించిన వారు తమ ఉజ్వల భవిష్యత్తును తిరస్కరించిన వారగుదురు. భావనాశక్తి చేతనపై ఆధారపడి యున్నది. మానవుని యందలి చైతన్యము గుణములకు లోనై యున్నది. గుణముల యందలి తారతమ్యమే మానవ చైతన్య ప్రకాశము నందలి తారతమ్యముగ గోచరించును. ఒక జాతి, దేశము, కులము చైతన్య తారతమ్యమును బట్టే తెలియనగును. కొందరియందు తమోగుణ మధికము. కొందరి యందు రజోగుణ మధికము. బహు కొద్దిమంది యందు సత్వగుణ మధికము. గుణాతీతులై యుండు చైతన్యము సమాజముల యందు అరుదుగ కన్పట్టు చుండును. గుణముల తారతమ్యమును బట్టి భావనలయందు తారతమ్య మేర్పడుచున్నది. గుణముల కతీతమగు వెలుగును ఆరాధించుటయే నిజమగు దైవారాధన. ఇట్టి ఆరాధనము కొద్దిమందే చేయుచున్నారు. నిజమునకు దైవము గుణాతీతుడగుట వలన ఆరాధన లన్నియు గుణముల కతీతమగు ఆరాధనలై సాగ వలెను. శుద్ధ చైతన్యమును ఆరాధించుట యనగా నిదియే. గుణాతీత మగు వెలుగు నారాధించుటయే. అదియే గాయత్రి. "ఓం సత్యం పరం ధీమహి" అను అష్టాక్షరియే గాయత్రి.

63

## చర్విత చర్వణము

**జీ**వితమును పునర్నిర్మాణము గావించుకొనుటకే మా బోధన లన్నియును. సాధారణముగ జీవితము నిర్మాణము చేసుకొను చున్నప్పుడు ప్రారంభదశలో తెలియకయే కొంతభాగము నిర్మింప బడును. ఉదాహరణకు అరవై సంవత్సరములకు కొంత జ్ఞాన మేర్పడి నపుడు ముందు జరిగిన జీవితమున ఎన్నియో పొరపాట్లు జరిగినట్లు దర్శనమగును. ఇపుడు పొందిన జ్ఞానము చిన్నతనముననే కలిగి యుండినచో నా జీవితము మరియొక విధముగ నుండెడిది అని భావించు వారెందరో కలరు. వృత్తి ఉద్యోగము వ్యాపారము వివాహము సంతానము పోషణము సంఘజీవనము ఆరోగ్యము ఇత్యాది అంశములలో మరికొంత ఎరుకతో నిర్వర్తించవలసినవి చేజారి నట్లుండును. చేతులు కాలిన వెనుక ఆకులను పట్టుకున్నట్లు తోచును.

కనుకనే చిన్నతనముననే జ్ఞానమును పొందుటకు శ్రద్ధ వహించుట ముఖ్యము. వినకపోవుట వలనను, వినినవి ఆచరించక పోవుట వలనను మేము మరల మరల చెప్పుచు నుందుము. "ఈ చెప్పిన విషయమున తెలియని దేమున్నది" అని ఎందరో కాకతాళీయ ముగ మాట్లాడుచుందురు. తెలిసినది ఆచరించు చుంటివా? అని

ప్రశ్నించినచో, సమాధానముండదు. తెలిసినది ఆచరించువరకు, తెలిసిన దానినే తెలుపుతూ, ఓర్పుగ నేర్పుచు నుందుము. ఓర్పుతో నేర్పుతో ప్రాథమిక విషయమునే మరల మరల చెప్పుటకు కారణము ప్రాథమిక సూత్రములు పాటింపక పోవుటయే.

## 64

# విషమ పరీక్ష

**భూ**మిపై గల ఈ మానవజాతి ఇప్పటిది కాదు. అతి ప్రాచీనమైనది. ఎన్నియో తరములు గడిచినవి గాని మరల మరల దేహమును ధరించుచు మానవు లిక్కడనే యుండిపోయినారు. ఎన్నియో రకముల బోధనలను వినియున్నారు. ఎందరెందరో మహానుభావులను, దైవ దూతలను చూచి యున్నారు, వినియున్నారు కూడ. అయినను మరల నూతనముగ నొక సద్గురువు బోధించినపుడు నూతనముగ వినుచుందురు. ఇది మా కత్యంతాశ్చర్యకరముగ నుండును. ముందు జన్మలలో వేలాదిసార్లు విన్న బోధనలు మరు జన్మలో మరల విన్నపుడు, ఇంతకు పూర్వమిట్టి బోధన లెవ్వరూ చేయలేదందురు. ఇది ఏమి న్యాయము. మానవుల కింత మరపేల కలుగును. మరల మరల వినుచు, మరల మరల జన్మల నెత్తు చున్నారు. పరిణామము చాల తక్కువగ జరుగును. వినువారే తక్కువ. వినినవి ఆచరించువారు మరీ తక్కువ. ఉపాధ్యాయులు మరల మరల దేహములను స్వీకరించి మరింత నూతనమగు విధానములతో, మరింత నేర్పుగ ఓర్పుగ బోధించుచు పరిణామము చెందుచున్నారే గాని, విద్యార్థు లంతకంతకు గ్రహింపు శక్తిని కోల్పోవుచు, వైఫల్యమునే ప్రకటించుచున్నారు. ఇదియొక విషమ పరీక్ష !

65

## రక్షణ రహస్యము

**స్ఫూ**ర్తి గలవారికి ఆటుపోట్లెక్కువ. ఊర్ధ్వము, ఉత్తమము అగు లోకముల కేగుచున్న కొద్ది, రకరకముల తాకిడి, ఒత్తిడి పెరుగుచు నుండును. స్ఫూర్తి యనునది సున్నితమగు విషయము. సున్నితమైన పుష్పము, శిశువు, మొలక, భావము పరిరక్షింపబడు చుండవలెను. లతాగుల్మముల కెట్లు ఆసరా యుండవలెనో అట్లే ఆత్మ స్ఫూర్తికి కూడ లోబలము అత్యవసరమై యున్నది. దివ్యత్వము కూడ పదార్థ మయ లోకములందు రక్షింపబడు చుండవలెను. బంగారము, వెండి, విలువైన రత్నములు, విలువైన ప్రదేశములు ప్రకృతిచే సహజముగనే రక్షింపబడుచున్నవి. సృష్టియందు రక్షకత్వము ఒక ప్రధానమైన దివ్య లక్షణముగ అందులకే రూపొందినది. దివ్యమగు మణిని సర్పములు కాపాడుట యున్నది గదా! అమృత కలశమును ఇంద్రాది దివ్యశక్తులు కాపాడుచుండును కదా! సున్నితము, సూక్ష్మము, దివ్యము అగు విషయములకు ప్రకృతి యందు రక్షణ మున్నది. దివ్యమగు బోధన లను, గ్రంథములను, పురుషులను ప్రకృతియే రక్షించు చుండును.

రహస్య మేమనగ దివ్యత్వము రక్షణ కొరకై వెదకికొనదు. దానిని రక్షించుకొను బాధ్యత ప్రకృతిదే.

# 66

## సహనౌ యశః


**త**మను తాము రక్షించుకొనువారు, తమను తాము పోషించు కొనువారు ప్రకృతిని నమ్మనివారు. ఇతరులను రక్షించుట, పోషించుటల యందు నిమగ్నమై యున్న వారిని ప్రకృతియే రక్షించును. స్వీయరక్షణ కార్యక్రమము అజ్ఞాన పూరితము. తనకన్న బలహీనులను తాను రక్షించుచు, పోషించుచు యున్నపుడు ప్రకృతియే రక్షించునని తెలియ వలెను. పరహితమున నిమగ్నమైన వారికి స్వహితము అప్రయత్నమై సాగును. ఇది సత్యము. హిత కార్యమే మానవ జీవితమునకు నిజమగు పరిష్కారము. ఈ ధర్మము తెలిసిన మానవునకు జీవితము క్రమముగ ఆనందదాయక మగును. అట్టి వానికే గ్రహదేవతలు, విశ్వేదేవతలు అవగాహన అగుదురు. అనుగ్రహము కూడ చూపుదురు.

మానవుడు కోరకయే అతని యందు ప్రాణ స్పందనము జరుగుచున్నది. అతడు కోరకయే చైతన్యమను తెలివి పనిచేయు చున్నది. పిలువని పేరంటముగ తనయందు ప్రాణము, ప్రజ్ఞ అహర్నిశలు పనిచేయుచున్నవి. కనుకనే ఆ రెంటిని దైవ సమానముగ భావించుట జరుగుచున్నది. తాను కోరకయే మానవునకు వినికిడి, చూపు, స్పర్శ, రుచి, వాసన తెలియుచున్నవి.

దివ్యమగు విషయములు తన కిట్లు సహకరించు చుండగ మానవుడు తెలియవలసిన విషయమేమి? తానును సహకరించుట నేర్వవలెను. తోటి జీవులకు సహకరించుట దివ్యత్వమునకు ఉన్ముఖ మగుటయే. సహకారము విలువ మానవున కింకను తెలియలేదు. సహజీవనము ప్రస్తుత మొక వ్యామోహమే గాని, అందులో విలువ తెలిసినవారు కొందరే. సహజీవన మనగా నాలుగైదు రోజులు మాత్రమే కలిసియుండుట కాదు. కలసిమెలసి జీవించుట.

కలసిమెలసి అభ్యసించుట, పనిచేయుట, భుజించుట, ఆనందించుట, పెరుగుట, చివరకు మరణించుట. ఇట్లన్నిటి యందును పరస్పర సహకారము నిర్వర్తింపవచ్చును. కలిసి వెలుగును పొందుటకే ప్రార్థనలు, ధ్యానములు నిర్ణయింపబడినవి.

వ్యక్తిగత అభిప్రాయములు, వ్యక్తిగత జీవనము, వ్యక్తిగత అభివృద్ధి– ఇత్యాది భావములు చైతన్యపరమగు పురోగతిని కల్పింపవు. వ్యక్తిగత ప్రత్యేకత, గుర్తింపు, గొప్పదనము, కీర్తి– ఇత్యాదివన్నియు వ్యామోహములే. ఎవరికి వారుగ ఉద్ధరింపబడవలెనను కోరిక స్వార్థమే గదా! తాను, తన తోటివారు అందరునూ ఉద్ధరింపబడవలె నను భావన లేని మానవునకు పురోగతి లేదు.



# 67

## మానవ అలసత్వము

విద్యుత్తును స్వస్థత చేకూర్చుటకై వైద్యులు వినియోగించుచు నున్నారు. దీని నుండి ఒక అంశము స్పష్టమగుచున్నది. విద్యుత్తు స్వస్థతను చేకూర్చ గలదని. విద్యుత్తు బుద్ధిలోక ప్రజ్ఞ. అది అదృశ్యముగ మన లోపల వెలుపల నున్నది. దానిని పరికరముల ద్వారా నిర్దేశించుట మానవుడు నేర్చినాడు. దానివలన వెలుగుల నేర్పరచుకొను చున్నాడు. ఎన్నో శక్తివంతమగు పరికరములను నిర్మాణము చేసి కార్యములను నిర్వర్తించు చున్నాడు. విద్యుత్తు ఒక శక్తి. ఒక వెలుగు. మానవుని యందున్న బుద్ధికూడ అట్టిదే.

మానవుని బుద్ధి మానవ భావములను ప్రకాశింప జేయును. ప్రకాశవంత మగు భావములు ఎన్నియో జీవితములను ఉద్ధరించును. విద్యుత్తు ప్రకాశము వంటిదే బుద్ధి ప్రకాశము కూడ. బుద్ధి వికసించు టకు, ప్రకాశించుటకే ప్రార్థన లన్నియును. అపుడపుడొక ప్రకాశము కలిగినపుడెల్ల మానవ జాతి ఎంతయో వికాసము చెందుచున్నది. మానవ మేధస్సు నుండి బుద్ధి ప్రకాశము జరిగినపుడు మానవ పురోగతి జరుగుచున్నది. ఇట్లెందరో మేధావులు బుద్ధి ప్రకాశము కారణముగ భౌగోళిక పరిణామమునకు తోడ్పడిరి.

భరతభూమియందు ఒక మేధావి యగు మానవుడు బుద్ధి ప్రకాశమునకై కృషి సలిపి, శబ్ద తరంగముల ద్వారా విద్యుత్తు ప్రకాశము గావించుకొన వచ్చునని శాస్త్రీయముగ కనుగొనెను. అట్లు కనుగొని శబ్ద తరంగముల ద్వారా అమితమగు బుద్ధిమంతుడై, శక్తిమంతుడై సృష్టికి ప్రతిసృష్టి గావించెను. అతని పేరు కౌశికుడు. బుద్ధి ప్రచోదనమునకు మార్గము చూపి మహాత్ముడై, ఋషియై, మహర్షియై, బ్రహ్మర్షియైనాడు. ఏ శబ్ద సమూహము వలన తానంతటి వాడైనాడో దాని నందరికిని పంచియిచ్చినాడు. అట్లు పంచి యిచ్చుట వలన విశ్వమునకే మిత్రుడై విశ్వామిత్రుడుగ శాశ్వత కీర్తిలోకమున స్థిరపడినాడు. అతడందించినదే గాయత్రి మంత్రము.

గాయత్రి మంత్రము తెలియని భారతీయుడు లేడు. కాని ఆ మంత్రమును శ్రద్ధతో గానము చేయువాడును లేడు. నేడు విశ్వ వ్యాప్తముగ గాయత్రి మంత్ర గానము పరిచయమై యున్నది. కాని శ్రద్ధ, దీక్ష లేకుండుటవలన మానవుడు విద్యుదీకరణమును పొందలే కున్నాడు. ప్రకాశవంతుడు కాలేకున్నాడు. గాయత్రి మంత్ర ఆరాధ నము శ్రద్ధా భక్తులతో సూర్యోదయ, సూర్యాస్తమయ కాలములందు నిర్వర్తించువారు ప్రతి ఒక్కరును ఒక మహాత్ముడు కాగలరు. అట్లు కాకుండుట అలసత్వమే.

# 68

## అగ్ని యోగి

దివ్యలోకములందు క్రీనీడ యుండదు. దీనిని ఊహించుట సాధ్యము కాదు. అన్ని దిశలనుండి వెలుగు ఏర్పరచుకొన్నచో భూమిపై గూడ నీడలేని స్థితి యుండును. అంతట వెలుగే యున్నపుడు నీడకు తావు లేదు గదా! చైతన్యము పరిపూర్ణమైనచో నీడ పడుట కవకాశ ముండదు. భూలోకమందే నీడ, నిదుర యున్నవి. వెలుగు లోకము లందు నీడ లేదు, నిదుర లేదు. నిద్ర లేకున్నచో ఎట్లుండగలము అని భావించువారు భూమి జీవులు.

సప్త వర్ణముల దివ్యకాంతితో దివ్యలోకము సుందరమై వెలు గొందు చుండును. అందు సప్త స్వరముల గానమాధురి అనుస్యూతమై యుండును. అగ్నిదేవు డట్టి లోకముల కధిపతి. అట్టి అగ్నిదేవుని ఆరాధించుట ఒక అదృష్టము. అతనిని హృదయమున కాహ్వానించుట మరియొక అదృష్టము. అతనితో యోగము చెందుటయే అగ్ని యోగము. అగ్నియోగిని అజ్ఞానము తాకుటకు కూడ భయ పడును. అట్టి అగ్నియోగుల బృందమొకటి భూమిపై యున్నది. ఆసక్తి గలవారు అగ్నిచే పవిత్రము కాబడి ఆ విద్యాలయమున అగ్నియోగమును నేర్వవచ్చును. నీటిచే పవిత్రమగుటయేగాక, అగ్నిచే కూడ పవిత్ర

మగుట ప్రవేశార్హత కలిగించును. నీ భావ సముదాయము పరిపూర్ణ ముగ పవిత్రమగుచో నీ వగ్నిచే పవిత్రీకరింప బడిన వాడ వగుదువు. నీ సమస్త భావములను అగ్ని కర్పించుట చేయవలెను. అగ్నిచే పవిత్రీకరింపబడిన భావమునే స్వీకరించి నిర్వర్తింపవలెను. ఇదియొక మార్గము.

అగ్నియోగు లందరును అహర్నిశలు 'రామ' మంత్రము చేయుదురు. నీ వెరిగిన ఆంజనేయుడు అగ్నియోగులలో అగ్రగణ్యుడు.

# 69

## నిరహంకారము

ప్రపంచ మెంత అల్లకల్లోలముగ నున్నను నీవు తలపెట్టిన సత్కార్యము నిష్కల్మష మగుచో దానికి విఘ్నములు కలుగవు. ఈ సత్యము నీవు తెలియవలెను. నిష్కల్మషమగు సత్కార్యములకు అండగ ఋషిబలము, దైవబలము, ప్రకృతి బలము నిలచియుండును. ఎప్పటికప్పుడు దైనందినముగ నీ యందలి కల్మషములను ఏరి వేయుచు నుండవలెను. స్వార్థచింతనము నుండి నీవెప్పుడును బయల్పడి యుండవలెను. సత్కార్యము చేయువారికి అహంకార ముండరాదు. కాని ప్రాథమిక దశలో అహంకారము తప్పనిసరిగ ఏర్పడు చుండును. కనుక దైనందినముగ నిర్మూలించుకొనుట నీవంతు. అట్లు నిర్మూలించు కొననిచో తెలియకనే అహంకారము చేరుట, కార్యముల కడ్డు తగులుట, నీ పరిణతిని పాడుచేయుట జరిగిపోవును. ఈ విషయమున చాల జాగరూకత అవసరము.

మా అనుయాయి ఒకడు మా వద్దకు వచ్చి "నే నహంకారము దాటితినని బీరములు పలికి, అటుపైన ఐదు సంవత్సరములు అష్టకష్టములు పడెను. నిన్ను గూర్చి నీవు ఆలోచించునంత కాలము

నీవహంకారివే యని తెలియుము. నిన్ను గూర్చి నీవు మాటాడుట జరుగనపుడు ఇతరులను గూర్చి మాటాడుట కూడ యుండదు. కార్యమును గూర్చి మాటాడుటయే యుండును.

70

## లోతు - ఉన్నతి

**"ని**న్ను నీవు తెలుసుకో!" అనునది గురువాక్కు. అది నిజమగు ఆప్త వాక్యము. నిన్ను నీవు తెలుసుకొను మార్గము ధైర్య సాహసములతో కూడినది. బాధ్యతతో కూడినది. నిన్ను నీవు తెలుసుకొనుటకు నీలో ఎన్నియో మార్పులు జరుగవలసి యుండును. ప్రస్తుతమున రసాయనమంతయు మార్పు చెందవలసి యుండును. పరిసరములతో సంబంధము లేక నిన్ను నీవు మార్చుకొనుచుండ వచ్చును.

నీ యందలి ఆత్మజ్యోతిని నిత్య మారాధించు చున్నచో నీయందు నీవుగ చేసుకొన వలసిన మార్పులు నీకే ప్రకటిత మగును. శ్రమ, అసౌకర్యము అనుకొనక వలసిన మార్పులను సంతోషముగ నిర్వర్తించుకొనుము. నిన్ను నీవట్లు మార్చుకొను చున్నపుడు, మేము కూడ సంతోషింతుము. నీ యందలి స్ఫూర్తికి మేము సున్నితముగ బలము చేకూర్చుచునే యుందుము. నీ ఈ ప్రయత్నమున శరీర మలసట చెందుచు నుండును. అట్టి అలసటయందే నిజమగు అగ్ని కార్యము జరుగును. శరీర ధాతువునందు, తత్త్వము నందు మార్పు కలుగును. "అలసట" అను భావమును దరి రానీయక దీర్ఘకాలము

సత్కార్యములు నీవు చేయుచు నున్నచో యోగాగ్ని ప్రజ్వలితమై నీ స్వభావమునందు మార్పు తెచ్చును. నీ యందు లోతులు పెరుగును. అటుపైన ఉన్నతులు కలుగును. లోతులు లేని వారికి ఉన్నతి లేదు.

# 71

## సంసిద్ధత

**జ**రుగుచున్న మార్పును గుర్తించుట ఒక చక్కని సాధనా విధానము. ప్రస్తుతమున్నది ఎప్పటికీ ఇట్లే యుండదు. నీవు తప్ప నీ పరిసరము లన్నియు మార్పు చెందుచుండును. నీ యందు కూడ మార్పు చెందుచు నుండును. నీ లోపల, నీ బయట గోచరించు చున్నదంతయు ప్రకృతియే. ప్రకృతికి మార్పు సహజము. మార్పు చెందకుండ ఉండునది, నీయందు అన్నిటి యందు అంతర్హితమై మూలమై యున్నటువంటి "నేను" అను తత్త్వము. అన్నియు మార్పు చెందునని తెలిసియు మార్పు నంగీకరింపక పోవుట విచిత్రము కాదా! అంగీకరించుట వలన ఘర్షణ తగ్గును. నీ వంగీకరించినను, అంగీకరింపకున్నను మార్పు జరుగుచునే యుండును. ప్రకృతికి నీ అంగీకారముతో సంబంధము లేదు. అంగీకరించుట వలన, నీ యందు ఘర్షణ లేకుండుట యుండును. అంగీకరింపకపోవుట వలన మార్పున కడ్డు తగిలి కష్టపడుట, దుఃఖపడుట, బాధపడుట జరుగుచున్నది.

అన్నియు మారుచున్నను ధర్మము మారదు. ప్రకృతి యందలి ధర్మములు మారవు. నీ యందును ధర్మములు మారవు. ఇట్లు మార్పు చెందునవి, మార్పు చెందనివి అని రెండు విధములుగ ప్రకృతి

గోచరించును. ఉదాహరణకు ఉప్పు ఎప్పటికినీ ఉప్పగనే యుండును. అగ్ని మండుచు నుండును. నీరు తడుపుట యుండును. ఇవి మారని ధర్మములు. అట్లే మారు ధర్మములలో పుట్టుట, పెరుగుట, వృద్ధి చెందుట, క్రమముగ కృశించుట, నశించుట యుండును. ఈ రెంటిని తెలుసుకొనుటయే నిజమగు జ్ఞానము.

మారని విషయముల యందు స్థిరపడి, మారుతున్న విషయము లందలి వైభవమును చూచుట ఆనందదాయకము. నీయందు నీవు, నీ వెలుగైన బుద్ధి మారనిది. నీ భావములు, నీ కోరికలు, నీ పెరుగుదలలు- ఇత్యాది వన్నియు మార్పు చెందుచు నుండును. పెరుగునవన్నియు ఎప్పుడూ పెరుగు ననుకొనరాదు. మహా వృక్షమైననూ కొంతవరకే పెరుగును. నీ భావములు నీ కోరికల వలననే నీ యింద్రియములు, నీ శరీరము కూడ కాలపరిమితిని బట్టి పెరుగుట, తరుగుటగ యుండును. నశించుట కూడ యుండును. శరీరము కృశించి నశించు లోపల నీవనుకొన్న కార్యములను పూర్తి చేయుట, అటుపైన నశించునపు డంగీకరించుట నిజమగు ధీరత్వము. సకాలములో ప్రయాణము పూర్తిచేసి వాహనము విడుచుటలోనే ధీరత్వమున్నది.

72

## ఋజు మార్గము

దైవమును గూర్చి స్ఫూర్తితో తపస్సు చేయువారి కన్న దైవ స్ఫూర్తితో లోకమున మేలు చేయువారు మా కిష్టులు. తమ కోసము తపస్సు చేయుట కూడ స్వార్థమే. తమ కోసము పూజలు చేయువారు, వ్రతములు చేయువారు, క్రతువులు చేయువారు స్వార్థపరులు. ఇతరుల కోసము అదే పనులను చేసినపుడు అది పరహిత మగును. పరహితమే నిజమగు యజ్ఞము. హిమాలయములలో ఒక సరస్సునందు తేలుచు, ఒక ముని తపస్సు చేయుచుండెను. నీటి మీద తేలుచు తపస్సు చేయు మునిని చూచుటకు అనేకులు వచ్చు చుండిరి. అతనికి నమస్కార ములు చేయుచు, హారతులిచ్చుచు కాలము వెచ్చించు చుండిరి. నీటిపై నుండి తపస్సు చేయుట అద్భుతమే. కాని దాని వలన ఎవరికిని ప్రయోజనము లేదు. అంతే కాక అది చూచుటకు వచ్చు వారందరు వారి వారి కర్తవ్యములను మాని, వ్యయప్రయాసల కోర్చి ఆ అద్భుత మును గూర్చి చర్చించుచు జీవితము వృథా చేయుచుందురు. ఇట్టి వారి వలన కూడ లోకమునకు ప్రయోజనము లేదు. తాను పనిమాని కూర్చొనుటయే గాక అతడి వలన వేలాదిమంది పనులు మాని అక్కడ చేరి అద్భుతములను చూచుట వలన సృష్టి యజ్ఞమునకు హాని

సంభవించు చుండును. ఎందులకో మానవ ప్రవృత్తి యందు ఇట్టి అప్రయోజనకరమైన అద్భుతములయందు వ్యామోహము మెండు.

నిజమైన యోగులు, సాధువులు, సంతులు లోకహితమునకే జీవితమును సమర్పణ చేయుదురు గాని, మాటలతో గారడి చేయుట, మౌనముతో మభ్యపెట్టుట ఇత్యాదివి చేయరు. యజ్ఞార్థముగ కర్మ నిర్వహణము చేయుట వలన లోకహితము జరుగునుగాని మభ్య పెట్టుట, గారడి చేయుట, శక్తి పాతములు చేతుమనుట, రుసుమును బట్టి ఉపదేశము నిచ్చుట, భిక్ష పేరిట లక్షలు వసూలు చేయుట- ఇత్యాదివి మాయలేగాని మహిమలు గావు. లోకుల బలహీనతలు తెలిసి వానిని స్వలాభమునకు వినియోగించుట వినాశకర మగును.

మహాత్ముల పేరు చెప్పుచు తమ స్వప్రయోజనములు నిర్వర్తించుకొను వారందరు నకిలీ శిష్యులే. సదాచార సంపన్ను డగువాడు తన చేతల ద్వారా తాను నడచుచున్న మార్గము యొక్క మహిమను తేటతెల్లము చేయునుగాని, మాటలు మహిమల ద్వారా మోసము చేయడు.

"యజ్ఞార్థం కురు కర్మాణి" అని గీత శాసించినది. ఇతరుల హితము కోసము జీవించుట వలన సర్వము సిద్ధించును. ఇది నిర్మలమగు మార్గము. ఈ మార్గమున నెవరైనను నడువ వచ్చును.

73

## జీవన రాగము

అపుడపుడు నీయందు నీకు ఉల్లాసముగ కూనిరాగములను పలుకుదువు. అపుడు నీయందేమి జరుగుచున్నదో గమనించితివా? జీవుడు పూర్ణ స్వస్థత యందున్నపుడు లోనుండి అప్రయత్నముగనే రాగములు వెలువడును. అట్టి సమయమున నీవున్నది భావాతీత స్థితి. భావముల యందు పడియున్నపుడు లోనుండి రాగము రాదు. రాగ మప్రయత్నముగ వచ్చినపుడు భావము లుండవు. జీవుడుగ నీవు సహజముగ ఆనంద స్వరూపుడవు. నీవు భావముల లోనికి ప్రవేశించుట నీ కార్యాలయము లోనికి ప్రవేశించుట వంటిదే. కార్య మున్నపుడు భావము నందుండుట అవసరము. కార్యము లేనపుడు భావము నందుండుట వ్యసనము. పని లేనపుడు కార్యాలయమున కేల నేగవలెను? మానవుడు సహజముగ భావమయుడు అగుట దురదృష్టము. కార్యము లేక భావము నందుండుట వలన అస్వస్థత కలుగును. ఇది జీవునకు కలుగు అస్వస్థత. దేహమునకు కలుగు అస్వస్థతకన్న జీవునకు కలుగు అస్వస్థత ఎక్కువ అపాయకరము. జీవునకు స్వస్థత యున్నపుడు దేహమున కస్వస్థత యున్నను జీవున కంత బాధ కలుగదు. జీవసంతోషమునకు భావాతీతమగు ఆనందస్థితి

యొకటియే మార్గము. దానికి ఉపాయము భావములపై స్వామిత్వము పొందుట. అందులకే అంతరంగ ధ్యానము. ఆ ధ్యానమునకు పట్టు నిచ్చునది గానము. ఆ గానము నీయందు హంసధ్వని రాగమై యున్నది. హంసధ్వని యనగ "సోహం" అని వినిపించు శబ్దము. అది ఉచ్ఛ్వాస నిశ్వాసల రూపమున నిశ్శబ్దముగ సాగుచునే యున్నది. పనులు లేనపుడు ఈ గానముతో కూడి యుండుట వలన భావములను దాటుటకు వీలగును. హంసధ్వని రాగ మాధారముగ జీవన రాగములన్నియు వినుట, ఆనందించుట, ఆస్వాదించుట జరుగును.

74

## ప్రార్థనా ప్రయోజనము

**చా**లామంది సత్సాధకులు, మానవతావాదులు దైవప్రార్థన విలువను తెలియలేరు. ప్రపంచము అనేకానేక సమస్యలతో కుతకుత లాడుచుండగా ఈ ఆశ్రమములు, దైవా రాధనములు, దేవాలయ కార్యక్రమములు ఏమి చేయగలవు అని తలతురు. తోటి జీవులకు సహాయపడని ఆరాధనము లేల అని భావింతురు. దైవారాధనలే లేనిచో ఈ ప్రపంచము మరెంత క్రుళ్ళిపోయెడిదో వారెరుగరు.

దైవారాధనము ధర్మ ప్రవర్తనకు దారి చూపును. ధర్మ ప్రవర్తన లేని దైవారాధన వలననే సమాజమున దైవముపైనను, ధర్మముపైనను విశ్వాసము సన్నగిల్లుచున్నది. కాని ధర్మ ప్రవర్తనముతో కూడి దైవారా ధనము చేయుచున్నవారు కూడ భూమిపై బహు సంఖ్యాకు లున్నారు. వారి ప్రార్థనల వలననే ఊర్ధ్వము, సూక్ష్మము అగు లోకముల నుండి సహాయ సహకారము లందుచున్నవి. లేనిచో ఈ భూమిపై ఎన్నియో విపత్కరమగు సన్నివేశములు జరిగి యుండెడివి.

పర్వత ప్రాంతములలో, లోయలలో, వనములలో, గుహలలో, నదీ తీరములలో ఎందరెందరో అత్యద్భుతమగు ప్రార్థనలు జరుపుచు

నున్నారు. వారెవరికిని స్వప్రయోజన కాంక్ష లేదు. లోక ప్రయోజనము నకే వారట్టి ప్రార్థనలు చేయుచున్నారు. వారివలననే ఈ భూమి నిలచి యున్నది.

## 75

## చికిత్స

నరముల బాధలు, తీవ్రమగు జ్వరములు, ఎముకలు కీళ్ళ నొప్పులు సాధారణముగ దేహమందగ్ని కార్య మెక్కువగ నున్నపుడు జరుగును. కొందరి దేహములయందు అగ్ని తీవ్రముగ పనిచేయు చుండును. వాతావరణమునగూడ అగ్ని ప్రజ్వలన మెక్కువగ నున్నది. భూమి కిదివరకటి కన్న ఎక్కువ వేడిమి సరఫరా అగుచున్నది. ఇదియంతయు పరిణామము కొరకే జరుగుచున్నది.

పై తెలిపిన అస్వస్థతలకు గురియైన వారు కొన్ని జాగ్రత్తలు పాటించినచో వారి అస్వస్థతలు ఉపశమించును. ఇట్టివారు ప్రశాంత వాతావరణమున ఉండుట నేర్వవలెను. ప్రయత్నపూర్వకముగ ప్రశాంతతను పెంచుకొనవలెను. వీరికి ప్రాణాయామము బాగుగ వినియోగపడును. తొట్టి స్నానములు కూడ ఉపయోగపడును. ఆశ్రమ వాతావరణము స్వస్థత చేకూర్చును. దినచర్యయందు క్రిక్కిరిసి యుండుట, ఇబ్బడిముబ్బడిగ కార్యములను సృష్టించుకొనుట మాన వలెను. చల్లదనము కలిగించు ఆహార పదార్థములను, పానీయము లను స్వీకరించుచు నుండవలెను. సముద్రతీరములు చక్కగ వినియోగ పడవలెను. పై తెలిపిన అస్వస్థతలు ఔషధముల వలన సరిచేయుట

కుదరని పని. మనోతత్వము, ఆహారవిహారములు సరిచేసుకొన్నచో చక్కని ఉపశమనము కలుగును. ప్రవర్తనమున చేసుకొను చిన్న మార్పుల వలన వలసిన పరివర్తన మేర్పడును.

76

# దైవస్ఫూర్తి

**ఆ**ధ్యాత్మిక స్ఫూర్తిగల వారికి కావలసినది దిశానిర్దేశము, ప్రోత్సాహము. స్ఫూర్తి దైవానుగ్రహము వలన కలుగును. స్ఫూర్తికల వారికి మార్గ మిచ్చుటయే మా కర్తవ్యము. ప్రోత్సహించుట మా ధర్మము. స్ఫూర్తి కలిగించవలెనని మేము తపన చెందము. స్ఫూర్తి కలిగించు కార్యక్రమము జీవునికి దేవునికి గల సంబంధము. ఒక సత్కార్యమును వీక్షించు చున్నపుడు, ఒక సద్బోధను వినుచున్నపుడు కొందరికి స్ఫూర్తి కలుగును. అందరికిని స్ఫూర్తి కలుగదు. స్ఫూర్తి కలిగిన వారిలో కొందరు దిశానిర్దేశమునకు తపన చెందుదురు. దిశానిర్దేశము పొందినవారు ప్రాథమికముగ ప్రోత్సాహమునకు ఎదురు చూతురు. ఇట్టివారికి సహాయము చేయుట ఒక పవిత్ర ధర్మము. అది యజ్ఞార్థముగ నిర్వర్తింపబడవలెను.

విద్యకొరకు విద్యాలయమునందు చేరిన విద్యార్థులకు ఉపాధ్యాయు లిచ్చునది దిశానిర్దేశము, ప్రోత్సాహము మాత్రమే. విద్యా లయమునకు విద్యార్థులను రప్పించుకొను బాధ్యత ఉపాధ్యాయులది కాదు. అట్లే స్ఫూర్తి కలిగించు బాధ్యత మాది కాదు.

మా బోధనలను విన్నవారు, మా కార్యములను దర్శించినవారు స్ఫూర్తి చెందుటకు కారణము వారియందున్నది. మాయందు లేదు. కాని స్ఫూర్తి చెందినవారికి ప్రోత్సాహ మిచ్చుట, దిశానిర్దేశము చేయుట మాత్రము తప్పక చేయుదుము. జీవుని యందు స్ఫూర్తి కలుగుట దైవమే నిర్వర్తించునని మా విశ్వాసము.

## 77

# ఏకాంతము

గ్రుడ్డివారు కొందరు దారియందు అగ్ని ప్రజ్వలించు చున్నపుడు తెలియగలరు. ప్రజ్వరిల్లు అగ్ని వేడిమినిబట్టి కొందరు తెలియుదురు. మరి కొందరు శబ్దమును బట్టి తెలియుదురు. వేడిమి బట్టి తెలియుట కన్న శబ్దమును బట్టి తెలియుట ఉత్తమము. చూపు లేనివారికి శబ్దేంద్రియము హెచ్చుగ పనిచేయు చుండును. చూచుట అగ్ని గుణము. వేడిమి తెలియుట స్పర్శ. అట్టి స్పర్శ వాయుగుణము. వినుట ఆకాశగుణము. ఇంద్రియము లన్నిటికన్న ఆకాశగుణము అగు శబ్దము ఉత్తమమైనదిగ తెలియవలెను.

కనులకు గంతలు కట్టి చిన్న పిల్లలచే ఆటలాడించు ఆచారము నందు ఒక విశేష బోధన యున్నది. వినికిడి పెరుగుటకు పిల్లలచే అట్టి ఆట లాడింతురు. చూచుట లేకున్నను స్పృశించి ఎవరో తెలియుట, వినికిడి వలన ఎవరో తెలియుట ఆటలో భాగము.

ప్రస్తుతమీ ఆట లాడించుటలేదు. అది దౌర్భాగ్యమే. సూక్ష్మ లోకములను తెలియవలెనన్నచో మనిషికి వినికిడి ముఖ్యము. అనాహతమగు శబ్దమును వినుటను అభ్యసించవలెను. అట్టి శబ్దము వినుట చెవి నేర్చినపుడు క్రమముగ సూక్ష్మము, దివ్యము అగు

రూపముల స్పర్శను లో చర్మము తెలియుట నేర్చును. అటుపైన లోచూపు పెంపొంది సూక్ష్మము, దివ్యము అగు రూపములను చూడ వచ్చును.

ఇట్లంతర్లోకములందు పేర్పు అంతయు బహిర్లోకపు పేర్పునకు తలక్రిందులుగ నుండును. సత్యమేమనగ అంతర్లోక పేర్పులకు తల క్రిందులుగ బహిర్లోక పేర్పులున్నవి. అందువలన బహిః కరణములు అంతర్ముఖమై, అంతఃకరణములు పెంపొందనిదే అంతర్లోక సౌందర్యము, వైభవము, మాధుర్యము తెలియుట కష్టము.

అంతర్లోక ప్రవేశమునకు అంతరంగమందలి హంస గానమును వినుటకు జీవు డుత్సహించవలెను. అట్టి ఉత్సాహము కరవైనపుడు సాధనలు సిద్ధింపవు. ప్రశాంతమగు వాతావరణము ప్రాథమికముగ నుండవలెను. అట్టి నిశ్శబ్దమగు వాతావరణమున నుండుటకు ప్రయత్నింపవలెను. అభ్యసింపవలెను. అట్టి సమయమున అంత రంగము చేరి హంసధ్వనిని వినవలెను. అపుడే ఏకాంతమనిన ఏమో తెలియును. ఏకాంతికే సర్వ దర్శనములు ప్రాప్తించగలవు.

78

# ఋతుమార్గము

అగ్ని ఆరాధనము బాహ్యాంతరముల జరుగవలెను. కేవలము బాహ్యారాధనము వలన ప్రయోజనములు చేకూరవు. అగ్ని సమస్త మును పవిత్రీకరించును. బాహ్యమున అగ్ని ఆరాధింపబడుతున్నపుడు అగ్నిజ్వాలలు నృత్యము చేయుట దర్శించు చుండవలెను. ఆ నృత్యమును ఏకాగ్రతతో చూచినచో అందుండి గానము కూడ వినిపించును. అగ్ని గానమున్నదని తెలిసినవారు బహుకొద్దిమంది. మంటల నుండి చప్పుడులు విందురుగాని, జ్వాలలయందలి వేదోక్త మగు గానమును వినువారు ఎవరుగలరు? జ్వాల లన్నియు సంగీత నృత్యములతో కూడియుండును అని తెలియవలెను. అందులకే పూర్వ కాలము పర్వదినములలో రాత్రులయందు వృత్తాకారముగ ఏర్పడి వృత్తము మధ్యలో భోగిమంటవలె పెద్ద అగ్నిజ్వాలలను ఏర్పరచెడి వారు. అగ్నిజ్వాలల ననుసరించుచు పరిధియందు నృత్యములు చేసెడివారు. అగ్నిగానము ననుసంధానము చేయుచు, వీణతంత్రులను మీటుచు, గాన మాధుర్యమునకు పరవశు లగుచుండెడి వారు. వారి గానమునకు, నృత్యమునకు అగ్నిదేవుడు ప్రీతి చెందుచు నుండెడివాడు.

అగ్నివలెనే వరుణదేవుడు కూడ స్ఫటికములపై ప్రవహించు

జలములు చేయు గానమునకు తృప్తిచెందును. జలపాతములందట్టి గానమును వినవచ్చును. జలపాతములు స్ఫటికములపై పడి చిందుచు ప్రవహించునపుడు, అందుండి ఉద్భవించు స్వరములు, జలములు చేయు నృత్యములు వరుణునికి ప్రీతికరములై యుండును.

ప్రకృతియందు యిట్టి గానమెంతయో నిండియున్నది. అడవులు మండుచున్నపుడు, జలపాతములు ఉధృతముగ ప్రవహించు నపుడు, వర్షములు పడునపుడు, పూవులు పండ్లు విరబూయునపుడు, గాలులకు ఆకులు రాలునపుడు, మంచు కురుయునపుడు, క్రొత్త మొలకలు వేయునపుడు అద్భుతమగు ప్రకృతి గానము జరుగుచున్నది. అవియే ఋతుగానములు.

ఋతుగానము, ఋతు వర్ణనము పూర్వము కవులను, యోగు లను ఉత్తేజపరచు చుండెడిది. ఆ గానమునకు వారు పరవశు లగు చుండెడివారు. ఆధునిక మానవుడు ప్రకృతి మాతకు సుదూరముగ కృత్రిమముగ జీవించు చున్నాడు. అతడు ప్రకృతి ఋతువుల నెరుగడు. ఇక గాన మే మెరుగును! ప్రకృతి రమణీయ గానము తెలియనివారు దైవమునెట్లు తెలియగలరు. ప్రకృతియందలి వైభవమంతయు దివ్య వైభవమే. ప్రకృతి ద్వారముననే దైవము నెరుగుట సముచితము. ఇతర మార్గముల దైవము నెరుగుట అనుచితము, అసాధ్యము కూడ.

## 79

## విచిత్రము

**మా**నవుని ఆశకు అంతులేదు. అతడు దురాశాపరుడు. అతనికి బంగారముపై గల మోజు, ఆశ, దాహము ఎప్పటికిని తీరదు. బంగారమెచ్చట చేరునో అచ్చట కలి చేరునని కలియుగ ప్రారంభము ననే ఉచ్చరించుట జరిగినది. బంగారము వలన కలుగు అపకారము, అపాయము ఎరుగలేక మానవుడు బంగారము కొరకై భూమిని కొల్లగొట్టుచు నున్నాడు. ఒక దేశము నొక దేశమును దోచుకొను చున్నది. ఒక జాతి నొకజాతిని చంపుకొనుచున్నది. బంగారమే భూమికి బలము. వెండి బంగారములు భూమికి తెలివి, ప్రాణము వంటివి. తగు మాత్రము మానవులు కూడ వాడుకొనవచ్చును. దురాశకులోనై భూమి యందలి బంగారమునంత త్రవ్వుకొనుచున్న మానవుడు తాను కూర్చున్న చెట్టుకొమ్మను నరుకుకొను వానివలె మూర్ఖుడగు చున్నాడు.

ఎంత బంగారము మానవుడు భూమినుండి కొల్లగొట్టు చున్నాడో అంతకు అంత భూమిపై అగ్ని ప్రమాదములు ఏర్పడు చున్నవి. బంగారము విషయమై దుండగము జరుగుట వలన అగ్ని

కూడ దుండగమై కార్యములను నిర్వర్తించు చున్నది. మానవులను హరించుచున్నది. మారణహోమములు ఎక్కువగుచున్నవి.

బంగారమునకు, అగ్నికిని యిట్టి సంబంధ మున్నదని మానవుడు తెలియలేడు. ప్రస్తుత శాస్త్రజ్ఞులు కూడ తెలియలేరు. ఋషులు, యోగులు మాత్రమే ఈ విషయమందు అప్రమత్తులై యున్నారు. దేహముపై మితముగ బంగారమును ధరించుట సముచితము. అది సత్సంప్రదాయము కూడ. దానివలన మానవుని ప్రాణశక్తి పెంపొందును. కాని బంగారమును కొల్లగొట్టి ఇటుకలుగను, బిళ్ళలుగను మార్చి దాచుకొనుట, కూడబెట్టి నగలు చేసుకొని, బ్యాంకులలో దాచుట యిత్యాదివి వికృతమగు కార్యములు. ప్రకృతి కవి విరుద్ధములు. తామనుభవింపక, ఇతరులకు దక్కనీయక ప్రకృతి నుండి కొల్లగొట్టి దాచుకొను లోభికి పరిష్కారము అగ్ని ప్రమాదమే. అగ్నిదహనము వలన రాబోవు కాలమున విపత్తుకలదని రెండువేల సంవత్సరముల క్రితమే మేము సూచించుట జరిగినది. ధన అధికార మదమువలన జాతులు ఈ విషయమును గ్రహింపరు. పతనమునకే అంగీకరింతురు. ఇది ఒక విచిత్రము. జాతి విచిత్రము.

## 80

# దివ్య సందేశము

**త**నయందు, పరిసరముల యందు జరుగుచున్న మార్పులను అప్రమత్తతతో గమనించుట సత్సాధకునకు ప్రధానము. జరుగుచున్న మార్పులందు సందేశముండును. దానిని తెలుసుకొని తదనుగుణ ముగ ప్రవర్తించుట చాల ప్రధానమైనటువంటి సాధన.

ప్రపంచమునందు తలమునకలగుచు తిరుగు మానవునకు కూడ అపుడపుడు మెఱపు భావనలు కలుగును. తన సమకాలీన సన్నివేశములకు, సందర్భమునకు, సంస్కారమునకు అతీతముగ నుండు భావము అప్పుడప్పుడు స్ఫురించు చుండును. అట్టి భావనను సామాన్యముగ మానవులు లెక్కచేయరు. కాని సాధకుడు వానిని గమనింపవలెను. వెంటనే ఒక పుస్తకమున దానిని వ్రాసుకొనవలెను. ఆచరణమున పెట్టుటకు ప్రయత్నింపవలెను. అట్టివి ఆచరణమున పెట్టినపుడు భవిష్యత్తునందు శుభములు కలుగును.

పదేపదే ఒక మంచి ఆలోచన కలుగుచున్నప్పుడు దానిని వెంటనే ఆచరణ యందుంచవలెను. ఆలస్యము చేయరాదు. ఆలస్యము చేసినచో ఒక మంచి అవకాశము జీవితమున చేయిజారిపోవును.

81

## సర్దుబాట్లు

సమతూకము, సమత్వము, సమభావము, సమదర్శనములను యోగము నిర్దేశించుచున్నది. మార్పు చెందుచున్న ప్రపంచమున సమతూకముగ నుండుట యోగసాధకులు అభ్యసించవలెను. మార్పులను సంయమనముతో అవగాహన చేసుకొని అవసరమగు మేరకు తనయందు కూడ సర్దుబాట్లు చేసుకొనుచు సాగుట తప్పనిసరి. సర్దుబాట్లు చేయునపుడు ప్రాథమికము శాస్త్రోక్తము అగు సూత్రములను, ధర్మములను సర్దుబాట్లు చేయక, ఇతర విషయములను సర్దుబాట్లు చేయవలెను. ప్రార్థన, పరహితము, స్వాధ్యాయము అనునవి ప్రాథమిక సూత్రములు. వానిని సర్దుబాటు చేయుట దుర్బుద్ధి. ఇతర విషయములను సర్దుబాటు చేసుకొనుట, సమతూకముగ జీవించుట అభ్యసించవలెను.

ఆహారము, విహారము, భాషణము యిత్యాది విషయములందు అనునిత్యము మెరుగు పరుచుకొనుటకు ప్రయత్నము సాగవలెను. పరహితము, స్వాధ్యాయము, ప్రార్థన అనువానికి సమయము దైనందినముగ పెరుగుచున్నచో పరిణామము చక్కగ సాగును. వానికంతరాయములు కలుగుచున్నచో జీవితము నాణ్యత కోల్పోవుచున్నదని గ్రహించవలెను. దైనందినముగ పై విషయములను గమనించుచు వలసిన సర్దుబాట్లు చేసుకొనవలెను.

## 82

# సాధనలో రకములు

నిశితముగ మేము సత్సాధకు లందరికిని తేజోమయమగు భావములను ప్రసరించు చుందుము. అందుకొను సాధకులు మూడు రకములుగ గోచరింతురు.

మొదటి తరగతి సాధకులు భావముల నందుకొనుట, ఆచరణ యందుంచుట చేయుచు తమ దేహమును యోగ రసాయనమునకు పరిపూర్ణముగ సమర్పింతురు. తేజోమయమగు భావములు బుద్ధి లోకముల నందుకొని, మనో లోకములయందు కార్యాచరణ పథక ముల నేర్పరచుకొని కార్యములు నిర్వహించుచు, కృషిచేయుచు నుండుటవలన వారి దేహములందు యోగ రసాయనము జరుగుచు నుండును.

రెండవ తరగతి సాధకులు తేజోమయ భావములను అందు కొనునపుడు వారి శరీరములు పై భావములను వ్యతిరేకించి నిరోధించును. దేహధాతువుల యొక్క సాంద్రత వలన వారు ఆచరణమార్గమున చురుకుగ సాగలేరు. దేహ మంతరాయములు కలిగించుట ద్వారా సాధన కుంటు పరచును. ఇట్టివారు దేహ సౌకర్యము అను భావముచే ఘర్షణయందుపడి మందకొడిగ

కార్యములు నిర్వర్తింతురు. అట్లని కార్యములు మానరు. కార్యములు చేయుట, చేయకుండుటుగ కాలము సాగును. సహకరించని భాగస్వామితో కాపురము చేయుచున్నట్లుగ వీరి సాధనా కాలము సాగును. వీరు సకాలమున కార్యములు నిర్వర్తింపలేక, అట్లని కార్యములను వదలలేక అవస్థలు పడుచుందురు.

ఇక మూడవ తరగతి వారు భావమయ లోకములలో మాత్రమే విహరించుచు, ఆచరణ శూన్యులై జ్ఞానపరమగు విషయములను చర్చించుకొనుచు ఇతరులకన్న తాము అధికులమని భావించుచు జీవితమును సాగింతురు. వీరు అందివచ్చిన అదృష్టమును కాలదన్నిన వారగుదురు. వీరి సంఖ్య సాధకులలో మెండు.

83

## విద్యావిద్యలు

ప్రపంచము మంచి చెడులతో కూడియుండును. మంచిని పెంపొందించుటకు గురుపరంపర యున్నట్లే చెడును పెంపొందించుటకు కూడ పరంపర యున్నది. దాన ధర్మములు చేయువా రెట్లున్నారో అట్లే దొంగతనము, దోపిడీలు చేయువారుకూడ కలరు. సంస్కారములు పెంపొందించుటకు కృషి జరుగుచుండగ సదాచారమును నిర్వీర్యపరుచు కృషి కూడ సాగుచున్నది. విద్యాపరమగు కార్యమెంత సాగుచున్నదో అవిద్యాపరమగు కార్యము కూడ అంతకంత సాగుచునుండును.

అవిద్య విద్య నెదిరించు చుండును. ధిక్కరించు చుండును. అవకాశ మున్నచోట అవహేళన కూడ చేయును. కారణ మవిద్యయే. విద్యాపరులు అవిద్యను ఎదిరించినచో భంగపడుదురు. ధిక్కరించినచో అవమాన పడుదురు. అవహేళన చేసినచో హింసింపబడుదురు. ఎదిరించుట, ధిక్కరించుట, అవహేళన చేయుట అవిద్యాతత్త్వము కనుక విద్య నాశ్రయించినవారు అట్టి ప్రయత్నములు చేయరాదు.

తటస్థ స్థితియే విద్యకు పరమావధి. నిందించుట మానుట, నిందింపబడినపుడు మౌనముగ నుండుట పరిపూర్ణమగు విద్య. అట్టి విద్య నేర్చినవారికి అవిద్య వలన భయము లేదు.

84

## దైవము

దైవమనగా అస్థిత్వమే. 'నే నున్నాను' అను భావము మానవునకు కలదు. ఆ 'నేను'గ నున్నది దైవమే. ఉండుట అనునది దైవము యొక్క ప్రధాన లక్షణము. అది ఎప్పుడునూ యున్నది. ఎల్లవేళల యున్నది. సృష్టి ఉన్నను లేకున్నను యున్నది. "ఉన్నది ఎప్పుడును ఉన్నది. ఉన్నది పోదు. లేనిది రాదు" అని శ్రీకృష్ణుడు భగవద్గీతలో తెలిపెను.

లోకము లున్నవి. లోకపాలకు లున్నారు. ఖనిజము లున్నవి. గోళము లున్నవి. వృక్షము లున్నవి. జంతువు లున్నవి. మనుష్యు లున్నారు. దేవతలున్నారు. అనేక శ్రేణులలో దేవతలున్నారు. వీటన్నిటి యందును 'ఉండుట' అనునది దైవమే! ఆ దైవ మాధారముగనే ఇన్నియున్నవి. ఇన్నిగ ఉన్నవి వుండుటలోనికి కరగిపోవును. అపుడు ప్రళయ మందురు. ప్రళయము తరువాతకూడ ఉన్నది ఉండనే యున్నది. దానినుండియే మరల సృష్టి ప్రారంభమై అది ఆధారముగనే అన్నియు మరల ఏర్పడును. ఏర్పడుట, వృద్ధి చెందుట, నశించుట ఇవియన్నియు ప్రకృతి. అట్టి ప్రకృతికూడ ఉన్నదాని నుండియే పుట్టి,

నర్తించి, దానిలోనికి లయమగును. ఇట్లెప్పుడునూ ఉన్నదానినే సృష్టి యందు అంతర్యామి దైవమందురు. సృష్టికి మునుపు, సృష్టియందు, సృష్టివెనుక ఉన్న అంతర్యామినే పరబ్రహ్మమని పేర్కొందురు.

## 85

## నేను - ప్రజ్ఞ

పరమగురువు పరంపర పరతత్త్వముతో ముడిపడి యుండును. తత్త్వమును విడువక, దివ్య సంకల్పమును అనుసరించుచు కార్యములను నిర్వర్తించును. తత్త్వము 'నేను' అను ప్రజ్ఞగ అన్నిటియందు, అందరియందు ఉన్నది. అది యాధారముగ ప్రకృతి అనేకానేక రూపములను, స్వభావములను అల్లుచు నున్నది. ప్రజ్ఞలు కూడ 'నేను' అను తత్త్వముపై ఆధారపడి వివిధమగు వికాసములతో నున్నది.

మానవుడు 'నేను' అనుచున్నాడు. సూర్యుడు కూడ 'నేను' అనుచున్నాడు. ఇద్దరూ నేనే అయినప్పటికి వారిరువురి ప్రజ్ఞావికాసమందు వ్యత్యాసమున్నది. నేనను తత్త్వము అన్నిటియందు ఒక్కటే. కనుకనే 'నేను'గ సూర్యుడు, మానవుడు ఒకటే. కాని ప్రజ్ఞగ మానవుడు సూర్యునితో పోల్చదగినవాడు కాదు. ప్రజ్ఞావికాసమును బట్టి లోకములేర్పడుచున్నవి. రాజు, బంటు బ్రహ్మముగ నొక్కటే. కాని బంటుప్రజ్ఞ రాజుప్రజ్ఞతో సరితూగదు. ప్రజ్ఞాపరముగ రాజు రాజే, బంటు బంటే. 'నేను'గ రాజు, బంటు ఒకరే.

జీవులందరు ఒకటే. కాని ప్రజ్ఞాపరముగ ఖనిజమునకు,

వృక్షమునకు, జంతువునకు, మానవునకు, మహాత్ములకు వ్యత్యాసమున్నది. ఒక స్థితియందు సమానత్వమున్నను మరియొక స్థితియందు అసమానత్వమున్నది. రెండింటిని ఎరుగుట పూర్ణజ్ఞానము.

# 86

## నేను - వెలుగునీడలు

ప్రాతఃసంధ్య, సాయంసంధ్య ప్రతిదినము మనకు తారసిల్లు అద్భుతములు. ఒక సంధ్యయందు చీకటి పగలగును. మరియొక సంధ్యయందు పగలు చీకటి యగును. ఈ రెండు సంధ్యలే సూక్ష్మ లోకములోనికి సింహద్వారములు. వీని విలువ తెలియలేని వారికి సూక్ష్మలోకములు లేవు. ముమ్మాటికి ఇది సత్యము.

సూక్ష్మలోక ప్రవేశమందు ఆసక్తి గలవారు కోకొల్లలు. కాని వారిలో సంధ్యా సమయములయందు జరుగు మార్పును దర్శించు వారు బహుకొద్దిమందే. సంధ్యలయందు కనులు మూసుకొని చీకటి వెలుగగుట, వెలుగు చీకటియగుట లోన దర్శించుటకు ప్రయత్నించ వలెను. తాను సాక్షిగ, ఉదయము తనలోపల చీకటి వెలుగగుటను దర్శింపవలెను. అట్లే సాయం సమయమున తాను సాక్షిగ తనలోపల వెలుగు చీకటియగుట దర్శించవలెను. అట్లే లోపల చీకటియందు తిథుల ప్రకారము వెన్నెలకాంతి పెరుగుట, తరుగుట దర్శించవలెను.

పై విధముగ దర్శించువానికి ఒక సత్యము దర్శనమిచ్చును. తాను వెలుగూ కాదు, చీకటీ కాదు. తాను పెరుగుచున్న వెన్నలకాంతీ

కాదు, తరుగుచున్న వెన్నెల కాంతియు కాదు. తాను తానే! తనయందే వెలుగుచీకట్లు ఏర్పడుచున్నవి. తాను సాక్షీభూతుడుగ వాని నర్తనమును దర్శించు చున్నాడు. ఇట్టి విన్యాసములు గమనించువాడు సూక్ష్మలోక దర్శనమునకు అర్హతను పొందును.

87

## అగ్నిప్రేరకము

సలహాల నిచ్చుట ప్రపంచములో పరిపాటి. అడగనిదే యిచ్చు సలహా విలువలేనిది. ఇచ్చువానియందు విలువ లేకపోవుటచే సలహాకు కూడ విలువ యుండదు. సలహా యిచ్చుటకు ప్రధానమగు అర్హత సలహా కోరబడుట. కోరువాని శ్రద్ధ మరియు ఆవశ్యకత. సలహా నిచ్చువానికి కూడ శ్రద్ధ ఆవశ్యకము. ఇచ్చిన సలహాను అందుకొనుటకు కూడ శ్రద్ధ ఆవశ్యకము. శ్రద్ధతో కోరబడుట, శ్రద్ధతో సమాధాన మిచ్చుట, శ్రద్ధతో స్వీకరింపబడుట సలహా విషయమున ముఖ్యమై యున్నది.

పై మూడు విధముల శ్రద్ధయున్నపుడు శ్రద్ధ కారణముగ సలహా మహిమాన్వితమై భాసించును. దానివలన సత్ప్రేరణ లభించును. మనసు వికాసము చెందును. హృదయమునకు ఊరట కలుగును. చక్కని సలహా ఉత్ప్రేరకమై మనసేంద్రియ శరీరములను తగురీతిని మేల్కొల్పి కార్యసిద్ధికి ఉపయుక్తముగ నియమించును. సలహాయందలి శక్తి అగ్ని ప్రేరకమని తెలియవలెను.

# 88

## పొట్టితనము

పొట్టివారి యందు ప్రత్యేక శ్రద్ధ కలిగియుండుడు. "పొట్టివాడు గట్టివాడు" అను సామెత అర్థవంతము. వారి మనస్తత్వము ఇతరుల మనస్తత్వము కన్న భిన్నము. వారట్లెందుకు పొట్టిగనున్నారో పరిశీలించితివా? అట్టి పరిశీలన మరియు మిత్రభావము నీకెంతయు ఉపకరించును. మానవులలో పొడుగువారిని గమనించినంత పొట్టి వారిని గమనింపకపోవుట మానసిక పొట్టితనము. తాటిచెట్టు చాల పొడుగై యుండును. దాని యునికి, ఉపయోగము అంతంత మాత్రమే. పొట్టిగ నున్నను ఆముదపు మొక్క చాల ఉపయోగము. ఆముద మనగ శాశ్వతమగు ముదము నిచ్చునది. పొడుగు శరీరమునకు మెదడు తక్కువ. పొట్టివానికి మెదడు ఎక్కువ. సమకాలీన యోగులలో శ్రీకృష్ణుడు పొట్టివాడు. మహర్షులలో అగస్త్యుడు పొట్టివాడు.

పొట్టివారిని గౌరవించుట నేర్చిన పెరాసెల్సెస్ వారినుండి ఎన్నియో మహత్తరమగు విషయములను నేర్చి ప్రపంచమున కిచ్చెను. నేటికిని దక్షిణ భారతమున, ఆఫ్రికా ఖండమున, ధృవముల యందు పొట్టివారు అందుబాటులో నున్నారు.

89

# కేంద్రమునకు కేంద్రము

కేంద్రము లన్నియు ప్రభావంతములు. కేంద్ర మెప్పుడును పరిధికి శక్తి తరంగములను వ్యక్తము చేయును. 360 కోణముల ద్వారా సమానముగ శక్తిని వ్యక్తము చేయగలిగినది కేంద్రము. ఒక ఋషి దృష్టి గాని, భావము గాని, భాషణము గాని పై విధముగ పరిధినంతను ప్రభావితము చేయును. మానవునకు హృదయము నిజమగు కేంద్రము. హృదయమునకు దిగువ మూడు కేంద్రము లున్నవి. హృదయమునకు ఎగువ మూడు కేంద్రము లున్నవి. కనుక హృదయము కేంద్రములకు కేంద్రమై యున్నది. కనుక అట్టి హృదయ మున వసించు మానవుడు ఇతర కేంద్రముల యందు వసించు వారికన్న ప్రతిభ, ప్రభ కలిగి యుండును. అట్టివాడు ఎగువ లోకము లను, దిగువ లోకములను సమన్వయింపగలడు. అట్టివాని ఉచ్చారణము, కరణము సప్తలోకములకు వ్యాప్తి చెందగలదు.

పై కారణముగ సమస్త గ్రంథములును హృదయమునే కీర్తించు చున్నవి. హృదయస్థు డగుటకే మానవునకు బోధలు చేయుచున్నవి. ఈశ్వరుడు గూడ జీవుల హృదయమందే వాసముగొని యున్నాడు. హృదయస్థుడవైనచో దివ్య వైభవము అవగతము కాగలదు.

# 90

## శిరస్త్రాణము

**త**లపై కిరీటము, శిరస్త్రాణము, తలపాగ, టోపి యిత్యాది వన్నియు తనపై మరియొక అదృశ్యము, శక్తివంతమగు లోకమున్నదని గుర్తించు సంప్రదాయము. అన్ని జాతుల యందును పూర్వకాలమిట్టి సంప్రదాయ ముండెడిది.

తనపై మరియొక అదృశ్యశక్తి అధిష్ఠించి యున్నదని మరచుట కారణముగ శిరస్త్రాణము క్రమముగ మరుగైనది. శిరస్త్రాణము మతాచారము కాదు. జ్ఞాన సంకేతము. ఋషులు, మునులు తమ శిరోజములనే శిరస్త్రాణములుగ అలంకరించు కొందురు. మైత్రేయ సంఘమున దాదాపుగ అందరును శిరస్త్రము శిరస్సున ఏదో ఒక విధముగ అలంకరించుకొనియే యుందురు. శిరోధార్యమగు దివ్య భావనయే నిజమగు శిరస్త్రాణము. తనకు తెలివిని, ప్రాణమును, సంకల్పమును, జ్ఞానమును, శక్తిని అందించి నడిపించుచున్న వానిని జ్ఞప్తి యందుంచుకొనుట వలన మానవుడు మహాత్ముడగు చున్నాడు. తానే కర్తనని అహంకరించుట కరుడు గట్టిన అజ్ఞానము. దాని ననునిత్యము నిర్మూలించుకొనుటకే శిరోధార్యమగు చిహ్నము. దైవము, గురువు వంటి భావములు సదా శిరోధార్యములై నడచుకొను వానికి సర్వము శుభంకరము.

91

## సంకల్పము - శాస్త్రము

**జ్యో**తిర్విద్య ఆత్మసాధనా ప్రయత్నమున ఎంతయూ తోడ్పడును. గ్రహ దేవతలు మార్గదర్శకులు. వారి సహకారమున ఆత్మమార్గము సులభమగును. వారి సంచారమున యోగసాధనకు చాల మెళకువలు తెలియగలవు. అంతరిక్షమున గ్రహ సంయోగమున ఏర్పడు రసాయన మెరిగి తదనుగుణముగ సాధకులు తమ ప్రార్థనా ధ్యానాదికములను శ్రుతి పెట్టకొనవచ్చును. గురుడందించు వ్యాకోచము, శని అందించు సంకోచము, బుధు డందించు విచక్షణము, శుక్రు డందించు సుళువు, కుజు డందించు సంకల్పశక్తి, చంద్రు డందించు గ్రాహక శక్తి సరిచేసుకొనుటకు, సరిగ వినియోగించుకొనుటకు జ్యోతిర్విద్య తప్పక వినియోగపడును.

జ్యోతిశ్శాస్త్రమును వినియోగించు సాధకుడు శాస్త్ర సిద్ధాంతము లకు లోబడి జీవించుట చేయరాదు. శాస్త్రమును వినియోగించుట యందు శ్రద్ధ యుండవలెనే గాని లోబడి జీవించుట వికాసమునకు దారి చూపదు. అర్థశాస్త్రము ద్వారా అర్థమునకు లోబడినట్లు జ్యోతిషము ద్వారా గ్రహ భావములకు బందీకారాదు. అట్టివారు శాస్త్ర నిపుణులు కారు. నిపుణులనగా కాలమును దేశమును బట్టి శాస్త్రమును విని

మయము చేయువారు. యోగము నెట్లు నిర్వర్తించు కొనవలెనో తెలియుటకు శాస్త్ర వినిమయముగాని, దానికి లోబడి బ్రతుకుట అవివేకము. మా దృష్టిలో సాధకుని సంకల్పబలము గ్రహబలము కన్న గొప్పది. సత్సంకల్ప శక్తిని యుక్తియుక్తముగ నిర్వర్తించుకొనుటకే శాస్త్రములు, విద్యలు ఏర్పడి యున్నవి. తమకు తాము శాస్త్రములకు లోబడి జీవించుటకు కాదు.

## 92

## స్థూల - సూక్ష్మములు

దివ్యలోకములను ఊహించుట ఎంత కష్టమో అంత సులభము కూడ. స్థూల లోకము దివ్యలోకముతో ముడిపడియున్నదే కాని వేరుగ లేదు. స్థూలము నుండి సూక్ష్మమునకు, సూక్ష్మము నుండి స్థూలమునకు దారులు కలవు. వెలుగు, వేడిమి, అందము అను అంశముల యందు స్థూలము కన్న సూక్ష్మము శ్రేష్ఠముగ నుండునే కాని రెంటి నడుమ రూపములు అత్యధికమగు భిన్నత్వము కలిగియుండవు. లేత ఆకు క్రమముగ ముదిరినపుడు సారూప్యతను గమనించుట కష్టము కాదు కదా! చిగురుటాకు యందు కాంతివలన వర్ణము ప్రస్ఫుటమై యుండును. ముదురుటాకు యందు కాంతి లోపించును. పదార్థము ముదురుట వలన కాంతి లోపించినదని తెలియుచుండును.

అదే విధముగ భావమునందు స్ఫూర్తివంతము, కాంతివంతము అగు భావములు తరుగుట వలన, పదార్థమయమగు భావములు పెరుగుట వలన జీవుడు స్థూలములోనికి (సూక్ష్మము నుండి) జారును. మరల సూక్ష్మములోనికి పెరుగుటకు కాంతివంతమగు భావములను ఆశ్రయింపవలెను. అందులకే అగ్ని ఆరాధన, సూర్య ఆరాధన,

గాయత్రి ఆరాధన, యితర దేవతల ఆరాధనలు. సాధకునకు భావమున వెలుగు ప్రధానముగ నిండి యుండవలెను. కాంతిపరమగు విషయము లందు ఆసక్తి మెండై యుండవలెను. భావమున కాంతి నింపుకొనుటకే బాహ్యమున దీపాలంకరణము, పుష్పాలంకరణము మరియు కాంతి వంతమగు దేవతా విగ్రహములు. లో కాంతి పెరిగినకొలది జీవుడు సూక్ష్మములోని కెదుగును.

93

## సూక్ష్మద్వారము

నీలో స్థూలము నుండి సూక్ష్మమునకు చేరుటకు మార్గ మున్నది. దానికి నీవు శ్వాస నాలంబనము గావించుకొనవలెను. శ్వాసతో పాటు లోనికేగుట నేర్వవలెను. లోనికేగిన శ్వాస వెనుదిరిగి బయల్వెడలు చోట క్రమముగ మనసు నిలుపవలెను. అచ్చటనే నీలోనికి నీవేగు మార్గము నిక్షిప్తమై యున్నది. అచట నుండుట నేర్చుము. అచ్చటనున్న స్పందనమును వినుచుండుము. తదేకముగ స్పందన శబ్దమును శ్రవణము చేయుచు అచ్చటనే పడియుండుము. ఎట్టి అంతరాయములు కలిగినను లెక్కచేయక, స్పందన నంటి పెట్టుకొని యుండుము.

బాహ్య జీవనమున ఒత్తిడి అధికమైనపుడే అంతరంగమున కూడ ప్రవేశ అవకాశము మెండుగ నుండును. క్లిష్ట సమయముల యందే దివ్యోపదేశము జరుగును కదా! అర్జునునకు యుద్ధమునందు, ఏసునకు శిలువపైన, బుద్ధునకు ప్రాణావసాన దశలో ఉపదేశము లైనవి. బాహ్య ఒత్తిడిని అంతరంగ వికాసమునకు అవకాశముగ భావించి, స్పందన నాశ్రయించి యుండుము. నీ లోనుండి ద్వారము తెరువబడ గలదు.

## 94

# పవిత్రీకరణము

స్ఫటిక లింగములు, సాలగ్రామములు, వజ్రములు, నీలములు, కెంపులు, పచ్చలు, పగడములు, ముత్యములు అందరిని ఆకర్షించుచు నున్నవి. కారణము వానియందలి కాంతియే. అట్టి కాంతికి కారణము అగ్నికార్యమే. అగ్నియందు అపవిత్రత దగ్ధమై పవిత్రత ప్రస్ఫుట మగును. అగ్నిచే పవిత్రింపబడుట వలన పై తెలిపిన వస్తువులు పవిత్రములై శరీరధారణకు యోగ్యములై యున్నవి. ఆరాధ్యములై కూడ యున్నవి.

జీవుడు కూడ సహజముగ పవిత్రుడే. అతని నుండి ఏర్పడిన పంచకోశములు పవిత్రముగ నుంచుకొనుట అతని బాధ్యత. పంచకోశ ముల అపవిత్రతను బట్టియే జీవుని ప్రకాశము మరుగున పడుచున్నది. కోశములనెంత పరిశుభ్రత గావించుకొనునో అంతటి ప్రకాశమతని కబ్బును. మట్టిని, నీటిని, అగ్నిని, వాయువును ఎట్లు వినియోగించు కొనవలెనో మానవుడు తెలిసియుండవలెను. అట్లే భావములు, కోరికలు, శరీరము కూడ సద్వినియోగము గావించుకొనుట నేర్వ వలెను. సర్వ సాధనలు తనను తాను పవిత్రీకరించుకొనుట కొరకే.

95

## అగ్నియోగము

**అ**గ్నియోగ ప్రవేశమునకు అర్హత గలవారు బహు తక్కువ. ఆసక్తి గలవారు బహు మెండు. మానవుల హృదయమునందలి కిల్బిషముల కారణముగ అగ్నియోగము నావిష్కరించుట క్లిష్టమైనది. పవిత్ర హృదయములో అగ్నిని భరించి ధరించగలరు. ఇతరులకు అగ్నియోగము వలన అపాయములు చేకూరును. మరణము కూడ సంభవించును. హృదయ నైర్మల్యమే అమృతత్త్వమునకు పునాది. ఆధునిక జీవనమున దేశ కాల పరిస్థితులను బట్టి హృదయ పవిత్రత నిలుపుకొనుట దుర్లభమై యున్నది. భావ పవిత్రత వలననే హృదయ పవిత్రత కలుగును. భావము నందు కామ క్రోధ మద లోభములు తరచుగ భాసించునపుడు నిర్మలత్వము దెబ్బతినును. అట్టివారు అగ్నియోగము వలన దుఃఖితు లగుదురు. ప్రాణమును కూడ కోల్పోవుదురు. కనుక ఈ యోగము గుహాంతర్గత నివాసులకే పరిమితమై యున్నది. అగ్నియోగము ఆశయముగ కలవారు తమ దేహ ఇంద్రియ మనో బుద్ధులను దైనందినముగ హితప్రదము గావించుట నేర్వవలెను. అట్టివారికి అగ్నియోగ బృందము ఆశీర్వచ నముల నిచ్చును.

# 96

## భావ పరిణామము

సాధకుడొకడు మౌనము పాటించుటకై ముఖమును గుడ్డతో కప్పివైచి ముడి వేసెను. మాటాడుటకు వీలు లేకుండునట్లుగ నాలుకను పీటముడితో బంధించెను. జలాహారము మాత్రమే స్వీకరించునట్లుగ మూతిని బిగించెను. అతడొకనాడు సాయంత్రము సముద్రతీరమున నుండగ పసివాడొకడు ప్రాకుచు సముద్ర తరంగముల చేరెను. అతని తలిదండ్రులు తీరముననే క్రీడలలో మునిగియుండిరి. పిల్లవాడు నీటిని చేరుట వారు గమనింపలేదు. గమనించుచున్న సాధకుడు హెచ్చ రించుటకై ప్రయత్నింపగ తానేర్పరచుకున్న ముఖబంధము అడ్డమై నిలచెను. ఆతురతలో దానిని విప్పుట యందు విఫలుడయ్యెను. ఈ లోపున పసివాడు తరంగములచే సముద్రములోనికి ఆకర్షింపబడి మృతి చెందెను. తనను తాను బంధించుకొనుట వలన సాధకుడు బాలుని విషయమున నిస్సహాయుడై నిలచెను. దీక్షను గూర్చిన మూర్ఖత్వమే అతనికా స్థితి కలిగించినది. సాధన సరళముగ నుండ వలెను. సాధన యందు మూర్ఖత్వము ముప్పునకు దారి తీయును. మూర్ఖునకు పరిణామము అసాధ్యము. భావ పరిణామమే నిజమగు పరిణామము.

97

## స్వ భావములు

సాధకుడు తనను గూర్చిన భావములను అగ్ని కాహుతి చేయ వలెను. తనను గూర్చిన అంచనా తనకు నిరుపయోగమేగాక భ్రమ, భ్రాంతి కలిగించి తప్పుడు త్రోవను పట్టించును. సాధకుడు తికమక పడును. అపాయములను కొనితెచ్చుకొనును. జీవితము క్రమముగ నిష్ప్రయోజనమై నిలచును. ధూమ్ర మార్గమున ప్రవేశించి సాధకుడు జన్మలతరబడి మందుడు, మూర్ఖుడు అగును. సాధనా సూత్రములను పాటించుచు, దైనందినముగ జీవితమును పండించుకొనుటయే ప్రధానముగాని స్వయమును గూర్చిన భావన వర్జనీయము. ప్రతి నిత్యమును సత్కార్యములతో భాండాగారమును పండించుకొనుట సాధకుని కర్తవ్యమై యున్నది. ఊహాజనిత భావములతో వసించుట హానికరమై ప్రాణమును సైతము హరింప గలవు.

భావములు ఊహాజనితములు కావచ్చును. మనోజనితములు కావచ్చును. హృదయ జనితములు కావచ్చును. మూడవ రకము భావములనే సాధకు డాచరించుచు ఇతర భావములను అగ్నికి సమర్పణము చేయవలెను. ఇట్లాచరించు సాధకుడు శ్రేయోమార్గమున పయనించును.

## 98

## హెచ్చరిక

**పే**లుడు పదార్థములు తయారీ చేయుచోట పొగ త్రాగుట, అగ్గిపుల్ల వెలిగించుట, వంట చేయుట ఎవ్వరునూ చేయరు, చేయ నివ్వరు. ప్రత్యేకమగు దుస్తులు ధరించి, పాదరక్షలు హస్తరక్షలు కూడ ధరింతురు. కన్నులను, ముక్కును, చెవులను కూడ భద్రపరచు కొందురు. అప్రమత్తులై యుందురు. భౌతికముగ నపాయమునకు యింతటి భద్రత నేర్పరచుకొను మానవుడు వాచికము, మానసికము అగు అపాయముల విషయమున మూర్ఖుడై ప్రవర్తించు చున్నాడు.

మాటపేలుడు పేలుడు పదార్థముకన్న తీవ్రమైనది. దీని విషయ మున సాధకుడు తగు జాగ్రత్త వహించుట లేదు. అట్లే భావము నందు కూడ అనేకానేక విస్ఫోటములు జరుగుచు నున్నవి. వాచిక మానసిక విస్ఫోటములు వాతావరణమును కలుషితము చేయు చున్నవి. సూక్ష్మలోక విస్ఫోటనములు భౌతిక లోక విస్ఫోటములకన్న అపాయ కరము. సాధకుని యందు ఇట్టి విస్ఫోటములు జరుగుటవలన సాధన కుంటుపడు చుండును. అంతరంగము ప్రశాంతముగ నున్నపుడే సాధన సాధ్యము. బాహ్యమునెంత తీర్చిదిద్దుకొను చున్నను అంతరంగ విస్ఫోటములను అంతరంగ ధ్యానముననే చక్కబరచుకొన వచ్చును.

99

## అగ్ని ప్రజ్వలనము

"**అ**జ్ఞానమే నరకము." అజ్ఞానము బట్టియే భయము, దుఃఖము ఆవరించు చుండును. అజ్ఞానము చీకటి వంటిది. జ్ఞానము అగ్నివంటిది. జ్ఞానాగ్ని సహాయమున అజ్ఞానము నిర్మూలించుకొన వచ్చును. ప్రతి మానవుని యందును పంచకోశములుగ పంచ భూతము లున్నవి. అందు మధ్యస్థమై అగ్ని యున్నది. అగ్ని అంతటను పవిత్రము చేయగలదు. మలములను హరించు అమరత్వము నీయ గలదు. అగ్నిని సద్వినియోగము చేయుట అగ్నియోగము. అగ్ని ద్వారా పదార్థమును, జలమును పవిత్రీకరించ వచ్చును. వాయువు ద్వారా అగ్నిని ప్రజ్వలింప జేయవచ్చును. వాయువు అగ్నిని, అగ్ని వాయువును బలపరచును. ఈ రెండు భూతములను సద్వినియోగము చేయుటయే యోగము. వీని సద్వినియోగము వలన జలము, పదార్థము నిర్మలము కాగా, పంచకోశాత్మకమగు దేహము శాంతి నివాసమై యుండును. అట్టి నివాసమున ఆకాశరూపుడగు జీవుడు తన స్వస్వరూపమును దర్శించుచు, తన కర్తవ్యమెరిగి, వానిని నిర్వర్తించుచు సుఖియై యుండును.

యోగసాధనకు శ్వాసద్వారా అగ్ని ప్రజ్వలనము గావించుటయే ప్రధాన కర్తవ్యము.


## 100

# కవచము

**క**ల్మష హృదయులకు అగ్ని ప్రచోదనము జరుగును. ఎదుటి వాని సుఖమును హరించువాడు, దుఃఖములు కలిగించువాడు ప్రార్థనలు చేయుట ప్రమాదకరము. తాను యితరులకు ఏది కోరునో అదియే తనకు లభించు చుండును. ఇతరుల పతనము కోరుచు, వారిపై ద్వేషమును పెంచుకొనుచు ప్రార్థనలు చేయు సాధకులు మూర్ఖులు. తన బాగు కోరుట కన్న ఇతరుల బాగు కోరువారు నిష్కారణముగ సుఖింతురు. ఎదుటి వారి క్షేమమును, వృద్ధిని కోరువారే స్వీయ రక్షణ కవచము ధరించినవారు. సకల జీవుల శ్రేయస్సు కోరు మహాత్ములు సహజ కవచ కుండలములు ధరించిన వారు.

హృదయమున మాలిన్యమున్నపుడు ఎట్టి మహత్తరమగు కవచ ములైనను నిరుపయోగములే యగును. పుట్టుకతో దివ్య కవచము కలిగిన కర్ణుడు నశించలేదా! లోకహితులు సహజ కవచధారులు. వారి హిత భావమే వారికి కవచము. తపస్సులవలన, ప్రార్థనల వలన ఏర్పరచుకొన్న కవచముల కన్న లోకహితము కారణముగ

ఏర్పడు కవచము మంగళప్రదము. అహింసయే కవచముగ ఎందరో కడతేరినారు. అహింస, సత్యము, ప్రేమ, దయ ఇత్యాది గుణములే కవచములు.



## 101

# లౌక్యము

**గుం**డె లేని ప్రాణి లేదు. గుండె గల ప్రతి ప్రాణికిని హృదయ ముండి తీరును. హృదయము నందు కరుణ దయ ప్రేమ మమకారము ఉండితీరును. క్రూరజంతువు నందుకూడ హృదయ మున్నది. కనుకనే తనవారిని రక్షించుకొనుట, పోషించుకొనుట చేయుచుండును. క్రూర మృగము లెన్నియో మానవులకు సహాయపడిన ఉదంతము లున్నవి.

హృదయమే దివ్య కేంద్రము. హృదయము నుండి వర్తించుట సాధకుడు నేర్వవలసిన పాఠము. హృదయమున వసించక ఎన్ని నేర్చినను, ఎన్ని చేసినను అట్టి కార్యములకు సార్థక్య ముండదు.

హృదయ మున్నచోట లౌక్యముండదు. హృదయస్థునకు లౌక్యము చౌకబారు పనిముట్టుగ గోచరించును. చౌకబారు మనుషులే లౌక్య మాధారముగ జీవింతురు. వారు గుండె యుండియు లేనివారే. గుండెను పెంచుకొన్నవాడే నిజమగు సంస్కారవంతుడు. లౌక్యము పెంచుకొను వాడు తెగిన గాలిపటమువలె జీవితావసరములకు అనుగుణముగ ధర్మములను, శాస్త్రములను అన్వయించుకొనుచు మరణించును. 'మానవత' అన్న పదము గుండె గలవారికే వర్తించును. లౌక్యులకు వర్తించదు.

(102)

## వింత జబ్బు

**బా**ధపడుట ఒక జబ్బు. ఈ జబ్బు గలవాడు ఎట్టి జబ్బులు లేకున్నను బాధపడును. తన బాధకు బైట కారణము వెతుకుట మూర్ఖత్వము. కారణమున్ననూ బాధపడని వారున్నారు. కారణము లేకున్ననూ బాధపడువా రున్నారు. ఊరకనే బాధపడుట, తీరి కూర్చొని నిష్పంటించుకొనుట. నాగరిక మానవునకు ఇది ఒక మోజై యున్నది.

బాధకు చుట్టము భయము. బాధ పడువారిని భయము చేరును. భయము, బాధ కలిసి ఆందోళన నేర్పరచును. కారణములేని ఆందోళన ప్రాణమును చెరచును. నిద్రను చెరచును. అన్నియు కలిసి ఆకలిని చెరచును. ఆకళింపును చెరచును. అన్నిటికి మూలము మనసునందు ఏర్పరచుకొన్న అకారణమగు బాధయే. బాధపడుట మాని ఏదో ఒక కార్యమున నిమగ్నమై యుండుట యుక్తి. పసిపిల్లలు నిదురలేచిన నుండి ఏదో ఒక విధముగ మనసేంద్రియ శరీరములను వినియోగించుచునే యుందురు. కనుక వారి మనసును బాధ అంటదు. బాధ అంటకుండుటకు ఉపాయము వారియందు గోచ రించును. బాధపడువారు ఊరకుండుట వలన బాధను పెంచు కొందురు. కార్య నిమగ్నముననే బాధ హరింపబడును.

103

# పిల్లచేష్ట

హృదయమొక దేవాలయమని, మందిరమని అందరు తెలుపుదురు. దేవాలయ మనగా విగ్రహములకు నెలవని భావించుట అజ్ఞానము. మేము విగ్రహారాధనమునకు వ్యతిరేకము కాదు. కాని హృదయములందు మనసునకు నచ్చిన రూపములు ప్రతిష్ఠించుకొనుట వలన ఆరాధకులు సత్యదూరు లగుదురు. మానవు డేర్పరచుకున్న దైవరూపములు హృదయమున స్థాపించుకొనుటకన్న ఆరాధనలు చేయుచు, హృదయమందు వెలుగును దర్శించుట ఉత్తమము. దైవ మే రూపమున అనుగ్రహించ దలచునో అది దైవమునకే వదలి, వెలుగు నారాధించుట ముఖ్యము. ప్రాచీను లందరును హృదయమున వెలుగునే ఆరాధించిరి గాని విగ్రహములను, చిత్రపటములను కాదు.

ఆరాధన ప్రారంభించు సమయమున సద్గురువును హృదయ మున దర్శింప వచ్చును. కాని సద్గురు రూప ధ్యానము సముచితము కాదు. అతడు మార్గదర్శియేగాని గమ్యము కాదు. నిజమగు సద్గురువు అతని రూపముపై ఆరాధనమును అంగీకరింపడు. అతనిని స్మరించి, అతడు ఏ వెలుగును అనుసరించు చున్నాడో ఆ వెలుగునే ధ్యానము చేయుమని తెలుపును. ఆ వెలుగు అన్నిటికి మూలమైన వెలుగు. దానికి నామరూపములు కలిగించుట పిల్లచేష్ట.

104

## కాంతిరేఖ

హృదయము నీ మూలమునకు మార్గము సృష్టి మూలమునకు గూడ అదియే మార్గము. 'నేను' అను ప్రజ్ఞకు మూలమేది? అను ప్రశ్నకు హృదయగుహయే మార్గమై యున్నది. అందు ప్రవేశించిన వాడు మూడు గుహలను దాటును. మూలమును చేరును. మూలము నుండియే వరుసగ ముగ్గురు సూర్యులు వచ్చిరి. మూలము నుండియే ముగురమ్మలు వచ్చిరి. మూలము నుండియే త్రిమూర్తులు వచ్చిరి. మూలము నుండియే ప్రజ్ఞ, శక్తి, పదార్థము లేర్పడినవి. మూలము నుండియే పరమాత్మ, జీవాత్మ, దేహాత్మ లేర్పడినవి.

హృదయము గమ్యము కాదు. హృదయమొక మార్గము. మార్గము చేరినవాడు గమ్యమునకై పయనించవలెను గదా! హృదయ మును చేరిన పిదప ఆజ్ఞను చేరుట, అటుపైన సహస్రారమును చేరుట, అటుపైన సమస్తమున లీనమగుట మార్గమై యున్నది. తెలిసినవా రందరును హృదయమునే సూచింతురు. అనగా మార్గమును సూచించు చున్నారు.

హృదయమును చేరి ఒక వజ్రపు కాంతిరేఖను అనుసరించి గౌతమబుద్ధుడు సహస్రారమున స్థిరపడెను. అదృశ్యసీమల లోనికి

దారి చూపునది హృదయము. నిచ్చెనలు వేయునది కాంతిరేఖ. హృదయమును చేరి కాంతిరేఖ ఆధారముగ ఊర్ధ్వమునకు చనుట మార్గము.

## 105

## సత్య సాధన

**హిం**దువుల దేవాలయములు ధ్వంసమైనవి. యూదుల దేవాలయములు కూడ ధ్వంసమైనవి. అయోధ్య, జరూసలం నిత్య ఘర్షణలో యున్నవి. క్రైస్తవుల దేవాలయములు, ముస్లిముల దేవాలయములు కూడ దాడికి గురియగు చున్నవి. దీని నుండి తెలియ వలసినది ఏమి?

దేవాలయములు హృదయమునకు సంకేతము. హృదయమే నిజమగు దేవాలయము. మానవ హృదయములు నిత్యము చెదురు చున్నవి. కలుషిత భావములతో హృదయము చెదురుచుండగ, బాహ్యము దేవాలయమును చెరుపుచున్నది. సగటు మానవుడు పోటీ పడుట, ఆక్రమించుట, దొంగిలించుట, మోసగించుట, కామించుట యిత్యాది ఆయుధములతో హృదయ మను దేవాలయమును అను నిత్యము ధ్వంసము చేయుచున్నాడు. జాతియందు హృద్రోగములు మెండుగ నున్నవి. హృదయమున దేవాలయము పదిలముగ నుంచు కొనువాడు, పటిష్ఠముగ ఏర్పరచుకొనువాడు అరుదుగ గోచరించు చున్నాడు.

బాహ్యమున మట్టితో కట్టు దేవాలయముకన్న అంతరంగమున వెలుగుతో నిర్మించు దేవాలయము ఎంతయో శ్రేష్ఠము. దానికి వలసిన పనిముట్లను ఏర్పరచుకొని ఆలయ నిర్మాణము చేయుట సాధనము.

# 106

## గోరీ

హృదయమున గోరీలు కట్టకుడు. సందేహమే గోరీ. సందేహము సర్వమును నశింపజేయును. సంశయించువాడు నాశము చెందును. విశ్వాసము ఎంత అందమైనదో అవిశ్వాసము అంత వికృత మైనది. సందేహ నివృత్తి చేసుకొనుట, విశ్వాసమును పొందుట మానవునకు కర్తవ్యమై యున్నది. సందేహ నివృత్తి ఒక యజ్ఞము. ఒక దీక్ష. ఒక కట్టుబాటు.

భక్తిశ్రద్ధలు కలిగినవానికి సందేహము లన్నియు నివృత్తి యగు చుండును. నివృత్తి చేసుకొనక ముందుకు సాగుట కష్టము. తాను ప్రణవ స్వరూపుడని తెలియవలెనన్నచో ప్రథమముగ శ్వాసను అనుస రించవలెను. శ్వాస, స్పందనము వద్దకు తోడ్కొని పోవును. స్పందనము ప్రాణము వద్దకు కొనిపోవును. ప్రాణము ప్రణవము వద్దకు తోడ్కొని పోవును. ఇట్లు అంచలంచెలుగ సత్యమునకు దారి లభించి సత్యదర్శన మగును.

హృదయమును చేరినచో గురుపరంపర పరిచయ మగును. గురుపరంపర పరిచయమైనచో అనంతమునకు దారి పరిచయ మగును. ఆ దారిని నడచినచో తాను శాశ్వతుడనని తెలియును.

తనవంతు కర్తవ్యము తెలియును. దివ్యవైభవ మన నేమో తెలియును. ఒక క్రమమున సందేహములు నివృత్తి కొనుచు, ముందుకు సాగవలెనుగాని తనకు తాను గోరీ కట్టుకొనరాదు.

107

## బానిసత్వము

**మా**నవుడు మనసు ప్రధానముగ జీవించువాడగుట వలన, మనసు అలవాట్లాధారముగ జీవించుట నేర్చుట వలన, అలవాట్లకు యిబ్బంది కలిగినపుడు మనస్సున ఘర్షణ కలుగును. అలవాట్లేర్పరచు కొనుచు, మనసు స్థిరత్వము చెందుటకు ప్రయత్నించును. మనసు తానేర్పరచుకొన్న అలవాట్లకు తాను లొంగి, తదనుగుణమగు సౌకర్యములు లభించినపుడెల్ల దుఃఖపడుచుండును, కష్టమనిపించు చుండును.

ఉదయమే కాఫీ, టీల కలవాటు పడ్డ మనసు అవిలేనిచో బాధ పడును. భార్య, భర్తలకు అలవాటుపడ్డ మనసు లేనపుడు బాధ పడుచుండును. అట్లే సంతానము. ఆహారపు టలవాట్లు, ధన సంపాదన, కార్యక్రమములు, ఆరోగ్యపుటలవాట్లు, సంఘ కార్యక్రమ ముల అలవాట్లు, ఇట్లంతయు అలవాట్లమయమే. అలవాట్లు తా నేర్పరచుకొన్నవి. తన సౌకర్యమున కేర్పరచుకొన్నవి. వానికి సృష్టికర్త తానే. తానేర్పరచుకొన్నవి తనకు లభించనపుడు దుఃఖపడకుండుటయే స్వామిత్వము. దుఃఖపడుట బానిసత్వము. సత్సాధకుడు అలవాట్ల నేర్పరచుకొన్నను వాటికి బందీ కారాదు.

108

## లోకహితుడు

**జీ**వితమున ఘర్షణములు రెండు రకములుగ నున్నవి. ఒకటి బాహ్య ఘర్షణము, రెండు అంతరంగ ఘర్షణము. బాహ్య ఘర్షణము కన్న అంతర్ఘర్షణమునకు బలమెక్కువ. కాలమును దేశమును బట్టి బాహ్య ఘర్షణములు పరిష్కరింపబడును. అంతర్ఘర్షణములు లోతైనవి గనుక తాను ప్రయత్నించి మార్చుకొనుట ఒక్కటియే మార్గము. తానుగ ఘర్షణాత్మకమగు బుద్ధిని మార్చుకొనలేడు గనుక సద్గురు సమాశ్రయము, సత్సంగము ఆవశ్యకములై నిలచినవి. అంతరంగమున ఏర్పడిన ఘర్షణమునకు పరిష్కారము జ్ఞాన మొక్కటియే. జ్ఞాన సముపార్జనము, ధర్మాచరణము నిత్యము నిర్వర్తించుకొను సాధకునకు సద్గురువు ఆశ్రయము లభించును. ఇది ప్రకృతి ధర్మము. తాను పొందుచున్న కొద్దిపాటి జ్ఞానము ఆచరణము నందుంచుచు, మానవ ధర్మము నెరిగి జీవితము గడుపుచున్న వానికి తప్పక సద్గురువు లభింపగలడు. అతని అనుసరణమున బాహ్యాంతర ఘర్షణములను దాటి జీవుడు క్రమముగ లోకహితుడై వెలుగొందును. ఘర్షణములు లేనివాడే నిజమగు హితమును చేకూర్చగలడు.

## 109

## ఆరోహణము

**మ**హాత్ముల కథలలో పర్వతారోహణము కనిపించు చుండును. రామాయణమున హనుమంతుడు మహేంద్ర పర్వతము నెక్కెను. సముద్రమును లంఘించి రావణ సంహారమునకు నాంది పలికెను.

భారతమున భీముడు గంధమాదన పర్వత మెక్కి హనుమంతుని అనుగ్రహమును పొంది, భారత యుద్ధమున విజయము సాధించెను.

బైబిలు పూర్వ నిబంధనము నందు మోసెస్ సినాయి పర్వతము నెక్కి భగవదనుగ్రహము పొంది యూదు జాతిని బానిసత్వము నుండి రక్షించెను.

బైబిలు నూతన నిబంధనములందు ఏసు ఆకర్షణ పర్వతము నెక్కి ధ్యానించి దివ్యదేహమును పొంది భాగవత బోధ చేసెను.

అర్జునుడు ఇంద్రకీలాద్రి పర్వతమునెక్కి శివుని గూర్చి తపస్సు చేసి పాశుపతమును పొందెను.

పర్వతారోహణము ఒక యోగము. ఆకతాయిగ పర్వతము లెక్కుట అజ్ఞానము. పర్వతమునుండి అవరోహణము చేసిన ప్రతి సాధకుడు మహత్కార్యములను చేసినాడు.

# 110

## మార్గము - గమ్యము

వెలుగులోనికి ప్రవేశించిన సాధకుడు మరల చీకటిలోనికి రావలసి యున్నది. తాను వెలుగులోనికి చనుట అను ప్రయత్నము స్ఫూర్తివంతమైనది. స్ఫూర్తిగలవారు ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తులను సమన్వయించుకొనుచు, పదను పెట్టుకొనుచు వెలుగు లోకములోనికి ప్రవేశింతురు. విశాలత్వమును చవి చూతురు. నిర్బంధ స్థితి ననుభ వింతురు. ఆనందమన నేమో తెలియుదురు. సత్యధర్మముల నెరుగుదురు. వానితోపాటు సహజమగు పరమప్రేమ భావమును పొందుదురు. సత్య ధర్మ శాంతి ప్రేమలను పొందిన జీవుడు, ప్రేమ భావముచేత తోటి జీవులకై పరితపించును. ఆ తపన మమకారము లేని తపన. జీవులందరును అపరమిత లోకములలోనికి ప్రవేశింపవలె నని, ఆనందమును పొందవలెనని, సంకుచితత్వము నుండి వారికి విడుదల కలుగవలెనని తపింతురు.

కనుక వారు తిరిగి చీకటి లోకమున ప్రవేశింతురు. వారి యందలి దివ్య జ్ఞానము దీపమై పరిసరములకు కాంతి ప్రసారము చేయుచుండగ, ఒక్కొక్కరుగ జీవులు చేరి, వెలుగు మార్గమున ప్రవేశించి తరింతురు. ఆత్మ జ్ఞానమునకు పర్యవసానము లోకహి తము. అట్టి లోకహితులకు వేరొక గమ్యము లేదు. మార్గమే గమ్యమై నిలచును.

# 111

## నిరహంకారము

నిరహంకారునికే సత్యదర్శనము సాధ్యము. నిరహంకారునికే నిర్వాణపదము సాధ్యము. నిర్వాణపదమే శివపదము. దైవము తెలియుటకు అహంకారమే సాధనము. అదియే అవరోధము కూడ. తాను దైవములోనికి కరగుట జరిగినపుడే దైవము తానుగ నుండుట జరుగును. తనను తాను దైవమునకు సమర్పించుకొనుచు, దైవమునకే తనయందు అగ్రస్థానమొనర్చి, తాను బంటువలె నుండువాడు ధన్యుడు. తపస్సు, స్వాధ్యాయము, పరహితము వలన దైవముతో పాటు అహంకారము కూడ పెరుగు అపాయమున్నది. అట్టి సమయ మున తనకు తానే అడ్డుగోడయై యుండును.

నిర్మలమగు మనస్సుపై మలినము వంటిది అహంకారము. స్వచ్ఛమగు అద్దముపై పేడ చిమ్మిన, అద్దము నిరుపయోగమే అగును. మానవుల మనస్సుపై అట్టి మలినము అనేక విధములుగ ఏర్పడు చుండును. దానిని నిత్యము అప్రమత్తతతో, భక్తితో, శ్రద్ధతో నిర్మూ లించుకొని, ప్రార్థన ద్వారా దైవమును ఆవాహనము చేసుకొని వసించుట సత్సాధకుల కర్తవ్యము.

అహంకార మనేక విధములుగ నుండును. తాను ప్రత్యేకమని

భావించుటయే అహంకారమునకు పునాది. కులము చేత, మతము చేత, జాతిచేత అనేక విధములగు అహంకార మలినములు చేరు చుండును. అధికారులు, ధనికులు, నాయకులు మతపెద్దలు కూడ అధికార మదమునకు తరచు లోనగుచుందురు. అన్నిటి కన్న పెద్ద అహంకార మేమనగ ఈ భూమిపైనే జీవులున్నారని భావించుట. ఇది భౌగోళిక అహంకారము. బ్రహ్మాండమంతయు జీవులతో నిండి యుండగ ఇతర గోళములందు, సూర్య మండలములందు జీవులున్నా రని గుర్తింపకపోవుట కరడుగట్టిన అహంకారము. అహంకారము అవగాహనకు మితి ఏర్పరచును. దైవము అమితుడు, అపరిమితుడు. వానిని చేరు మార్గమున ఎట్టి పరిమితులకు తావివ్వరాదు.

## మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఇతర రచనలు

1. అమనస్కుడు
2. అన్వేషకుడు
3. అసంగుడు
4. అంతర్దర్శన ధ్యానములు
5. హిమాలయ గురుపరంపర
6 మైత్రేయ మహర్షి బోధలు - 1
8. మైత్రేయ మహర్షి బోధలు - 2
9. మరువు మహర్షి బోధలు - 1
10. మరువు మహర్షి బోధలు - 2
11. దేవాపి మహర్షి బోధలు - 1
12 దేవాపి మహర్షి బోధలు - 2
13. ధనకాముని కథ
14. గీతోపనిషత్ - జ్ఞాన యోగము
15. గీతోపనిషత్ - కర్మ యోగము
16. గీతోపనిషత్ - సాంఖ్య యోగము
17. గీతోపనిషత్ - ధ్యాన యోగము
18. గీతోపనిషత్ - కర్మసన్యాస యోగము
19. గీతోపనిషత్ - విజ్ఞాన యోగము
20. H.P.B. ఆత్మసాధనా సూత్రములు

21. సంఘనీతి
22. శ్రీ లలిత (10 భాగములు)
23. కథాదీపిక
24. మన మాస్టరుగారు
25. మాస్టర్ సి.వి.వి. యోగము
26. శ్రీకృష్ణ నామామృతము
27. సాయి సూక్తులు
28. శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు
29. ఓం
30. శ్రీ గురుపాదుకా స్తవము
31. భారతీయ సంప్రదాయము
32. మాస్టర్ సి.వి.వి. నూతన యోగము
33. మాస్టర్ సి.వి.వి. యోగము - కర్మరాహిత్యము
34. శ్రీ దత్తాత్రేయ
35. అంబరీషుడు
36. రుక్మిణీ కళ్యాణము

---

Please visit our website
(www.dhanistha.org.
info@dhanistha.org.) for Copies



మరువు మహర్షి సూర్యవంశపు రాజు. ఇక్ష్వాకు వంశమువాడు. అనగా శ్రీరాముని వంశమువాడు. అనగా త్రేతా యుగము నుండి భూమిపై నున్నవాడు. అంతకు ముందునుండి కూడ యుండి యుండవచ్చును. వాసుదేవుని వ్యూహమున అనాదికాలముగ పనిచేయుచు తెరవెనుక నుండుట కెక్కువ అభిలషించిరని అనిపించును. మహర్షుల పుట్టుపూర్వోత్తరములు మనకు పురాణసంహితలలో లభ్యమగును. వారు చేసిన సాధనలు కూడ లభ్యమగును. కాని ఈ మహర్షుల పుట్టు పూర్వోత్తరములు, సాధనలు పురాణముల యందు కూడ లిఖింపబడలేదు. అది బహుశః వారి సంకల్పము కావచ్చును. పరాశరులు విష్ణు పురాణమున, వేదవ్యాసులు భాగవత, కల్కి పురాణములలో వీరిని తగు మాత్రము పరిచయముచేసి వదలినారు. అదియును అతి స్వల్పమే.

ధనిష్ఠ

ISBN 978-81-89467-66-1